# నేను [illegible]

[illegible]

ISLAM JIS SE MUJHE
ISHQUE HAI
(Telugu)

# నేను ఆరాధించే ఇస్లాం

మూలం : అడియార్

అనువాదం : శ్రీమతి మాలతీ చందూర్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002. ✆ :24564583

**Nenu Aaraadhinche Islam**
**Islam Jis Se Mujhe Ishque Hai** (Telugu)


**TIP Series No.** : **41**

Written by : Adiyar

Translated by : Smt. Malati Chendur



All Rights Reserved with Publishers



24th Edition : May 2019

Copies : *2000*

**Price** : **Rs.60**

ISBN : 81 - 86826 - 07 - 6

Published by : **Telugu Islamic Publications Trust**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | ఎంత అద్భుతమైన విషయం ..... | ..... V |
| 2. | ముందుమాట ..... | ..... VII |
| 3. | మా మాట ..... | ..... VIII |
| 4. | మానవజాతికి మనోహరమైన ఆదర్శం | ..... 1 |
| 5. | గొర్రెల కాపరి అయిన రాజాధిరాజు | ..... 6 |
| 6. | విగ్రహమూ, చిత్రమూలేని 'శూన్యం' | ..... 11 |
| 7. | ఇతర భాషలలో దైవ ప్రవక్తలు | ..... 16 |
| 8. | అద్భుతములు చెయ్యని అద్భుత నాయకుడు | ..... 19 |
| 9. | భగవంతుని కుమారుడా ఏసు ? | ..... 23 |
| 10. | అల్ ఖుర్ఆన్‌లోని విశిష్టత | ..... 27 |
| 11. | నిరక్షరాసి అనే దానికి కొత్త భావం | ..... 33 |
| 12. | జీవ భాషలో సజీవ సందేశం | ..... 38 |
| 13. | గుప్తంకాని గొప్ప గ్రంథం | ..... 43 |
| 14. | మానవ జాతికి 'మాగ్నా కార్టా' | ..... 48 |
| 15. | మానవతకి ప్రతిరూపమైన మార్గం | ..... 54 |
| 16. | ఇస్లామ్‌ను గురించి అన్నారిలా | ..... 58 |
| 17. | నా మనుసులోని మాట | ..... 62 |
| 18. | ఆ మాట.... ప్రపంచ ప్రముఖుల నోట ! | ..... 67 |

| | | |
|---|---|---|
| 19. | మహాప్రవక్త రాకను గూర్చి | ..... 70 |
| 20. | అణకువకీ, పట్టుదలకీ ఆలవాలము | ..... 74 |
| 21. | పరిశుభ్రతకి మరోపేరు ఇస్లామ్ | ..... 78 |
| 22. | ఇస్లామ్ - కత్తిబలంతో వ్యాపించిందా ? | ..... 82 |
| 23. | నేను ఇంకా ముస్లిమ్‌ని ఎందుకు అవలేదు? | ..... 86 |
| 24. | దివ్యఖుర్‌ఆన్ ప్రపంచ విజ్ఞాన సర్వస్వం | ..... 91 |
| 25. | ఆఖరుదాకా బీదవానిగానే ఉండాలి | ..... 95 |
| 26. | ఇస్లామ్ - క్రైస్తవములు భారతీయ మతాలే | ..... 102 |
| 27. | ఇస్లామ్ మరియు మహిళలు | ..... 109 |
| 28. | కమ్యూనిజం కంటే ఉన్నతమైన వ్యవస్థ | ..... 115 |
| 29. | సందేహాలు - సమాధానాలు | ..... 124 |
| 30. | ఇస్లామ్‌లో శిక్షలు | ..... 127 |
| 31. | దేవాలయాలను పడగొట్టారా ? | ..... 132 |

# ఎంత అద్భుతమైన విషయం !

ఎంత అద్భుతమైన విషయం ! డి.ఎమ్.కె. వంటి స్వకపోల హేతువాద ప్రేరితమైన, నాస్తిక భావజాలం మీద ఆధారపడిన రాజకీయ పార్టీలో ప్రముఖపాత్ర వహించిన ఒక ప్రసిద్ధ పాత్రికేయుడూ, రచయిత ఇస్లామ్ వైపునకు ఆకర్షితుడు కావడమేకాక, ఇస్లామ్ ప్రచారానికి అక్షరకంకణం కట్టుకోడం నమ్మలేని విషయంగా కనిపిస్తుంది. కానీ ఇది నేడు ప్రపంచం ముందు నిలిచి ప్రకాశిస్తున్న వాస్తవం! శ్రీ అడియార్ తమిళంలో రచించిన 'నేను ఆరాధించే ఇస్లామ్' అనే వ్యాసపరంపర పుస్తక రూపం సంతరించుకొని, తరువాత వివిధ భారతీయ భాషలలోకి, ఆంగ్లంలోకి అనువాదం కావడం ఆధునిక ఇస్లామ్ సాహిత్య చరిత్రలో నిజంగానే అద్భుతమైన విషయం!

'నేను ఆరాధించే ఇస్లామ్'కు ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి మాలతీ చందూర్ తనదైన శైలిలో చేసిన అనువాదం అతి సరళంగా, పఠనీయంగా వుంది. 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్' వారి ప్రచురణలలో వెల్లివిరుస్తోన్న తేటతెలుగు యిప్పటికే ప్రముఖ విమర్శకుల, భాషా శాస్త్రవేత్తల మన్ననలను అందుకున్న విషయం యిక్కడ ప్రస్తావించడం ఆహ్లాదకరంగా వుంటుంది.

మానవ జీవితానికి సంబంధించిన సమస్త రంగాలూ సంక్షోభంలోపడి కొట్టుమిట్టాడుతున్న వర్తమాన దశలో ప్రపంచం యావత్తూ నేడు ఇస్లామ్ వైపు ఆసక్తిగా చూడడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇస్లామ్ భావజాలాన్ని పలకమీది అక్షరాలవలె సునాయాసంగా తుడిచి వేయగలమని భావించిన వారు ఘోరంగా విఫలమయ్యారు. వైఫల్యాన్ని అంగీకరించలేని వారు, నిస్పృహతో ప్రపంచ వ్యాప్తంగా ముస్లిమ్ సమాజం మీద హింసాత్మక దౌర్జన్యానికి పాల్పడుతున్న వైనాలు కూడా మనం వార్తా పత్రికలలో అనుదినమూ చూస్తూనే వున్నాము. శాంతి, సౌమనస్యాల, సామాజికన్యాయ ఆకాంక్షల

కేంద్రంగా రూపుదిద్దుకున్న ఒక జీవన విధానాన్ని ఆ ్కరించడం అంత సులభంకాదు. పాశ్చాత్య సాంఘిక జీవనంలో శతాబ్దాల తరబడి రాజ్యం చేసిన విశృంఖలత క్రమంగా, క్రమబద్ధ కుటుంబ జీవనానికి చోటిస్తోన్న దాఖలాలు కనిపిస్తున్నాయి. పాశ్చాత్య వనితలు ఇస్లామ్‌లో మహిళలకుగల మహోన్నత స్వేచ్ఛను మహత్తరమైన హక్కులను గుర్తించడం ప్రారంభమైంది. ఇస్లామీయ సంస్కృతినీ, ఇస్లామీయ జీవన విలువలనీ, ఇస్లామీయ విజ్ఞానాన్నీ చిన్నచూపు చూడడం మానుకోవాలనీ, ఇస్లామీయ సమాజం నుంచి ఇతరేతర సమాజాలు, ముఖ్యంగా పాశ్చాత్య సమాజం స్వీకరించవలసింది గణనీయంగా వున్నదనీ, ఇటీవల 'ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఆఫ్ ఇస్లామిక్ స్టడీస్'లో మాట్లాడుతూ బ్రిటన్ యువరాజు చార్లెస్ అత్యంత నిజాయితీతో చేసిన సూచన నేటి పాశ్చాత్య లోకంలోని వివేచనా పరులైన ఒక వర్గం వారి ఆలోచనా సరళికి అద్దం పడుతోంది.

ఈ నేపధ్యంలో చూసినప్పుడు అడియార్‌గారి ఈ పుస్తకానికిగల ప్రాధాన్యత ఇనుమడించిందని చెప్పక తప్పదు. ఇటువంటి ఆలోచనా ప్రేరకాలయిన పుస్తకాలకు తెలుగు నాట సాధారణంగా లభించే చదువరుల సంఖ్యా పరిమితిని దృష్టిలో పెట్టుకుంటే, 'నేను ఆరాధించే ఇస్లామ్' తొలి అనువాద ప్రచురణ జరిగిన తొమ్మిదేళ్ళలోనే నాలుగవ ముద్రణకి రావడం ఈ పుస్తకం ఆవశ్యకతను చెప్పక చెబుతోంది.

'నేను ఆరాధించే ఇస్లామ్' నాలుగవ ముద్రణను అత్యాధునికమైన ఆఫ్‌సెట్ ముద్రణలో వెలువరిస్తున్నందుకు ప్రచురణకర్తలను అభినందిస్తూ, సన్మార్గగాములైన తెలుగువారి ఆదరణ దీనికి పుష్కలంగా లభించగలదని ఆశిస్తున్నాను.

***2.2.1994***
హైదరాబాదు

దేవిప్రియ

# ముందుమాట

ఈ పుస్తకంలోని వ్యాసాలు 'గీటురాయి' వార పత్రికలో ధారావాహికంగా వెలువడుతున్నపుడు పాఠకులు ప్రశ్నలతోపాటు తర్జుమా ఎవరు చేశారు? ఆ పేరు మీరెందుకు ప్రచురించటం లేదు? అని ఉత్తరాలు కురిపించటం నేను చదివాను. కొందరు, తర్జుమా చేసిన రచయిత్రి ఎందుకు పేరు చెప్పటానికి వెనుకాడుతున్నారని కూడా సూటిగా ప్రశ్నించారు.

దానికి కారణాలు ఈ ముందుమాటలో వివరిస్తున్నాను. నేను సరదాకోసం, నా అంతట నేను తమిళ భాష నేర్చుకున్నాను. భారతదేశంలోని అన్ని భాషలూ రాకపోయినా కనీసం దక్షిణాత్య భాషలన్నీ నేర్చుకోవాలన్న ఉత్సాహం నాలో చాలా రోజులబట్టీ వుంది.

నేర్చుకున్న తమిళ భాష, అనాయాచితంగా, వ్యాపకంలో ఒక భాగమైంది. లోగడ నేషనల్ బుక్ ట్రస్టుకి, కొన్ని పత్రికలకు తమిళం నుంచి తర్జుమాలు తెలుగులో రాశాను. ఇవి పాఠకులని ఆకర్షించాయి. అయితే 'మాలతీ చందూర్' అన్న రచయిత్రి అప్పటికే పాపులర్ రైటర్ అవడంచేత తర్జుమా బాగున్నది అన్న ప్రశంసలు పొందగలిగానా? లేక, నిజంగానే తమిళం నుంచి సరళంగా తర్జుమా చెయ్యగలిగిన నేర్పు నాలో వుందా? అన్న సందేహం నన్ను చాలా రోజులుగా బాధిస్తూ వుంది.

ఈ సందేహ నివృత్తికోసమే 'నేను ఆరాధించే ఇస్లామ్' అన్న వ్యాసపరంపరకు తర్జుమా చేసిన వారి పేరు వెయ్యకండి అని నేను ఒక షరతు పెట్టాను. పాఠకులు ఎవరు తర్జుమా చేశారో, పేరు తెలియకుండానే తెనుగుసేత సరళంగా, సాఫీగా జరిగింది అని మెచ్చుకున్నప్పుడు నాకు సంతోషమూ, ఆత్మవిశ్వాసమూ కలిగాయి. అన్ని మత గ్రంథాలూ శాంతిని, సహనాన్ని మానవతావాదాన్ని ప్రబోధిస్తూనే వుంటాయి. ఏ మతంలో మంచివున్నా అది గ్రహించగల శక్తి అందరిలోనూ వుండాలి. ఇదే నేను జీవితం నుంచి నేర్చుకున్న పాఠం. ఈ వ్యాసపరంపరలోని పదజాలం అక్కడక్కడ కష్టభూయిష్టంగా ఉన్నా నేనూ మీతోపాటు కొన్ని కొత్త విషయాలు తెలుసుకున్నాను. జీవితం ఒక నిరంతర పాఠశాల. అందులో ఈ రచనా ప్రక్రియ ఒక చిన్న భాగం.

మాలతీ చందూర్

23.6.84

# మా మాట

శ్రీ అడియార్ రచించిన ఈ చిరు పుస్తకం తెలుగు అనువాదాన్ని తొలుత 'గీటురాయి' వారపత్రికలో ప్రచురించడం జరిగింది. విషయంతోపాటు అనువాదం ఎంతో సరళంగా, హృద్యంగా, మనోజ్ఞమనోహరంగా ఉందని పాఠకులు మెచ్చుకుంటూ అనువాదం చేసిందెవరూ? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ విషయంలో అనువాదకురాలు చెప్పిన ముందు మాట చూడండి.

తమిళ పుస్తకం ప్రింటయిన తరువాత వచ్చిన ప్రశ్నలకు జవాబులుగా శ్రీ అడియార్ నీరోట్టంలో వ్రాసిన వ్యాసాలు కూడా కొన్నింటిని అనువదించి ఈ పుస్తకంలో చేర్చడం జరిగింది. దీనివల్ల పుస్తకం విలువ మరింత పెరిగిందని చెప్పవచ్చు.

ఈ పుస్తకం నేడు తమిళం నుండి తెలుగులోనే కాక హిందీ, ఉర్దూ, మలయాళం, కన్నడ, సింధి, అరబి భాషల్లో కూడా అనువదించబడింది. సింధీ భాషలో వెలువడిన పుస్తకాన్ని పాకిస్తాన్‌లో విడుదల చేసిన సందర్భంలో ఆ ప్రభుత్వం ఆహ్వానంపై వెళ్ళి 15 రోజులపాటు శ్రీ అడియార్ పాకిస్తాన్ పర్యటన కూడా జరిపారు.

'నేను ఆరాధించే ఇస్లామ్' అన్న ఈ వ్యాసావళిని తొందరగా పుస్తక రూపంలో ప్రచురించాలని పాఠకుల ఒత్తిడి అధికమయింది. అందువల్లనే వెంటనే పుస్తకాన్ని వెలువరించే కార్యక్రమం చేపట్టాము. దైవానుగ్రహం, సోదరుల సహాయసహకారాలు, పాఠకుల అభిమానంవల్ల ఇప్పటి వరకు వేల కాపీలు ప్రజల చేతుల్లోకి చేరాయి. ఇంకా దీన్ని అభిమానించే వారు తగ్గ లేదు.

పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దడానికి సకల ప్రయత్నాలూ చేశాము. ఈ విషయంలో మాకు సహాయ సహకారాలు, సలహాలు అందజేసిన సోదరులందరికీ మా కృతజ్ఞతలు. దైవం వారందరికీ మంచి ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము. మీ అభిప్రాయం, సలహాలు మాకు కొత్త శక్తినిస్తాయి. వాటిని పంపడం మరువకండి.

– ప్రకాశకులు

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ ★

# మానవ జాతికి మనోహరమైన ఆదర్శం

'ఇస్లామ్' అని పిలువబడే ఈ మార్గం గురించి నేను ఆలోచించే విధానం మామూలుకి భిన్నంగా ఉండటం చేత నాకు ఈ భిన్నమయిన దృష్టి ఎందుకు కలిగిందో, స్నేహితులు చదువుతారన్న ఆశతో ఈ వ్యాసపరంపర రాస్తున్నాను.

సాధారణంగా మతమార్గ ప్రబోధకులు ఈ కాలపువారి దృష్టిలో "తిరోగమనవాదులు"గా కనిపిస్తూ ఉంటారు. కాని నూతన మార్గాలను ప్రబోధం చేసిన వీరు ఆనాటి సమకాలీన సమాజం చేత విప్లవ ప్రబోధకులుగా, తిరుగుబాటుదారులుగా పరిగణించబడినారు.

హిందూ మతము లేక వైదిక మతము అన్నదానికి అత్యున్నత ప్రతిష్ఠ సమకూర్చిపెట్టిన శంకరాచార్యులు ఒక విప్లవవాదే!

ఛండాలుడైన ఒకనిని "దూరంగా పో - తొలగి పో" అని అన్నప్పుడు ఆ కడ జాతివాడు, "దేనిని దూరంగా పొమ్మంటున్నారు? నా దేహాన్నా లేక

---

★ 'నీరోట్టం' దినపత్రికలో ప్రతివారం వ్యాసం ఇలాగే బిస్మిల్లాహ్ పూర్తి పాఠంతో ప్రారంభమయింది. - (సం)

ఆత్మనా?" అని ప్రశ్నించగా, బ్రాహ్మణ కులానికి చెందినప్పటికీ, ఆత్మసాక్షాత్కారం పొంది, ఆ హీనజాతివాడిని దైవముగా గ్రహించి అతని కాళ్ళమీదపడి వేడుకుని, కుల వ్యవస్థపై తిరగబడిన విప్లవకారుడు శంకరాచార్యుడు.

వేదములూ ఉపనిషత్తులూ ఇవి గుప్తములు, రహస్యంగా ఉంచవలసినవి-అన్న వాదాన్ని ఖండించి, తిరువాటియూర్ కోవెల ప్రాకారంపై నుల్చుని, వేదాలు అందరికీ వినపడేటట్లు - గొంతెత్తి పఠించిన విప్లవకారుడు రామానుజాచార్యులు.

రెండువేల సంవత్సరాలకి పూర్వం వారంలోని ఆఖరు రోజుని సాబాత్ రోజని పిలిచి, అది విశ్రాంతి దినమని, ఏ పని చెయ్యరాదనీ, పక్కమీదనే పడుకుని ఉండాలి, ఇటూ అటూ కదలకూడదు - అన్న మత విధులను ఏర్పరచి, ఒక జాతిని, ఒక మానవ సమాజాన్ని సోమరిపోతులుగా మార్చినపుడు, దానిని గర్హించి, ఎదురు నిలిచి ఆ రోజున ఎవరి పనులు వారు నిర్వహించుకోవాలి అని ప్రకటించిన ప్రగతిశీలి ఏసుక్రీస్తు.

జంతుబలి ఇవ్వటమే జనబాహుళ్యపు విద్యుక్త ధర్మముగా భావించి, దేశమంతా బలి పశువుల ఆర్తనాదాలతో ప్రతిధ్వనిస్తున్నప్పుడు, ఆ క్రూర చర్యని ప్రతిఘటించి నిలిచిన విప్లవ మానవతా వాది గౌతమ బుద్ధుడు.

మతమూ, మార్గమూ గురించి - సరయిన అవగాహనతో చరిత్ర పుటలని పరిశీలించినపుడు ఈ విషయాలన్నీ బోధపడి, మతమూ మార్గమూ అనుసరించిన ప్రతి ఒక్కరూ విప్లవ వృక్షానికి చెందిన శాఖోపశాఖలు అని స్పష్టమవుతుంది.

ఆ తరువాత వచ్చిన నూతన ప్రబోధకుల చరిత్రని పూర్తిగా అర్థం

చేసుకోవాలన్న జిజ్ఞాసతో చదివినట్లయితే, వారంతా విప్లవభావోద్దీపన కలిగించిన వారన్నది బోధపడుతుంది.

బహిరంగంగా చెప్పటానికి నేను సిగ్గుపడటంలేదు. విప్లవాత్మకమయిన మత ప్రబోధాలని చేసిన వారిలో ఇంతవరకూ ప్రభవించిన విప్లవాత్మక వ్యక్తిత్వాలలో నా హృదయాన్ని ఆకట్టుకున్న మహా విప్లవకారులు ముహమ్మద్ నబీ (సల్లల్లాహు అలైహి వసల్లం).

ఇతర ★ మత ప్రబోధకులు, మత విశ్వాసాల ప్రచారకులు చాలా మటుకు మతమార్గ స్వీకరణకి పూర్వం, చక్రవర్తులుగానో జ్ఞానులూ, పండితులుగానో ఉండి వున్నారు పూర్వాశ్రమంలో.

అంతేకాదు, వారికి తల్లిగాని లేక తండ్రిగాని వుండి, వారి ఆలనలో పెరిగి ఉన్నారని కూడా చదివి ఉన్నాము.

కాని, అగ్రజులయిన ★★ ముహమ్మద్ ప్రవక్త తాము భూమి మీద పడటానికి ముందే, తండ్రి అయిన అబ్దుల్లాహ్‌ని కోల్పోయి పితృవిహీను లయ్యారు.

తండ్రి ముఖం ఎరగని ఒక పసివాడి మానసిక వేదన, పితృవిహీనుడయిన ఆయన ముఖంలోని నిస్సహాయత, తండ్రిని కోల్పోయినవారే ఆ లోటుని అర్థం చేసుకోగలుగుతారు.

అగ్రజులు పొందిన కష్టాలు ఇవ్వేనా?

ఆరు సంవత్సరాల పసితనంలో తమ తల్లి అమీనాతో కలిసి, పనికత్తె

---

★ దైవ ప్రవక్తలు మినహా. - (సం)

★★ 'అగ్రజులు' అన్నది అనువాదకర్త మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కొరకు కొత్తగా ప్రవేశపెట్టిన పదం.

పరాకా, ఉమ్మె ఐమన్ అనువారి వెంట, తమ తండ్రి సమాధిని దర్శించుకోటానికి అరేబియాలో యస్రిబ్ అన్న ప్రదేశానికి బయలుదేరుతారు.

తండ్రి సమాధిని దర్శించివస్తున్న - తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో 'అబువా' అన్నచోట ఆయన తల్లి అసువులు కోల్పోయారు.

★ అనాధ....

★ తండ్రి ముఖం ఎరగరు....

★ తల్లి మార్గమధ్యంలో ఆయనని శాశ్వతంగా విడిచి వెళ్ళిపోయారు

ఈ విధంగా తల్లిదండ్రులనిద్దరినీ కోల్పోయి అనాధగా వచ్చి నిలిచిన, అగ్రజుని, తాతగారు ముత్తలిబ్ ఆదరించి పెంచసాగారు. ఆయన కూడా రెండు సంవత్సరాలలో మరణించటంచేత, ఎనిమిది ఏళ్ళు నిండకుండానే...

తల్లి....

తండ్రి...

తాతగారు, అందరినీ కోల్పోయి అనాధగా, ఏకాకిగా మిగిలిపోయినవారు ఎవరు?

అనాధగా నిలబడి మానవజాతిని అల్లాహ్ యొక్క కరుణా కటాక్షాలకి అర్హులని చేసిన ఈ ఆదర్శమూర్తి చిన్న వయసులోనె తల్లిదండ్రులను, తాతగారు మొదలగు ఆప్తులని కోల్పోయి ఏకాకిగా నిలబడ్డారు.

ఈ పసివాని జీవితంలో ఇన్ని విషాద సంఘటనలు ఏర్పడినా, ఆ అనాధ బాలుని పెంచి పెద్దవానిని చెయ్యటానికి పెత్తండ్రి అబూతాలిబ్ ముందుకొచ్చారు.

పెత్తండ్రి ఎంత వాత్సల్యం కురిపించినా, ఎంత ప్రేమానురాగాలు గుప్పించినా తల్లిదండ్రులు లేని అనాధ ఈ ప్రవక్త శిఖామణి. మాతాపితలు

లేని ఒక పసివాని మనోవేదనని, తల్లిదండ్రుల ప్రేమ లేకుండా పెరిగినవారు మటుకే ఊహించుకోగలరు.

అంతటి మనోవేదనకి, గ్లానికి లోనయి, అనాధ అయిన, ఒక మహిమాన్వితుని బాధాతప్త హృదయం నుంచి ఆవిర్భవించింది ఇస్లామ్.

అనాధ అయిన ఒక వ్యక్తి, స్పెయిన్ నుంచి చైనాదాకా. ఈ సముద్రతీరం నుంచి ఆ తీరందాకా ఆకుపచ్చని పతాకం ఎగురవేయగల ఉన్నత స్థితిని అందుకోవడం ఎలా సాధ్యమయింది?

మహాప్రవక్త నిర్మల హృదయం, మచ్చలేని ఆయన ధవళ వర్తన ఇందుకు కారణం. మానవజాతి గర్వించదగిన ఒకానొక అపూర్వమైన మానవ ఆదర్శం - ఈ మహానాయకుడు సల్లల్లాహు అలైహి వసల్లం...

ఈనాటిదాకా ప్రపంచంలోని జ్ఞానులు, విద్యావేత్తలు మొదలగు పెద్దలు వివరించిన కొన్ని సత్యాలను, ముహమ్మద్ ప్రవక్తలోని సత్ గుణములను రానున్న పేజీల్లో ఉల్లేఖించబోతున్నాను.

ఈ వ్యాస పరంపరలో వెలువరించిన అభిప్రాయాలని, విషయ వివరణనీ చదివిన స్నేహితులు, తమ స్నేహితులకి తెలియచెబుతారనీ, ముస్లిమ్ స్నేహితులకి ఈ గ్రంథాన్ని పరిచయం చేస్తారని ఆశిస్తున్నాను. ఎందుకంటే నేను పరిశీలించి, ఉదాహరించిన ఈ విషయాలు వారికి ఉపయోగపడతాయి.

# గొర్రెలకాపరి అయిన రాజాధిరాజు

ప్రవక్తలకు నాయకుడయిన ఈ మహావ్యక్తి జననమొందిన నాటినుంచీ మానవజాతికే ఒక అపురూపమయిన ఆదర్శప్రాయుడుగా నిలిచి జీవితం గడిపారు.

ఎందరో మహనీయులు తమ జీవితారంభంలో, యవ్వన దశలో విశృంఖలంగా, అల్లరిచిల్లరగా ప్రవర్తించినట్లు చరిత్రకారులు చెపుతుంటారు.

బాల్యం నుంచే కళ్ళు తెరిచి ఈ ప్రపంచాన్ని చూసిన మరునాటి నుంచే- ఆగ్రహంతో అరవటంగాని, అన్యాయానికి తలవంచటంగాని చెయ్యని అపురూపమయిన జీవితం గడిపిన వారు ఈ మానవతామూర్తి ఒక్కరే.

అబూతాలిబ్ అన్నపేరుగల వీరి పెత్తండ్రి ధనధాన్యాదులు గల సంపన్నులు కారు - బీదవాడు.

అటువంటి బీదవ్యక్తి తమని ఆదరించి, పెంచి పెద్దచేశారన్న కృతజ్ఞతాభావం అగ్రజునికి ఎప్పుడూ ఉన్నది. పెత్తండ్రి ప్రాపులో పెరిగి పెద్దవాడినయ్యానన్న విషయం ఆయన ఏనాడూ మర్చిపోలేదు.

అందుచేత పెత్తండ్రికి తాము భారమై ఉండరాదు - అన్న ఉద్దేశ్యంతో ఈ మహామనీషి కూలికోసం మేకలనీ, గొడ్లనీ మేపే పశువుల కాపరి వృత్తి చేపట్టారు.

పురుషోత్తమా !

యావత్ ప్రపంచానికి ఉత్తమ మార్గం చూపించ వచ్చినవాడా !

అరబ్బులకి విజ్ఞాన వివేచనా మార్గం ప్రబోధించ వచ్చినవాడా !

రాజాధిరాజా !

అసంఖ్యాకమయిన - సైనిక వాహినిగల రోమన్ సామ్రాజ్యాన్ని పాదాక్రాంతం చేసుకున్నవాడా !

అంతులేని ధనరాసులు, వజ్ర వైఢూర్యాలు, వెండి బంగారాలపై నడిచే ముస్లిమ్ రాజ్యాన్ని స్థాపించిన మహానుభావా !

మీరు బాల్యంలోనే - గొర్రెల్ని మేపుతూ, కుటుంబ భారాన్ని మీ భుజాలపై వేసుకున్నారన్నది చదువుతున్నప్పుడు-కన్నీళ్ళు చిందుతున్నాయి!

ఇటువంటి అపురూప వ్యక్తిని ప్రవక్తగా, నాయకునిగా పొందటానికి ముస్లిమ్ ప్రజ ఎంత అదృష్టం చేసుకున్నారోగదా !

ఒక్క పశువుల కాపరిగా మటుకేనా? తను ఎవరికి భారం కాకూడదన్న ఉద్దేశ్యంతో పన్నెండేళ్ళు నిండకమునుపే,.స్వదేశం వదలి, సరాయిదేశానికి వర్తకానికై వెళుతున్న పెత్తండ్రి వెంట వెళ్ళారు - ఆయనకి సహాయకునిగా.

తన ఇంట్లోని బంధువులకే కాదు, కదలలేని వృద్ధుల, నిరాధారులయిన బీదవారి ఇళ్ళకు వెళ్ళేవారు.

"నేను అంగడి వీధికి వెళుతున్నాను, మీకేదయినా కావాలా? సరుకులు తెచ్చిపెట్టమంటారా?" అని పనిమీద బయటికి వెళ్ళేముందు అడిగేవారు.

వారివద్దనున్న సరుకులు తీసుకెళ్ళి, అమ్మి, తిరిగివస్తూ బరువైన మూటలు మోయటానికి అలవిగాని, అతి భారమయిన మూటలు మోసుకొచ్చి ఈ వృద్ధమాతలకి ఇస్తూ ఉండేవారు.

ఈ విధంగా పీడితులు, బాధితులకు నూతన జీవితం కలిగించి, వారి జీవితాలకి ఆధారం కలిగించటానికి - 'హిల్ఫుల్ ఫుజూల్' అను ఒప్పంద

స్థాపనకి - తాను ముఖ్యపాత్ర వహించి, అది అమలుపరిచి సమాజంలోని వారి క్షేమం కొరకు పాటుపడ్డారు.

ఆడి తప్పని ఈ సత్యసంధుడు-ఇచ్చిన మాటను ఎలా నిలబెట్టు కునేవారో, సత్యవాక్కుకి ఎటువంటి అపూర్వమయిన విలువనిచ్చేవారో ఉదాహరణగా ఒక సంఘటన ఉంది.

ఒక స్నేహితుడు -"మీరు ఆ వీధిలో ఆ అంగడి పక్కన నుల్చుని ఉండండి - నేను వచ్చి కలుసుకుంటాను" అన్నారట.

అగ్రజులు ఆ స్నేహితుడు నిర్దేశించిన స్థలంలో నుల్చున్నారు.

ఒకరోజు గడిచింది.

రెండోరోజు కూడా వెళ్ళిపోయింది.

మూడోనాడు కూడా గడిచిపోతూ ఉంది.

అదే చోటున అగ్రజులు నుల్చుని ఉన్నారు.

ఆయనని అక్కడ నుల్చోమని చెప్పిన విషయం ఆ అవతల వ్యక్తి మర్చిపోయారు. అనుకోకుండా ఆ దారి వెంట గబగబా నడిచివస్తున్న ఆ మిత్రుడు, నడుస్తూ నడుస్తూ కొట్టు పక్కన నుల్చునివున్న ఈయన్ని చూసి ఆశ్చర్యపోయి -

"అరే - మీరిక్కడే నిల్చుని ఉన్నారా?" అని సిగ్గుపడుతూ అడగ్గా ... ఈషణ్మాత్రం కోపంగాని, విసుగుగాని ప్రదర్శించక చిరునవ్వుతో "మీరే కదా ఇక్కడ నుల్చుని ఉండమన్నారు?" అని ప్రశ్నించారు ఆ సహనశీలి.

అందుచేతనే అమీన్(విశ్వసనీయుడు) అని, సాదిక్(సత్యసంధుడు) అని ప్రేమపూరితంగా - ప్రజలు కొనియాడారు ఈ మహా వ్యక్తిని.

ఇటువంటి విశ్వసనీయుని, సత్యవంతుని భర్తగా స్వీకరించింది

సంపన్నురాలయిన ఖదీజా.

అప్పటికే ఆమె ఇద్దరు భర్తలని కోల్పోయి, వితంతువుగా జీవితం గడుపుతూ ఉంది.

ఆమె అగ్రజునికంటే వయసులో పదిహేనేళ్ళు పెద్ద. ఆమె (తాహిరా) సౌశీల్యవతి, పవిత్రురాలు అని అందరిచేత గౌరవింపబడుతోంది. మూలుగుతున్న ధనరాసులకామె స్వంతదారు.

వయసులో పెద్దదైన ఖదీజా అగ్రజుని పాణిని గ్రహించి ఆయన జీవిత భాగస్వామిగా -

కాసిమ్, అబ్దుల్లాహ (తాహిర్), జైనబ్, రుకియా, ఉమ్ము కుల్సూమ్, ఫాతిమా -

అనే ఆరుగురు సంతానానికి జన్మనిచ్చారు. ఈ ఆరుగురిలో మొదటి ఇద్దరు మొగపిల్లలూ బాల్యంలోనే మృత్యువాతపడ్డారు.

ఈ వివాహం చేత అగ్రజులు వర్తక వ్యాపారాలలో నిలదొక్కుకోటానికి- కొంత అవకాశం చిక్కిందని చెప్పుకోవాలి.

చిరకాలంగా ఆయన మనసులో ఉన్న సన్మార్గ నడవడికలో పయనించవలెనన్న కోర్కె ఫలించటానికి ఈ వివాహం కొంత దోహదపడింది.

గృహస్థుగా ఉండీ, సంసార జీవితం గడుపుతూ కూడా, నూతన మార్గమున పయనించి, సందేశ ప్రబోధము చేసినవారు ముహమ్మద్ ప్రవక్త ఒక్కరే.

గౌతమ బుద్ధుడు : ఒక రాజ్య పరిత్యాగి.

శంకరాచార్యులు : పెండ్లికాని బ్రహ్మచారి.

ఏసు క్రీస్తు : పెండ్లికానివారు.

తీర్థంకరుడు : సర్వసంగపరిత్యాగి.

మత గురువులు, కొత్త మార్గాన పయనించే ప్రబోధకులు, వీరిలో ఎక్కువ భాగం సర్వసంగ పరిత్యాగులో, పెళ్ళిచేసుకోని బ్రహ్మచారులుగానో అయివుంటారు.

కాని, అగ్రజులు ఒక్కరే లౌకికమయిన గృహస్థ జీవితం గడిపారు. ఇంకా చెప్పాలంటే - బహు భార్యలు, పలు వివాహాలని ప్రబోధించి, అనుమతించిన మతమార్గానికి నాయకులయి ఉండి కూడా సపత్నీ వ్రతాన్ని చేపట్టిన పవిత్రమూర్తి ఈయన.

అమీన్ అనీ, సాదిక్ అని ప్రశంసించబడిన ఈ మహోన్నత మూర్తి- కొత్త మార్గం గూర్చి బోధించటం మొదలుపెట్టేసరికి, అప్పటిదాకా ఆయనని మెచ్చుకున్న యావన్మందీ ఆయనని ప్రతిఘటించి, దూషించటం మొదలుపెట్టారు.

ఎందుకని? మానవ చరిత్రలో ఇంతవరకూ ఏ విప్లవ నాయకుడూ చెప్పని విషయం ఒకటి - తల్చుకుంటేనే హృదయం కంపించిపోయేటటువంటి విషయం ఒకటి - ఈ మహా వ్యక్తి ప్రస్తావించటం ఆరంభించారు. అది ఏమిటి?

★★★

# విగ్రహమూ, చిత్రమూ లేని 'శూన్యం' శూన్యమా?

ప్రపంచంలోని ఏ విప్లవ నాయకుడూ చెప్పని ఒకే ఒక్క విషయం నాయక శిఖామణి చెప్పారు. అది ఏమిటి?

విగ్రహమూ, రూపచిత్రమూ ఉండకూడదు అని ! అది కూడా పదమూడు వందల సంవత్సరాల క్రితం అన్నారు.

'ఉండకూడదు' – అని చెప్పడమే కాదు. దేవతా విగ్రహాలు, దేవతా చిత్రములు వీటిని బ్రద్దలు కొట్టి, పారవెయ్యాలని చెప్పినవారు మహా ప్రవక్త.

ఊరికే మాట అనటం కాదు... అది క్రియలో ఆచరించి చూపించారు.

ఈ ఇరవయ్యో శతాబ్దిలో – సుప్రసిద్ధ ప్రజా విప్లవ నాయకుడు పెరియార్ (రామస్వామి నాయకర్) తమ స్వంత ఖర్చుతో వినాయకుని విగ్రహం నిర్మించిన వెనుకగదా – పగలగొట్ట గలిగారు !

కాని నాయక శిఖామణి ఆ రోజుల్లోనే అత్యంత ప్రఖ్యాతివహించిన 'కాబా' ఆలయంలోని 360 విగ్రహాలను తునాతునకలు చేశారు.

జా అల్ హక్కు వ జహకల్ బాతిల్ ఇన్నల్ బాతిల కాన జహూకా.

"సత్యం దర్శనమిచ్చింది, అసత్యం అణిగిపోయింది. అసత్యమన్నది నిశ్చయంగా ఎప్పటికైనా అణగారిపోవలసినదే !"

అంటూ దివ్య ఖుర్ఆన్ ప్రవచనాలని పఠిస్తూ – తమ చేతులారా బరువయిన ఆ శిలావిగ్రహాలని విసిరిపారేసి, ముక్కలు ముక్కలు చేసిన సాహసమూర్తి ఈయన.

ముస్లిమ్ ప్రజల ముఖ్య పండుగ బక్రీద్. దానినే ఈద్ పర్వదినం అని కూడా పేర్కొంటారు.

ఆ పర్వదినానికి ముఖ్యమైన కథానాయకులు ఎవరు?

ఇబ్రాహీమ్ (అబ్రహామ్)

ఇస్మాయీల్ (ఇష్మయేల్)

ఇబ్రాహీమ్ అనే మహనీయుడు ఇస్మాయీల్ అనే తన కుమారుని బలి ఇవ్వబోతుంటే (దైవం) నరబలి ఇవ్వకూడదు అని ప్రబోధించిన రోజే ఈ ఈద్ పర్వదినం.

ఈ ఈద్ పర్వదినానికి నాయకులగు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ మొదలగు ఉద్దండులయినవారి కుడ్యచిత్రాలు కూడా ఆ 'కాబా' ఆలయంలో ఉన్నాయి.

అలాంటివారి చిత్రాలు కూడా ఉండరాదని, వాటిని తుడిచివేసినవారు ఈ ధీరోదాత్తుడు. అలాంటప్పుడు ఈయనకి మించిన విప్లవ నాయకులు మరొకరెవరు?

అది కూడా ఎటువంటి భూభాగంలో? క్రూరత్వమూ, మూర్ఖత్వమూ, రక్త దాహమూ - ఈ మూడు ఘోషలతో దద్దరిల్లిపోతున్న అరబ్ దేశంలో...

సోవియట్ రష్యాలో సామ్యవాద సిద్ధాంతాలు మొగ్గలొడిగి వికసించి ఉండవచ్చు. దైవ భావన క్రేమిలిన్ భావనంలో అదృశ్యమయిపోయి ఉండవచ్చు! కాని 'మాతా మందిరాలనూ' (చర్చిలను), అందులోని విగ్రహాలనూ రూపుమాపాలన్న ధైర్యం వారికి కలగలేదు.

మన దేశంలో కూడా "శ్రీరంగనాధుని చిదంబరంలోని నటరాజుని ఫిరంగి నోట్లో దూర్చి - పేల్చే రోజు ఎపుడు రానున్నదో !....." అంటూ

పాటలు పాడారు తప్ప, ఆఖరికి కుగ్రామంలోని వినాయకుని విగ్రహం కూడా కదపలేకపోయారు. పగలగొట్టటం వారికి సాధ్యమూ కాలేదు.

అటువంటిది పదమూడు వందల సంవత్సరాల క్రితం మొండివారూ, మూర్ఖులూ జన్మించిన భూమిలో 'కాబా' లోని విగ్రహాలను పగులగొట్టిన సంఘటనకీ - సరితూగగల మరో సంఘటన చరిత్ర పుటలో ఉందా? ఈ దృశ్యాన్ని పోలిన మరో దృశ్యం ఈ అఖండ భూభాగంలో ఏ మూలనయినా ఉందా?

ముస్లిమ్‌లు తమ దండయాత్రలలో సోమనాధ ఆలయంలోని విగ్రహాలని బద్దలుకొట్టి తునాతునకలు చేసి ఉండవచ్చు.

అవి అన్య దేశానికి, అన్య మతస్థులకి చెందిన విగ్రహాలు - అది రెండవ స్థానానికి చెందిందే.

కాని తన స్వంత దేశంలో, తన పూర్వీకులు ప్రతిష్ఠించి పూజించిన విగ్రహాలని, తన పూర్వీకులయిన హజ్రతులవారి చిత్రాలను తీసిపారెయ్య డమన్నది మహోజ్వలమైన - అపురూప విషయం.

ఎంత నాస్తికత్వం గురించి మాట్లాడినా, ఎంత వర్గ తారతమ్యాల గురించి చెప్పినా, మానవునికి హృదయపు లోతుల్లో అట్టడుగున విగ్రహాలు, చిత్రపటాలు అనగానే ఒక రకమయిన మూఢత్వమూ భక్తిభావమూ కలుగుతూ ఉంటాయి.

నాస్తికులు దేవతా విగ్రహాలను పీకి పారెయ్యవచ్చు - కాని తమ శిలా విగ్రహాలను ప్రతిష్టించుకుంటున్నారే !

కుల మత భేదాలు పనికిరావు అని వాదించేవారు, భగవంతుని చిత్రపటాలు పీకి పారెయ్యండి అని ప్రబోధిస్తూనే - తమ ఛాయా చిత్రాలను గోడలకి వ్రేళ్ళాడ తియ్యండి - అంటున్నారు.

విగ్రహాలు, చిత్రపటాలు మొదలగునవి మనిషి మనసులోని బలహీనతలు.

ఈ బలహీనతలని పదమూడు వందల ఏళ్ళ క్రితమే - పెళ్ళగించి, విసిరి పారెయ్యండి అని ప్రబోధించారు.

ఈనాటికి కూడా విగ్రహాలు, చిత్రపటాలు వంటి బలహీనతలు లేకుండా, ఒక్క అక్షరమాలను, సిద్ధాంతాలను ప్రాతిపదికలుగా కలిగిన ఒక్క ఉద్యమాన్ని - మహోన్నతమయిన తిరుగుబాటు ఉద్యమాన్ని కోట్లాది ప్రజల చేత నడిపించగలిగిన, నిత్య చైతన్య మార్గం ఇస్లామ్.

విగ్రహాలు, చిత్రపటాలు వంటివిలేనపుడు, సౌందర్యాభిరుచి, విజ్ఞానాసక్తివంటివి పోయి, ఒక శూన్యత, భావ దారిద్ర్యమూ వంటివి ఏర్పడుతాయి అనుకుంటారు. కాని అటువంటి భావదారిద్ర్యం గలవారు అనుకునే ముస్లిమ్ ప్రజానీకమే - ఈ యావత్ ప్రపంచానికి అద్భుతమయిన అపూర్వమయిన వరాలు ఇవ్వగలిగారు.

అల్ జిబ్రా వంటి బీజగణిత శాస్త్రానికి పునాదిరాళ్ళు వేసినవారు ముస్లిమ్‌లు.

1, 2, 3, 4 అని మనం ఇప్పుడు లెక్కించి రాస్తున్న సంఖ్యా గణితాన్ని మొట్టమొదట ఆరంభించి, మానవ జాతికి నేర్పినవారు వారే !

వాస్తు శాస్త్రంలో, శిల్ప విన్యాసంలో కొత్త రీతులు నేర్పినవారు, కాగితపు పరిశ్రమను అభివృద్ధిపరచినవారు కూడా వీరే !

సిల్వర్ నైట్రేడ్, సెల్ఫూరిక్ ఆమ్లము వంటివి కనుగొన్నవారు కూడా వీరే.

వైద్య శాస్త్రంలో...
అల్ ఫారాబి రచించిన 'ఆఁరాస్' అనే శస్త్ర చికిత్స
ఇబ్నూసీనా (AVESENA) రచన 'కానూన్'

అలీఇబ్నూ వ్రాసిన 'కితాబుల్ మాలికి'.

ఇవి వైద్య శాస్త్రంలో అతి ముఖ్య ప్రామాణిక మౌలిక గ్రంథాలు.

కవితా గానంలో.

'ముతనబ్బీ' మొదలు, నిన్న మొన్నటి ఇక్బాల్ దాకా - అద్భుతమైన కావ్యరసానుభూతిని ప్రజానీకానికి అందించారు.

అల్ఫ్ లైలా వ లైలా... అను వెయ్యిన్నొక్క రాత్రులు, లైలా - మజ్నూ, అన్‌దరతుల్, హిమ్మా - ఇవన్నీ ప్రపంచానికి వారు అందించినటువంటి అపూర్వమయిన సాహిత్య నిధులు.

ఇటువంటి గొప్ప సాహిత్య సంపద అనేక దేశాలలో ఉండవచ్చు.

కాని, ఇటువంటి విజ్ఞాన సంపదని, అపురూప సాహిత్యాన్ని అరబ్ దేశీయులు, ఆ చుట్టుప్రక్కల నివసించేవారూ సృజించారు అంటే అందులో ఒక ప్రత్యేకత, ప్రతిభా ఉన్నది.

ఎడారి ప్రదేశం.

నిప్పులు చెరిగే ఎండ.

నిరంతర శ్రమ, కష్టభూయిష్టమయిన దైనందిన జీవిత విధానం.

వీటికితోడు 'నిరక్షరకుక్షులు' చదవనూ, రాయనూ చేతగాని నిరక్షరాస్యులు - అని పిలుపించుకోవటంలోనే ఒక ఘనత, గౌరవమూ కలదు అనుకునే అహంకారపూరితులు, మాత్సర్యపూరితులయిన ఒక జాతి, ఒక తెగ ఇటువంటి కీర్తి శిఖరాలని అధిరోహించ గలిగిందీ అంటే, అది ఇస్లామ్ వల్లనే సాధ్యపడింది.

ఇస్లామ్‌ని నేను ప్రేమించటానికి ఇది ఒక్కటే కారణం కాదు. ఇంకొక గొప్ప విషయం కూడా ఉన్నది.

అది ఏమిటి?

# ఇతర భాషలలో దైవప్రవక్తలు

హిందూ మతమూ లేక వైదిక మతమును గురించి పేర్కొన్నప్పుడు, దశావతారములు రుషులు, మునీశ్వరులు అందరూ ఈ పుణ్యభూమిలో జన్మించినవారే అయివుంటున్నారు.

ఒక్క అవతార పురుషుడు కూడా రష్యాలోనో, చైనాలోనో లేక ఇతర దేశాల్లోనో జన్మించినట్లు - ఎక్కడా చెప్పటం జరగలేదు.

పురాణాల్లో కూడా ఇతర దేశాలకి సంబంధించిన సంఘటనలుగాని, కథలుగాని, అద్భుత విషయాలుగాని ఉన్నట్లు ఎక్కడా కనిపించదు.

అద్భుతమయిన సాహిత్య సంపద వలె భావింపబడు యూదుల మత గ్రంథము తౌరాత్‌లోనూ, క్రీస్తు మతస్తులు పరమ పుణ్యగ్రంథమని ఆరాధించే బైబిలులోనూ దీర్ఘదర్శులు, మత ప్రయోక్తలు పాలస్తీనా నగరపు చుట్టుపట్ల ప్రదేశం నుంచి వచ్చినట్లుగానే మనకు కనబడుతూ ఉంటుంది.

బుద్ధుని జాతక కథల్లోనూ ఇదే మాదిరిగా భారత దేశంలో అది కూడా ఉత్తర భారతంలో ఈ సంఘటనలు జరిగినట్లు కనిపిస్తూ ఉంటుంది.

జైన మతంలోని తీర్థంకరులందరూ ఇంచుమించు ఉత్తర భారతంలో జన్మించినవారే; దక్షిణ ప్రాంతానికి వచ్చివున్నారు తప్ప. వారిలో ఏ ఒక్కరూ భారతదేశపు ఎల్లలు దాటి వెళ్ళలేదు.

సిక్కు మతంలో కూడా... పంజాబ్ దాటిన - ప్రయోక్తలు లేరు.

కన్‌ఫ్యూషియన్, పార్శీ, టావో ఇత్యాది ఏ మతానికి చెందిన ప్రవక్త అయినా ఆ మతం జన్మించిన దేశపు ఎల్లలు, జన్మస్థానం వదిలి ఇతర దేశాలకి

వచ్చినట్లు ఎక్కడా ఉదాహరింపబడలేదు. అలా వదిలి రావటాన్ని ఆమోదించినట్లు కూడా ఎక్కడా లేదు.

కాని, ఇస్లామ్ మార్గం ఒక్కదాంట్లోనే ప్రపంచంలోని చాలా ప్రాంతాలకి ధర్మ ప్రబోధకులు ప్రత్యక్షంగా వెళ్ళారన్నది అందరూ ఒప్పుకున్న విషయం.

బైబిల్‌లో మానవులు - ప్రపంచంలో పలుప్రాంతాలకి చెల్లా చెదురుగా- పారిపోవటానికి కారణం అయిన ఒక కథ చెపుతుంటారు.

ఆకాశానికి అంటుకునేటంత ఎత్తయిన గోపురం భూమి మీదనుంచి కట్టి, స్వర్గానికి వెళ్ళటానికి ఇజ్రయీల్ ప్రజలు అధిక శ్రమతో ఒక ప్రయత్నం ప్రారంభించగా, అది చూసి భగవంతుడు కుపితుడై ప్రజలని చెల్లాచెదురు అయేటట్లు తరిమి కొట్టి, ఈ భూమండలంలోని పలుప్రాంతాలకి వెళ్ళిపోయి, పలుభాషలు మాట్లాడండి - అని శిక్షించినట్లు ఒక కథ చెబుతూంటారు.

కాని, మత ప్రబోధకులు తమ మాతృభాషలోనే సందేశాలు ప్రచారం చేశారన్నది కూడా స్పష్టంగా చెప్పి ఉండలేదు.

దానికి బదులుగా, ముస్లిమ్‌ల దివ్య ఖుర్‌ఆన్ నిర్వచిస్తూ ఉంది :

(ప్రవక్తా !) అల్లాహ్ మీద సత్యప్రమాణంగా నీకు పూర్వం కూడా వివిధ జాతులలో మేము ప్రవక్తలను పంపి ఉన్నాము.

(దివ్య ఖుర్‌ఆన్ - 16 : 63)

(ప్రవక్తా !) నిశ్చయముగా... మేము మీకు పూర్వం అనేకులని ప్రవక్తలుగా పంపిఉన్నాము. వారిలో కొందరి చరిత్రలను మేము మీకు తెలిపాము. కొందరి చరిత్రను మీకు తెలుపలేదు.

(- 40 : 78)

అరేబియా, సిరియా, ఇరాక్ ప్రాంతాల్లో సంచారం సలిపిన దైవ సందేశహరుల పేర్లు మాత్రమే కొన్ని దివ్య ఖుర్ఆన్‌లో ఉదాహరింపబడినా మత ప్రచారకులు ఆ ప్రాంతాలలో, ఆ భాషలో మటుకే బోధించారని - చెప్పబడి లేదు - ఆ దివ్య గ్రంథంలో... దానికి బదులుగా :

*గట్టిగా హెచ్చరికలు చేసే (మా యొక్క) ప్రవక్తలు ప్రవేశించని ఏ జాతి అయినా (ఈ భూమిపై) ఉండి ఉండదు.*

(- 35 : 24)

*జాతి మాత్రమే కాదు - ప్రపంచంలోని ప్రజలు ఎన్ని భాషలు మాట్లాడుతారో - అన్ని భాషలలోనూ సత్యాన్ని, మంచిని ప్రబోధించే దూతలని దైవం పంపివున్నాడు.* (- 14 : 4)

అని దివ్య ఖుర్ఆన్ నిర్వచించింది.

ఒకే ఒక దైవం.

దానధర్మం.

పరుల క్షేమం.

చెడు నడత నుండి విమోచనం.

ఇటువంటి సార్వజనీనమయిన అనేక విషయాలను ప్రబోధించటానికి (భాష, ప్రాంతము అన్న తారతమ్యం లేకుండా) ప్రవక్తలు, సత్య సందేశహరులు, ఎన్నుకున్న ఒకే ఒక మార్గం ఇస్లామ్ మార్గం.

ఈ కారణంచేత ఇస్లామ్ అన్నది నాకు అభిమానపాత్రమయింది.

ఈ మానవతావాది ప్రవచనాలలో మరికొన్ని అంశాలు నా హృదయాన్ని గట్టిగా బంధించినవి.

అవి ఏమిటి?

# అద్భుతములు చెయ్యని అద్భుత నాయకుడు

మతాధినేతలు మత మార్గదర్శకుల వంటి వారిని ప్రజలు తేలికగా నమ్మరు. వారు మాయలు, మంత్రజాలాలతో అతీంద్రియ శక్తులూ, మహత్తులు వంటివి చేసినపుడు ప్రజలు వారి ఘనతని నమ్ముతారు.

అతీంద్రియ శక్తులు ప్రాతిపదికగానే దేవుని మీది భక్తి, విశ్వాసాలు కలిగి ఉంటున్నారు సామాన్యులు.

మంచివారికి సుఖప్రదమయిన జీవితం.

పాపులకి - రోగాలూ - కష్టాలు.

ఈవిధంగా చెప్పినప్పుడే ... మనిషి మంచి నడవడికగల వాడుగా బ్రతకటానికి ప్రయత్నించి, ముందుకొస్తున్నాడు !

అందుచేత సనాతన పద్ధతులు, ఆది గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు, బైబిల్, జాతక కథలు ఇత్యాది వాటన్నింటిలో మత ప్రయోక్తలు, అద్భుత శక్తులు, అతీంద్రియ శక్తులు ప్రదర్శించిన గాథలు కనిపిస్తూవుంటాయి.

అద్భుత శక్తులు, భూతప్రేతాల కథలూ వంటివి మిక్కుటంగా లేని జీవితం - మహా ప్రవక్త జీవితం ఒక్కటే.

అదేకాదు - "దైవం నుండి మీరు ఏ అద్భుత శక్తులని పొంది ఉన్నారు?" అని అడిగినవారికి - 'దివ్య ఖుర్‌ఆన్ అనేటువంటి అద్భుతమయిన దానిని' అని వారికి చూపించారాయన.

మంత్రతంత్రాల మీద నమ్మకంలేని, మహోత్తమమైన భావ విప్లవం పైననే నమ్మకం ఉంచిన ఒకే ఒక్క విప్లవ మత ప్రయోక్త అగ్రజులు.

ఇంకొక విశేషం (అంశం) : ఏ మత ప్రయోక్తా - మత మార్గం బోధించిన ఏ ఆచార్యులూ సైనికాధిపత్యం వహించి ఉండలేదు.

సహనశీలి, సౌమ్యుడు, శాంతిదూత, మహాపరాక్రమంతో పోరు సలిపినవారు కూడా ! ఇలాంటి వ్యక్తిగా ఒక్క అగ్రజునే పేర్కొనవచ్చు.

బద్ర్ లోయ యుద్ధం.

యూదుల కైనుకా కోట ముట్టడి.

అల్ సవీల్ యుద్ధం.

ఉహద్ యుద్ధం.

తబూక్ పోరాటం.

కైబర్ పోరాటం.

అను పలువిధములయిన పోరాటములు సల్పిన మహా పరాక్రమ వంతుడు, వీర శిఖామణి అగ్రజులు (సఅసం).

నూతన మార్గానికి అధినేత, అదే సమయంలో - వీరాధివీరుడు - అని ప్రఖ్యాతిగాంచిన ఘనత అగ్రజులు (సఅసం) కొక్కరికే లభించింది ఈ మానవ జాతి చరిత్రలో.

సైనిక వ్యూహంలో, యుద్ధ తంత్రంలో ఆయన ఆరితేరినవారు అనీ....

ఆయన తన మార్గం ద్వారా ప్రబోధించిన విధానాలు పౌరుషానికీ, శౌర్యానికీ, ఆత్మగౌరవానికీ పునాదులు వేసినవని మనం గ్రహించాలి.

పోరాటం జరుగుతున్నప్పుడు, ఈ యుద్ధము శత్రుదేశాన్ని ఆక్రమించి పట్టుకోటానికి జరుపుతున్నాము, ప్రత్యర్థిని పరాజితుని చెయ్యటానికి జరుపుతున్నాము - అని అనుకుంటారు చాలామంది.

కాని జిహాద్ - దైవ మార్గంలో నిరంతర కృషి జరుపుతూ ప్రాణత్యాగానికైనా సిద్ధమవడం - ద్వారా పోరాటం పవిత్రమయినది అన్న భావానికి, అభిప్రాయానికి ప్రాణం పోసినవారు, పునాది వేసినవారు అగ్రజులు.

పోరాటంలో వీర మరణం పొందినవారిని "షహీద్" లు, అమరగతులు అని పిలిచి ఘనంగా గౌరవించారు.

యుద్ధంలో వెన్నిచ్చి పారిపోవటం, తళతళ మెరిసే కరవాలపు ఉధృతానికి జడిసి వెనక్కి తగ్గటం, పిరికితనంతో భయపడటం, ఆత్మహత్య చేసుకోవాలనుకోవటం - ఇవన్నీ "నరకానికి మార్గాలు" అని ప్రబోధించి, పౌరుషానికి, వీరావేశానికి బీజాలు వేసిన ఆణిముత్యము - ఈ మానవాగ్రణి.

ఈ కారణం వల్లనే స్పెయిన్ నుంచి చైనా వరకు, అపజయమే ఎరగని విజయపతాకను ఎగరవేయగలిగారు ముస్లింలు.

ఆ మహనీయుడు చూపించిన మార్గం నుంచి ముస్లిమ్ ప్రజానీకం దారితప్పటం చేతనే పౌరుషమూ, భుజబలమూ ప్రాతిపదికగా గల జీవన సరళిని కోల్పోయి, విజయపరంపరలకు బదులు అపజయాలను ఎదుర్కొంటున్నారు - అన్నది చరిత్ర చెపుతున్న సత్యం.

ఈ మహాప్రవక్త నిరూపించిన మరొక చారిత్రక సత్యం ... అన్నిటిలోనూ మహోన్నతులు అనుకున్న రోమన్ వీరులని... పరాజితులని చెయ్యగలగటం.

సిరిసంపదలతో, సుసంపన్నమయిన, పరాక్రమవంతులయిన సామ్రాజ్యాధిపతులు రోమనులు.

కాని - ముహమ్మద్ ప్రవక్త... సల్లల్లాహు అలైహి వ సల్లం ... ఎడారి లోని ఇసుక రేణువుల నుంచి వచ్చిన బీద నాయకులు.

ఆయన అశ్వారూఢులై పోరాటానికి వెళ్ళిన గుర్రాల్లో ఒక దానికి కూడా తోలు, పట్టా, జీనులాంటివి లేవు. పాత గుడ్డ పీలికలు తాడులాగా పేని గుర్రానికి కళ్ళెం వలె వాడేవారు.

రోమన్ చక్రవర్తులు బ్రహ్మాండమయిన రాజప్రాసాదాల్లో ఉండి యుద్ధం నడిపిస్తూవుండేవారు. ఈ నాయక శిఖామణి పూరి గుడిసెలలో నుండి ప్రత్యర్థులని ఎదుర్కొన్నారు. అయిననూ విజయం ఈ మాననీయుడినే వరించింది.

సన్యాసం స్వీకరించి సర్వసంగపరిత్యాగం చేసి, జీవించటం సులభమే! కాని అరేబియా, దానికి చుట్టుపక్కల దేశాలని ఒక్క తాటిపై నడిపించిన మహారాజయి కూడా, ఒక బీదవాడుగా, సర్వసంపదలూ త్యజించినవాడుగా, పూరిగుడిసెలో జీవితం గడిపారు - అన్నది తలుచుకున్నప్పుడు, కళ్ళు చమరుస్తాయి, గుండెల్లో ఏదో తెలియని ప్రేమవాహిని ఉప్పొంగి కన్నీళ్ళ రూపంలో బయలుపడుతుంది.

ఈ మహానాయకుడు విగ్రహాలని తునకలు చేసిన ఒక మహా విప్లవవాది కావడమే కాదు. ఇంకొక మహోన్నతమయిన అనూహ్యమయిన కార్యం చేశారు. అది ఏమిటి?

★★★

# భగవంతుని కుమారుడా ఏసు (ఈసా) ప్రవక్త?

విగ్రహాలని పగలగొట్టి, రూప చిత్రాలని తుడిచివేయటమే గాక, ఈ మహాప్రవక్త చేసిన గొప్ప విప్లవ కార్యం... ఆ కాలంలో ఉన్నటువంటి ఇంకొక బలీయమయిన నమ్మకాన్ని కూడా ఈయన ఖండించారు.

తండ్రి....

కుమారుడు...

పరిశుద్ధాత్మ...

అను ఈ మూడింటిలో పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండటమే క్రైస్తవ మత తత్వము - అదే క్రీస్తు మతము.

పాపులను రక్షించడానికి - మానవుల పాపములను తానే మోసి, యాతనలనుభవించి, సిలువవెయ్యబడి, హింసకు లోనై మరణించి, మూడవ రోజున తిరిగి బ్రతికి, పరమ పితకు కుడి భాగాన సింహాసనారూఢుడయ్యాడు- అని క్రైస్తవుల విశ్వాసము.

1. ఏసు - భగవంతుని కుమారుడు.

2. ఆయన మరణంలోనించి తిరిగి జీవం పొందారు.

- ఈ రెంటినీ విశ్వసించనివారు, క్రైస్తవులు అవటానికి సాధ్యం కాదు - అవలేరు.

ఈ రెండు విశ్వాసాల ఆధారంగా క్రీస్తుమతము ప్రబలంగా స్థిరపడిపోయిన కాలంలో, మహా నాయకుడయిన ప్రవక్త ఈ సిద్ధాంతాలని తిరస్కరించారు.

ఏసు భగవంతుని కుమారుడు కాదు.

దివ్య దూత - మహాప్రవక్త.

క్రైస్తవ మతంలోని - 'దీర్ఘదర్శకులు' అని పిలువబడినవారు ఇస్లామ్‌లో 'ప్రవక్తలు' - అని పిలువబడుతున్నారు. వారి వారి పేర్లలో కొద్దిగా తప్ప మార్పులు లేవు.

ఆదమ్ (ఆదామ్) ఇస్మాయీల్ (ఇష్మయేల్) యాకూబ్ (యాకోబ్) మూసా (మోజెస్) దావూద్ (దావీదు) యూనుస్ (యోనా) జకరియ్యా (జకరయ్య) ఇబ్రాహీమ్ (అబ్రహామ్) ఇస్‌హాక్ (ఈసాక్) యూసుఫ్ (యోసేబ్) హారూన్ (అరోన్) సులైమాన్ (సాలమన్) ఇల్యాస్ (ఎలియా)

- ఈ విధంగానే ఏసుని ఈసా అని ... ముస్లింలు పిలుస్తారు.

అదే కాదు - వారు ఆయన ఒక ప్రవక్త, దైవసందేశహరుడన్న సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు.

క్రైస్తవ మతస్తులకీ, ఇస్లామీయుల మత విశ్వాసాలకీ మధ్య గల వాద ప్రతివాదాల గురించి ఇక్కడ చర్చించటం నా అభిమతం కాదు. నేను దీనంతటినీ వేరే దృష్టితో చూస్తున్నాను. ఆనాడు దృఢంగా, లోతుగా పాతుకుపోయిన ఒకానొక సిద్ధాంతం మత విశ్వాసం, అంతకంటే బలమైన వాదంతో తునాతునకలుగా ఖండించబడినది, తిరస్కరించబడినది.

తప్పుడు వాదం తిరస్కరించబడినదే తప్ప ఈసా (ఏసు) ప్రవక్తకి ఏ

విధమయిన నిరాదరణగాని, న్యూనతగాని ఆపాదించడం జరగలేదుః

పరిశుద్ధ ఆత్మ ద్వారా ఈసా (అస్సలాం)కు బలం చేకూర్చడం జరిగింది.

ఆయన ద్వారానే ఒక పవిత్ర గ్రంథం ఇంజీల్ (బై బిల్) ప్రసాదించ బడినది.

అన్నదంతా అల్ కితాబ్ (దివ్య ఖుర్ఆన్) మిక్కిలి గౌరవించి ప్రస్తావించింది.

అదే మాదిరి ఇతర మతములలోని సిద్ధాంతాలని ఖండించినప్పటికీ మనిషి సాటి మనిషికి చూపవలసిన మర్యాద మన్ననలు ఆయా ధార్మిక వ్యక్తిత్వాలకు తప్పక చూపవలసిన కనీస కర్తవ్యం అని అగ్రజులు నిబంధన ఏర్పరచారు.

మరొక మతానికి చెందిన ఒక వ్యక్తి మరణించగా, ఆ మృతదేహాన్ని తీసుకువెడుతున్నప్పుడు, ఆ అంతిమ యాత్రలో ముందు నడిచి మృత కళేబరం పట్ల చూపవలసిన మర్యాదను అభిమానాన్ని వెల్లడించారు అగ్రజులు.

తప్పుడు భావనల ఖండన వేరు.

వ్యక్తిత్వాలకు ఇచ్చే మర్యాద వేరు.

ఈ రెంటినీ - కలగాపులగం చెయ్యకుండా, సమాన దృష్టితో, చూడ గలిగిన తులామాన సదృశమయిన ఒక విశాల న్యాయ దృక్పథాన్ని ఇచ్చిన వ్యక్తి, మానవులలో తలమానికం వంటివారు - అగ్రజులు.

ఎమర్జన్సీ కాలంలో 'మీసా' (MISA) కారణంగా నేను నిర్బంధానికి లోనయి పక్క మీద పడుకునే చాలా రోజులు గడిపాను. ఆ సమయంలో

ప్రపంచంలోని అన్ని మతాలని, వాటి విధానాలని, ఆ మతాలలోని మూల అర్థాలని, సూక్ష్మ భావాలని మిక్కిలి శ్రద్ధతో అధ్యయనం చేశాను.*

మా కుటుంబంలోనివారు - పాపం ఎక్కడెక్కడో తిరిగి ఆయా మత గ్రంథాలన్నిటినీ సేకరించి తీసుకొచ్చి ఇచ్చారు. అందులో కొన్ని గ్రంథాలు నా ముస్లిమ్ స్నేహితులు (ముస్లిమ్‌లు అని పిలువబడు ముస్లిమ్‌లు) తమ స్వంత ఖర్చుతో కొని తీసుకొచ్చి ఇచ్చారు.

ఆ మత గ్రంథాలని, వాటిలో నిగూఢమై ఉన్న విషయాలని చదివి ఆకళింపుకున్న వెనుక, వాటన్నిటిలోకి నా హృదయాన్ని అయస్కాంతం వలె పట్టి లాక్కున్న గ్రంథం - "అల్ ముతహ్హరా" అయిన - అల్ ఖుర్ఆన్ ఒక్కటే.

అది ఎలా అంటే?

★★★

# అల్ ఖుర్ఆన్‌లోని రూపరహితమైన విశిష్టత

మత గ్రంథాలని పలు రకాలుగా విభజించవచ్చు. ఒక్కొక్క గ్రంథం గురించి ఒక్కొక్క విశిష్టతను చెబుతారు.

హిందూ మతము అని పిలువబడు వైదిక మత గ్రంథాలన్నిటిలో మునీశ్వరులూ, రుషిపుంగవులూ మొదలగువారు భగవంతుని గూర్చి పాడి, స్తుతించిన స్తోత్రగానములే.

సముద్ర గర్భములో కలిసిపోయిందని చెప్పబడే యూదు మత గ్రంథములోను, క్రైస్తవ మత గ్రంథమయిన బైబిల్‌లోనూ మత ప్రబోధకుల జీవిత చరిత్రలూ, వారి బోధనలూ ఉంటాయి.

ఈ విధంగా మత గ్రంథాలలో చాలా భాగము వినికిడి వల్లా, అనువంశికంగా ఒక తరం నుంచి మరో తరానికి అందించబడుతున్న స్తోత్రగానాలు, చారిత్రక అంశాలూనూ.

దివ్య ఖుర్ఆన్, మహాప్రవక్త (సఅసం) చేత రచించబడి పొందుపరచ బడినది కాదు. ఒక తరం నుంచి మరో తరానికి వినికిడి ద్వారా అందించబడిన హితోపదేశాల కూర్పు కూడా కాదు. ఇదేగాక చరిత్రపూర్వకమయిన సంఘటనల గ్రంథం అంతకన్నా కాదు.

మహామహిమాన్వితుడయిన అల్లాహ్ యొక్క లౌహుల్ మహ్‌ఫూజ్ అనే మహత్తుపూర్వకమయిన రక్షిత గ్రంథం ఉంది.

ఆ ఉద్గ్రంథం నుంచి దైవదూతలలోకెల్లా ఉన్నత స్థానం గల జిబ్రీల్ (అలైహిస్సలాం) ద్వారా మహాప్రవక్త హృదయ పీఠంపై అవతరింపజెయ్యబడి ఆయన నోటిగుండా పైకి వెలువరింపబడిన, పఠించబడిన అమృతతుల్య మయిన, పరమ పవిత్రమయిన ఆదేశాలను పొందుపరచబడిన గ్రంథం ఇది.

–ఇటువంటి విశ్వాసమూ – దృఢమయిన నమ్మకమూ కలిగి ఉన్నారు ముస్లిమ్‌లు.

అందువల్ల దివ్య ఖుర్‌ఆన్ అను పవిత్ర గ్రంథం మానవ విరచిత గ్రంథం కాదు, అది దైవవాణి, దైవికంగా అవతరింపబడిన ఉద్గ్రంథం. ఈ విషయంలో సుస్థిరమయిన అచంచలమయిన విశ్వాసం కలిగివున్నారు ముస్లిమ్‌లు.

ఈ దివ్య మార్గ ప్రబోధానికి ఎందరో – ఎన్నో కోణాలనుంచి వివిధ రకాల వ్యాఖ్యానాలు రాసి ఉన్నారు. ఆ దివ్య గ్రంథంలోని ఉత్కృష్టత, గణనీయత అనూహ్యమయినది. కాని, నాకు ఆ దివ్య గ్రంథంలో ప్రత్యేకంగా కనపడే అంశం – "నాద తరంగాల్లోని ఒక రకమయిన లయ విన్యాసం" ఆ లయ విన్యాసమే – నా చెవులలో అమృతం చిలకరిస్తూ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

ఆ దివ్య గ్రంథ పఠనాన్ని విన్న ఎందరో ఆ నాద తరంగాన మాధుర్యానికి పరవశులయి – మానసిక మార్పుపొంది ఆ మార్గాన్నే అనుసరించి ఉన్నారు.

నాదానికి అంత శక్తివుందా? నాద ప్రభావం అంత మార్పు కొనితెస్తుందా?– అని అడుగవచ్చు. అవును. నాదమే ఈ ప్రపంచానికి మూలాధారం.

"ఓమ్... అను ప్రణవ మంత్రానికి ఓంకారానికి - నాదమే మూలమ్" అని హిందువుల నమ్మిక.

"ఆదిలో మాట పుట్టింది" అని బైబిల్ చెబుతున్నది.

ఆ దివ్య గ్రంథంలోని నాదం - ఒక కావ్యగానం... చిత్ర లేఖనంలోని సౌందర్యం - కల్పనా ప్రపంచంలోని సాహిత్య పరిమళం.

ఏమిటి? ఇంతటి అపూర్వమయిన అనుభూతి ఆ గ్రంథ నాదంలో ఉందా? అని ఈ కాలంలోనే కాదు - ఆ రోజులలో కూడా ఎందరో ప్రశ్నించారు.

అందుకు వారికి చెప్పవలసిన సమాధానం, అడగవలసిన మాట ఒక్కటి ఉంది. "ఇదే మాదిరి - ఈ దివ్య గ్రంథాన్ని పోలిన దానిని మరొకటి- సృష్టించగలరా?" అని !

అటువంటి వ్యర్థ ప్రయత్నాలు ఆ కాలంలోనే చేశారు. ఆదిలోనే అవి విఫలమయి, ప్రయత్నించినవారు పరాజితులయిపోయారు. కాదు - అని అనగలరా?

*ఇన్నా ఆతయ్‌నా కల్ కౌసర్ ఫసల్లి లిరబ్బిక వన్‌హర్ ఇన్న షానిఅక హువల్ అబ్‌తర్.*

(అల్ ఖుర్ఆన్ - 108 : 1-3)

ఈ మాదిరి అందమయిన, లోతయిన, అతి నిరాడంబరమయిన, ఉదార భావనాపటిమతో, గంభీర పదజాలంతో రచన సాగించాలని అరబ్ దేశంలో - మహా మహా పండితులు ప్రయత్నం చేసి విఫలత చెందారు -

మాహాజా కలాముల్ బషర్ - ఇవి మానవుని నోటినుంచి వచ్చిన మాటలు కాజాలవు - అని ఎలుగెత్తి పలికారు. ఓటమిని అంగీకరించారు. దీనికి

ఇస్లామీయ చరిత్రే సాక్ష్యం.

> మానవులు, జిన్నులు ఒక్కటయి దివ్య ఖుర్ఆన్ లాంటి దాన్ని దేన్నయినా రచించ ప్రయత్నాలు చేసినా, వారు అటువంటిదాన్ని రచించలేరు; వారందరూ కలసి పరస్పరం సహకరించుకున్నాసరే.
>
> (దివ్య ఖుర్ఆన్ - 17 : 88)

దివ్య ఖుర్ఆన్‌లోనే దాని గుణ వాచకాలయిన పేర్లున్నాయి. అవి ఆ గ్రంథపు ప్రాశస్త్యం గురించి చాటుతున్నాయి, వాటిని ఇక్కడ పొందు పరుస్తున్నాను.

అల్ కితాబ్ = దివ్య గ్రంథం.

హబ్‌లుల్లాహ = అల్లాహ పంపిన త్రాడు.

అల్ బయాన్ = దివ్య వివరణ.

అల్ బుర్‌హాన్ = విస్పష్టమయిన ఆధారం.

అల్ ముహైమిన్ = రక్షక సాధనం.

అల్ ముబారక్ = శుభదాయకం.

అల్ ముసద్దిక్ = సత్యనిరూపణ.

అజ్ జిక్రా = సదుపదేశం.

అన్నూర్ = దివ్య కాంతి.

అల్ బసాయిర్ = జ్ఞాన ప్రకాశం.

అల్ హుదా = సరళమార్గం.

అర్ రహ్మత్ = దైవ కారుణ్యం.

అష్ షిఫా = సంజీవి (నివారిణి).

అల్ మౌఇజత్ = మంచిమాట.

అల్ హుక్మ్ = న్యాయశాసనం.

అల్ ముబీన్ = దేదీప్యమానమయినది, విస్పష్టమైనది.

అల్ అరబియ్యా = అరబీ భాషలోనున్నది.

అల్ హిక్మత్ = విజ్ఞత, వివేచన.

అల్ హక్క్ = సత్యము.

అల్ కయ్యిమ్ = సుస్థిరమయినది.

అల్ ఫుర్కాన్ = ప్రామాణికతా సాధనం, గీటురాయి.

అత్ తన్జీల్ = (దైవం తరఫున) అవతరించినది, అవతరింప జెయ్యబడినది.

అల్ హకీమ్ = వివేచనాపూర్వకమయినది.

అజ్ జిక్ర్ = జ్ఞాపిక.

అల్ బషీర్ = శుభవార్తనిచ్చేది.

అల్ నజీర్ = హెచ్చరించేది.

అల్ అజీజ్ = శక్తిమంతమయినది.

అర్రూహ్ = జీవమున్నది.

అల్ మజీద్ = గౌరవనీయమయినది.

అల్ కరీమ్ = ఘనతగలది.

అల్ ముకర్రమా = ఆదరణీయమయినది.

అల్ అజీబ్ = ఆశ్చర్యపూరితమయినది.

అల్ మర్ఫూఅ = ఉన్నతమయినది.

అల్ ముతహ్హర = పరిశుద్ధమయినది.

అన్ నీ'మత్ = గొప్ప వరం.

ఇదే కాకుండా, ఖుర్ఆన్ అను అరబీ మాటకు "పఠించబడేది, పారాయణం చేయతగినది" అనేదే అసలు అర్థం. "ఇది కంఠస్థం చేయతగినది, మోక్షప్రదాయిని - " అన్న అర్థం కూడా ఉంది... అవును, ప్రపంచ ప్రజానీకంలోని - బుద్ధి జీవనుల మధ్య ఎక్కువగా పఠించబడేది ఈ దివ్య గ్రంథమే.

★★★

# నిరక్షరాసి అనే దానికి కొత్త ఉన్నత భావం

దైవం పంపిన పవిత్రమయిన ఖుర్‌ఆన్‌ని మొట్టమొదట పఠించిన నాయక శిఖామణి అయిన మహాప్రవక్త ఒక 'ఉమ్మి' - నిరక్షరాస్యుడు. రాయటమూ, చదవటమూ రాని పామరుడని విని ఉన్నాము.

'ఉమ్మి' లేక 'అక్షరశూన్యుడు' అంటే తెలివిహీనుడు, జడుడు అని అర్థం కాదు. చదవనూ, రాయనూ చేతగాకపోయినా - అపార జ్ఞాపక శక్తి, గ్రహణ శక్తి గలిగిన వారిని ఉమ్మీలు అనేవారు.

మన భాషలో కూడా కొత్త పద్యపాదాలను, కొత్త వాక్యాలను ఇంకొకరు చెప్పినపుడు ఒక్కసారే విని, అది వెనువెంటనే అప్పజెప్పగలిగినవారు ఏకసంథాగ్రాహి అని పిలువబడుతుంటారు.

అలాగే కొత్త పద్యభాగంగాని, వచనంలో వాక్యాలుగాని ఎదుటివారి ముఖతా రెండుసార్లు విని వెంటనే అప్పజెప్పగల గ్రహణ పారిణీలు ఉన్నారు.

తిప్పి తిప్పి నాలుగుసార్లు చెప్పగా విని, దానిని అప్పజెప్పగలవారూ ఉన్నారు.

ఇవన్నీ మన ప్రాచీన భాషలలో గ్రహణ శక్తి, ధారణ శక్తి, ఇంకా మన భాషా సంప్రదాయాలలో ఆశు కవిత్వం, అవధానం లాంటివి ఉన్నాయి. వీటిని జన్మతః లభించిన అపూర్వ ప్రతిభా సంపత్తి అని పొగుడుకుంటూ ఉంటారు.

కాని వందలాది అద్భుతమయిన అరబీ కవితలని ఒకే గోష్ఠిలో ఒక్క బిగిన ధారావాహికంగా, అప్పజెప్పే ధారణ శక్తి, స్మరణ శక్తి గలవారు ఆ ఉమ్మీలు - నిరక్షరాస్యులు !

కేవలం కవిత్వం చెప్పటంలోనే కాదు, గణితంలో కూడా వారు దిట్టలు. పెద్ద పెద్ద చదువులు చదివినవారు 214ని 314 బెట్టి హెచ్చించండి అంటే పెద్ద కాయితమో, పలకో పుచ్చుకుని గబ గబ హెచ్చవేత మొదలుపెడతారు.

కాని, అక్షర జ్ఞానంలేని ఆ పామరులు - 'ఉమ్మీలు' , రెండు క్షణాల్లో జవాబు చెప్పేస్తారు నోటి లెక్కతో. ఆ గుణించగల ప్రతిభ, నేర్పు మనసులోనేవుండి, క్షణంలో గుణించి చెప్పెయ్యగలుగుతుంటారు - గణిత శాస్త్రజ్ఞులకి మించిన మేధా శక్తితో.

ఒక్క లెక్కలూ - డొక్కలూలోనే కాదు, తమ తండ్రి, తాతముత్తాత, ముత్తాతకి తాత అంటూ పది పదిహేను తరాల వారి పేర్లను వారి చరిత్రను క్రమానుగతంగా చెప్పగలిగిన ప్రతిభ కలవారు ఆ నిరక్షరాస్యులు.

"ఫలానావాని కొడుకు వల్ల, ఫలానావారి కూతురికి పుట్టిన ఫలానా వ్యక్తి"... అంటూ గబగబ కొండమీంచి జాలువారే జలపాతంలాగా తమ తమ కుటుంబ చరిత్రలు వర్ణించి చెపుతూంటారు.

అదేవిధంగా ఆకాశంలోని నక్షత్రాల పేర్లు, అవి ఎటునుంచి ఎటు వైపుకి మారేదీ ఇత్యాదివి చెపుతుంటారు.

పట్టభద్రులై, ఉన్నత విద్యనభ్యసించి, బోలెడు డిగ్రీలు సంపాయించి, పుస్తకాలు చూసి చూసి చెప్పే విషయాలు పుస్తకాల ముఖం ఎరగకుండానే తమ స్మరణ శక్తి, ధారణ శక్తి ద్వారా చెప్పగల 'తెలివీ - ప్రతిభా' కలవారికే ఉమ్మీలు - నిరక్షరాస్యులు లేక పామరులు అన్న పేర్లు వచ్చాయి.

విద్యావంతుల కంటే తమకి ఎక్కువ తెలివితేటలుండటం చేతనే అరబ్బులలో చాలామంది తాము 'చదువురానివారం' అని అనుకోవటంలో గౌరవమూ, ఘనతా ఉన్నాయని భావిస్తూ ఉండేవారు.

'నిరక్షరాస్యత' అంటే తెలివిలేనివాడు, తెలివిహీనత అనుకుంటే... మానవ శిఖామణి అయిన మహాప్రవక్త (సఅసం) వర్తకవాణిజ్యాల్లో ఎలా రాణించగలిగారు? అది కూడా దేశంగాని దేశం వెళ్ళి, ఖదీజా వంటి యజమానురాలి విలువయిన వర్తక – వాణిజ్యాలని ఎలా నిర్వహించగలిగారు?

అందువల్లనే మహాప్రవక్తను 'ఉమ్మీ' అనడమంటే ఆయనకు చదవను, వ్రాయను రాదన్న భావంలోనే. ఆయన మహా గొప్ప జ్ఞాపక శక్తి, ధారణ శక్తి, మేధాసంపద గలవారనడంలో సందేహం లేదు.

అటువంటి మేధాసంపద ధారణ శక్తి కలవారు అవటం చేతనే 'వహీ' అవతరించినప్పుడు ఆ దైవవాణిని, పవిత్ర గ్రంథాన్ని అక్షరప్పొల్లు పోకుండా వినిపించడం ప్రారంభించి భద్రంగా పరిపూర్తి చేయగలిగారు అగ్రజులు.

ఆయనకి దేవుని కరుణ లభించింది. అందుచేతనే ఆయన ముఖతః పవిత్ర సందేశాన్ని విని, ఒక్క పొరబాటుగాని, తప్పుగాని లేకుండా గ్రహించి, ఆ దివ్య సందేశాన్ని మానసాంబుధిలో భద్రపరచుకొని, శ్రుతిపూర్వకంగా, లయబద్ధంగా పఠించగలిగిన 'కారీ'ల (స్మర్తల) ఆ ప్రతిభని ఏమని పిలవాలి? అక్షరాస్యత లేని ఈ అవధానాన్ని, ప్రపంచానికి అనుగ్రహించిన మహిమాన్విత గ్రహణ శక్తి అందామా?

సాధారణంగా అరబ్ దేశస్తులు అనేటప్పటికి మొండివారు, తెలివిలేని మూర్ఖులు, హత్యలూ దోపిడీలలో అందెవేసినవారు – అన్న అభిప్రాయం వాడుకలో ఉంది. ఇది కేవలం గాలి వార్త, ఇందులో నిజం లేదు – అని నేను నొక్కి చెప్పగలను.

వేల సంవత్సరాల క్రితం ఈ భూమండలంలోని మానవులంతా ఎలా ఉండి ఉన్నారో, ఉండి ఉండేవారో ఆ విధంగానే అరబ్ దేశస్థులు కూడా మానవ సహజమయిన బలహీనతలనూ, శౌర్యపరాక్రమాలను కలిగి ఉండేవారు.

వేల సంవత్సరాల క్రితం చదువుకున్నవారు కొద్దిమంది - చదువురానివారు ఎక్కువ మంది. అది ఆనాటి ప్రపంచపు తీరు.

కాని, అరబ్ దేశంలో విద్యాగంధం లేనివారిలో, అక్షర శూన్యులలో తెలివయినవారూ, ప్రతిభ కలవారూ ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

అక్షర శూన్యులయినంత మాత్రాన మోటుతనం, మొండితనం కలుగదు. విద్యకి మొరటుతనానికి సంబంధం లేదు.

అరబ్ దేశస్తులకంటే మోటుగా ఉన్నవారూ, మూర్ఖులూ ఎన్నో దేశాల్లో ఉండి ఉన్నారు.

- మనిషి తల నరికి కోట గుమ్మానికి వేళ్ళాడతీసినవారు.
- మనిషికి బరువయిన రాళ్ళు కట్టి సముద్రంలోకి విసిరివేసినవారు.
- మనిషిని ఏనుగు పాదాల కింద పారేసి తొక్కించినవారు.
- గొంతు నరికినవారు.
- బ్రతికుండగానే - సజీవ భూస్థాపితం జరిపించినవారు.
- మనిషిని సున్నపు బట్టీలోకి తోసినవారు.
- చేతుల్లో ఆయుధంలేని నిస్సహాయుడయిన మనిషిని సింహానికి ఎరగా బోనులోకి విసిరి, ఆనందించినవారు.
- ఇటువంటివి రోము నుంచి - దక్షిణ భారతందాకా చరిత్ర పుటల్లో క్రూరత్వానికి, మూర్ఖత్వానికి సంబంధించిన సంఘటనలు అనేకం కనిపిస్తాయి.

అదే కాదు - అరబ్ దేశస్థులు క్రూరులు, మోటువారు, తెలివిహీనులు అని ఎవరయితే అంటూంటారో వారే - ఈ గుణాలన్నీ కలవారు.

మహాప్రవక్త ఇస్లామ్ మార్గాన్ని ప్రబోధించినపుడు ఆ మహనీయుని ప్రతిఘటించి బాధించినవారు అరబ్బులు అయి ఉండి ఉండవచ్చు. కాని ఆ అరబ్ ప్రజలే - మరో ప్రాంతానికి చెందినవారయిన, మదీనా ప్రజలతో పోరాటం సలిపారన్నది ఆ పోరాటం ఈ మహిమాన్వితుని నాయకత్వం అంగీకరించి జరుపబడినదని కూడా చరిత్ర చెపుతున్నది.

అతి పవిత్రమయినవని ప్రసిద్ధి పొందిన ఆలయంలోని దేవతా విగ్రహాలని పగలగొట్టి భగవంతుని ప్రతిరూపాలని, కుడ్య చిత్రాలు ఉంచకూడదు అన్న విప్లవ భావాలని, ప్రగతి మార్గాన్ని వెయ్యి సంవత్సరాల క్రితం అంగీకరించి, నూతన విప్లవ భావాలు మొగ్గతొడిగి, అవి పుష్పించటానికి దోహదం చేసినవారి దేశం అరబ్ దేశం.

అటువంటి మత విప్లవం పధ్నాలుగు వందల ఏళ్ళ క్రితం ఇటు భారత దేశంలోగాని - అటు చైనాలోగాని సంభవించి ఉంటే, ఇంతటి ప్రోత్సాహం, ఆదరణ లభించి ఉండేదా - అని ఆలోచించి చూసినప్పుడు - అరబ్ దేశం యొక్క అరబ్ ప్రజల యొక్క ఘనత బోధపడుతుంది.

అరబ్ దేశం ఎడారి ప్రదేశం అయినప్పటికీ - విప్లవం పుష్పించిన పూలవనం, విప్లవ భూమి అవడంచేత ఆ దేశానికి, అక్కడి ప్రజలకు జోహార్లు గౌరవాంజలులు ఘటిస్తున్నాను !

ఆ విప్లవ సంఘటన వల్ల ప్రపంచానికి లభించిన ఒక పవిత్ర మార్గం గురించి, ఆ మార్గంలోని ఒక ఉన్నత విశిష్టత గురించి చెపుతాను.

★★★

# జీవభాషలో సజీవ సందేశం

("నేను ఆరాధించే ఇస్లామ్"... అను ఈ వ్యాసపరంపర గురించి అభినందనలు, ప్రశంసలూ ముస్లిమ్ పెద్దల నుంచి, స్నేహితుల నుంచి, పరిచయస్తుల నుంచి, తంతి ద్వారా, ఉత్తరాలు, నోటి మాటల ద్వారా కుప్పతిప్పలుగా వచ్చిపడ్డాయి. ఈ వ్యాసపరంపర ఆరంభించిన నాటినుంచీ అతి శ్రద్ధగా చదువుతూ వచ్చిన ముస్లిమ్ సోదరులు కొందరు మల్లె పువ్వులు పళ్ళెం నిండా పోసుకుని వచ్చి, ఆ మల్లెల వంటి దరహాస వదనాలతో, తమ ఆనందాన్ని వ్యక్తీకరించారు ; ఇస్లామ్ మత గ్రంథాలని సేకరించి తీసుకొచ్చి ఇచ్చారు మరికొందరు. మనసారా అభినందనలు తెలిపిన వీరందరికీ నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. వారందరూ నాకు వేసిన ఈ ప్రశంసామాలని- అందరి ప్రస్తుతులకూ అర్హుడయిన - 'ఆ స్తోత్రమూర్తికో వినమ్రుడనై హృదయపూర్వకంగా అర్పించుకుంటున్నాను.)

వేదాలు, బైబిల్ మున్నగు ఇతర మత గ్రంథాలకీ - దివ్య ఖుర్‌ఆన్‌కి మధ్య ఒక ప్రత్యేకమయిన భిన్నత్వం ఉంది.

హిందూ మతం లేక వైదిక మతంలోని నాలుగు వేదాలలో ఉపయోగింపబడిన భాష సంస్కృతం.

సంస్-కృతం అంటేనే కొత్తగా సంస్కరించబడిన భాష అని అర్థం.

సంస్కరింపబడిన భాషలో చెప్పబడినవి కావా - పురాతనమయిన వేదాలు? - అన్న ప్రశ్న వస్తుంది. అయితే మొట్టమొదట వేదాల్లో ఆరంభించిన భాష వేద భాష.

సంస్కృత భాష - ప్రాకృత భాష నుంచి వచ్చినది. ప్రాకృతానికి ముందే ఉంది వేద భాష.

ఆదిలోని వేద భాష, వేదవేదాంగాలు పదిలపరచబడిన ఆ పురాతన భాష స్వరూపంలో కొద్ది కొద్దిగా మార్పుచెందుతూ వచ్చింది.

కాని ముస్లిమ్‌ల దివ్య సందేశం ఏ అరబీ భాషలో అవతరించినదో అదే అరబీ భాషలో ఒక అక్షరం కూడా మార్పుచెందకుండా, అదే రూపంలో, అదే భాషలో ఈనాటికీ నిలిచివుంది.

యూదుల మత గ్రంథం కూడా కొన్ని వందల సంవత్సరాలు గడిచిన వెనుక 'ఇస్రా' అనువారిచేత సమీకరించబడినది.

అసలయిన - నిజమయిన యూదు మత గ్రంథం - తౌరాత్ (TORAH) మూసా ప్రవక్తకు హిబ్రూ భాషలో, అందజెయ్యబడిన తరువాత, చాలా సంవత్సరాలు గడిచిపోయిన వెనుక, ఈ మత గ్రంథం తిరిగి సమీకరించబడినది.

ఈ మత గ్రంథం కూడా నాశనం అయిపోయింది. ఆ తరువాత గ్రీకు, లాటిన్ భాషలలోనే నిలిచివుంది. ఆ రెండు భాషల ప్రాతిపదికగానే హిబ్రూ భాషలో యూదుల మత గ్రంథం అనువదించబడి, భద్రపరచబడి ఉంది.

అందుచేత అనువాదాల ఆధారంగా తయారుచేయబడిన మూల గ్రంథంగానే యూదు మత గ్రంథం ఇప్పుడున్నది.

మృత సముద్రానికి (DEAD SEA) అవతల వైపున ఉన్న కమ్రాన్ గుహలో దొరికినదని చెప్పబడుతున్న యూదు మత గ్రంథం (SCROLLS) కూడా తారుమారుగా ఉందన్నది ఈ మధ్యనే వెలువడిన ఒక వార్త.

అయితే, అనువాదాల కలగలుపూ, మార్పూ లేకుండా మూల

భాషలోనే అప్పుడూ ఇప్పుడూ ఒకే మాదిరిగా, అలాగే ఉన్న మత గ్రంథం దివ్య ఖుర్‌ఆన్ ఒక్కటే.

ఈసా (ఏసు) మహాప్రవక్తకి అనుగ్రహింపబడిన మత ప్రవచనం, సిరియా భాషకి ఉపశాఖ అయిన అరామిక్ భాషలోనే.

కాని, బైబిల్ అరామిక్ భాషలో మొట్టమొదట రాయబడలేదు. గ్రీకు భాషలోనే తొలిసారిగా లిఖించబడింది.

గ్రీకు నుంచి ఆ తరువాత లాటిన్ భాషలోకి బైబిల్ అనువదింపబడింది. భాషల మార్పుకి లోనయిన మత గ్రంథం బైబిల్, దైవం ద్వారా అనుగ్రహింపబడిన మూల భాషలో లేదు బైబిల్.

గౌతమ బుద్ధుడు మాట్లాడిన వాడుక భాష పాలీ భాష. కాని 'ధమ్మపథం' అను వారి పుణ్యగ్రంథం ఆ తరువాత కాలంలో ఆ తరువాత వాడుకలోనున్న భాషలో రాయబడింది.

కాని అల్ ఖుర్‌ఆన్ ఏ దివ్య భాషలో ప్రవచింపబడినదో అదే భాషలో ఈనాటికీ ఉంది.

ఈ దివ్య గ్రంథంలోని ఇంకొక ప్రత్యేకతని ఇక్కడ ఉదాహరింప బోతున్నాను.

హిందూ మత వేదాంతములు పదిలపరుపబడిన వైదిక భాష అయిన సంస్కృతం నేడు వాడుక భాష కాదు. ఇది ప్రజలు నిత్యమూ వాడే జీవ భాష కాదు. దీనిని మాట్లాడేవారు లేరు. ఆ సంస్కృత భాషకీ సామాన్య మానవుని నిత్య జీవితానికి ఎటువంటి సంబంధమూ లేదు.

యూదుల మత గ్రంథంలోని హిబ్రూ భాషని కూడా ఎవరూ మాట్లాడటం లేదు. (ఇజ్రయీల్ దేశంలో దీనిని సంస్కరించి - హిబ్రూ

వాడుక భాషగా కట్టుదిట్టం చేయబడింది.)

ఇదే విధంగా 'ఈసా' ప్రవక్త అరామిక్ భాషయు, గౌతమ బుద్ధుని పాలీ భాషయు సజీవంగా వాడుకలో లేనివి.

మత గ్రంథాల్లోని భాషలు అన్నీ ఇంచుమించు అన్ని మత గ్రంథాల భాషలూ సజీవంగా లేవు.

కాని, సజీవమయిన భాషలో సజీవమైవున్నది అరబీ భాషలోని దివ్య ఖుర్ఆన్ ఒక్కటే.

ఈ దివ్య సందేశంలో మరో ముఖ్యాంశం.

నాలుగు వేదములు.

యూదుల మత గ్రంథం.

ఈసా ప్రవక్త బైబిల్.

గౌతమ బుద్ధుని ధమ్మపథం.

ఇవన్నీ వాటిని ప్రవచించిన మహనీయులు మరణించిన తరువాత, కొన్ని వందల సంవత్సరాలు గడిచిన వెనుక, సమీకరించబడినవి, లిఖించబడినవి, జాగ్రత్తచేయబడినవి.

కాని, దివ్య ఖుర్ఆన్ మటుకు... దైవవాణి అవతరిస్తూ అవతరిస్తూ ఉండగానే... క్రమబద్ధంగా సంకలనపరచబడింది.

మహాపురుషుడైన - ప్రవక్త ఈ పవిత్ర గ్రంథానికి, తానే సజీవ వ్యాఖ్యానమయి, ఆయనే గ్రంథ సంకలనా కార్యాన్ని స్వయంగా పర్యవేక్షించారు. మొత్తం గ్రంథాన్ని ఒకచోట సమీకరించటం అన్నది తరువాత కాలంలో జరిగింది. అయినప్పటికీ ఆ దివ్య గ్రంథాన్ని గ్రంథస్థం చేయడమనే కార్యం

నాయక శిఖామణి జీవిత కాలంలోనే ఆరంభించబడింది. చెట్ల బెరడు మీద, జంతు చర్మం మీద, బొమికలు మొదలగు వాటిపైన వెంటవెంటనే లిఖించబడి, తత్సమయంలోనే తప్పొప్పులు సరిచేసి, భద్రపరచడం జరిగింది.

దైవ కృపచేత అనుగ్రహింపబడి, ఆ సమయంలోనే జాగ్రత్తగా లిఖించబడి, శాశ్వతంగా భద్రపరచబడిన - ఇన్ని పనులూ ఒకే కాలంలో నిర్వహించబడిన - మత గ్రంథం దివ్య ఖుర్ఆన్ ఒక్కటే.

తరువాత కొన్ని ముఖ్య విషయాలు చూద్దాం.

★★★

# గుప్తంకాని గొప్ప గ్రంథం – ఈ దివ్య గ్రంథం

ఈ దివ్యోపదేశ గ్రంథంలోని మరో అపూర్వ విషయం... ఈ పవిత్ర గ్రంథంలోని ప్రతి అక్షరం దేవుని వాక్కుగా, అల్లాహ్ కరుణ వచనంగా ప్రసాదించబడి లిఖించబడినది.

వేదాలు – స్తుతి కీర్తనలు.

తౌరాత్ (TORAH) గ్రంథం – చరిత్ర, బోధనలు.

ఇన్‌జీల్ (BIBLE) – చరిత్ర, బోధనలు.

కాని, ఈ పవిత్ర గ్రంథంలో చారిత్రక విషయాలూ చెప్పబడి ఉన్నాయి – మనిషిని సన్మార్గ వర్తనలో పెట్టడానికి, సన్మార్గునిగా ఉంచటానికి, సన్మార్గములో నడిపించటానికి, హెచ్చరికలు చేయడానికి, మానవునికి గుణపాఠం గరపడానికి.

ఇతర మత గ్రంథాలలో కూడా మహాప్రవక్త సూచించిన విధంగానే, ప్రవచనాలూ, ప్రబోధములూ ఉల్లేఖించబడి ఉన్నాయి. వాటిల్లోనూ చరిత్ర అంశాలకి ప్రాముఖ్యత ఉంది.

కాని ఈ దివ్య గ్రంథంలో, మహాప్రవక్త ప్రవచనాలు, ఆయన చరిత్ర లేవు.

"ప్రవక్తా ! .... మీరు పలకండి..."

– అని ఆరంభించడం జరిగిందే తప్ప; మహా ప్రవక్త ఈ విధంగా వచించారు – అని రాదు ఆ దివ్య గ్రంథంలో.

అగ్రజులయిన ప్రవక్త (సఅసం) వారి వాక్కు ఆయన నోటి నుండి వెలువడిన ప్రవచనాలు, చరిత్ర సంఘటనలూ వేరుగానే సమీకరించబడినాయి. వీటికి దివ్య గ్రంథమయిన ఖుర్ఆన్‌కు ఎలాంటి సంబంధం లేదు.

అందుచేత "స్వచ్ఛమైన, దోషరహితమయిన దైవ ప్రవచనాలు" అని దివ్య ఖుర్ఆన్‌ని అనటం ఎంతో సమంజసమైనది.

భగవత్‌గీతను కూడా ఒక విధంగా ఇదే మాదిరిదని చెప్పినా అది భారత కథాభాగంలో గీతోపదేశం ఒక శాఖా మాత్రంగానే ఉంది. గీతోపదేశానికి ముందు కొంత కథ జరిగింది ; ఆ తరువాతనూ కొంత కథ నడిచింది.

దివ్య ఖుర్ఆన్‌లోని మరో ప్రత్యేకత : వేదాలని ఎక్కువ భాగం బ్రాహ్మణులు, అగ్రవర్ణాలవారు, ఆచార్యులు, పండితులు, సాధువులు మొదలగు వారుమటుకే వేద పఠన, పారాయణాలు చెయ్యటానికి అర్హులు, వేదాంత సారాన్ని గ్రహించగలవారు వారే అన్నది సర్వత్రా ప్రతీతి పొందిన విషయం.

అదే కాకుండా వైదిక మతంలోని 'ఉపదేశము' అని చెప్పబడిన - ఉపనిషత్తులూ మొదలగునవి వాటికి ప్రజల నుండి గుప్తముగా ఉంచబడిన విద్య లేక బ్రహ్మజ్ఞానము అన్న అర్థం కూడా ఉంది.

భగవంతుని ప్రవచనములు మానవుల కొరకే! అవి ప్రజా బాహుళ్యం దగ్గరకు వెళ్ళాలి. వారు ఆ ప్రవచనాలని కంఠస్తం చెయ్యాలి - అని విధించబడింది ఇస్లామ్‌లో.

అల్ ఖుర్ఆన్‌ని మొదటి అక్షరం నుంచి, చివరి పంక్తి దాకా కంఠస్తం చేసి అప్పగించగల ముస్లిమ్ పెద్దలకు - గౌరవమూ, ప్రతిష్టా చాలా ఉన్నాయి. అట్లా పఠించగలగటం ఒక అపూర్వ గౌరవమన్నది కూడా - వాడుకలో ఉంది.

వేద (పవిత్ర) గ్రంథాలని పఠించవలెనని ప్రయత్నించే కొన్ని కులాలవారిని నేరస్తులుగా పరిగణించి శిక్షించవచ్చు... అనేటువంటి మతాలవారినీ మనం చూస్తున్నాము.

దివ్య గ్రంథంలోని ప్రవచనాలని, అందులోని 'కలిమా'ను ఖచ్చితంగా చెప్పగలిగినపుడే నువ్వు నిజమయిన ముస్లిమ్ అవగలుగుతావు... అన్న ఇస్లామ్ మతాన్నీ చూస్తున్నాము.

తిరుకోటియూర్ కోవెల ప్రాకారం మీదకి ఎక్కి నుల్చుని, వేదాలని, పాసురములని బిగ్గరగా చదివి - వాటిని బహిరంగపరచిన రామానుజాచార్యులను వేదాంతులు తూర్పారపట్టటమూ చూశాము.

"అల్ ఖుర్ఆన్‌ని ప్రపంచానికంతటికీ వినిపించేటట్లు బిగ్గరగా పఠించు. అది నీ ధర్మం పట్ల నీకు గల బాధ్యత" అని చెప్పే ఇస్లామ్‌నీ చూస్తున్నాము.

వేదవేదాంగాలకు భాష్యం చెప్పిన భగవత్‌పాదులు ఆది శంకరుల మాతృమూర్తి మరణించినపుడు ఆనాటి సమాజం వారిని అవమానించినదీ చూస్తున్నాము.

పవిత్ర గ్రంథాన్ని దోషరహితంగా పఠించే హజ్రత్ అలీ (రజి) "విజ్ఞాన నగరానికి ముఖద్వారము" అన్న ఖ్యాతి పొందటమూ చూస్తున్నాము.

ఈ విధంగా ప్రజలకోసం మతగ్రంథాలు అనియూ, వాటిని ప్రజానీకం పఠించి తీరాలనియూ విధులని ఏర్పరచి, ఆచరణలో పెట్టింది ఇస్లామ్.

ఆ విధంగా ఆచరించటంచేతనే - ఇతర మత గ్రంథాలవలె మానసిక ధృతిని కోల్పోక, నిత్య చైతన్యవంతంగా, మొరాకో నుంచి - ఇరాక్ దాకా ఇరవై కోట్ల ప్రజానీకపు నిత్య జీవితంలో ఒక ప్రధాన భాగమయి, జీవ భాష

అయి, పవిత్రమయిన మతపరమైన భాష అయిన ఈ అరబ్ భాష దినదిన ప్రవర్థమానమై విరాజిల్లగలిగింది.

ప్రపంచ ప్రజానీకంలోనంతా

అరబ్ భాషను

చిరంజీవిని చేసింది అల్ ఖుర్ఆన్.

కొన్ని మత గ్రంథాలు ప్రజల జీవన విధానంలో కల్పించుకుని, అనవసరమయిన సమస్యలు సృష్టించటమూ, మరికొన్ని మత గ్రంథాలు ప్రజల గురించే పట్టించుకోక - నిత్య జీవితానికి సంబంధములేనివాటి గురించి తర్కిస్తువుంటం కనిపిస్తూ ఉంటుంది.

ఈ మొదటి రకం మత గ్రంథాలు మనిషి ఆలోచనా విధానాన్ని, భావ స్వాతంత్ర్యాన్ని, అతని స్వయం నిర్ణయ శక్తిని నిరోధించి, మనిషిని కొన్ని కట్టుబాట్లకి, నిర్బంధాలకి లోనుచేస్తాయి. ఇవి నిర్బంధ మత గ్రంథాలు.

రెండో రకం - కట్టుబాట్లూ, విధులూ లేకుండా స్వేచ్ఛతో జీవించ వచ్చుననేవి. ఇవి అడవి గుర్రాల వంటి మతగ్రంథాలు.

కాని అల్ ఖుర్ఆన్, విధులూ, కట్టుబాట్లూ, కాగలగటానికి "భగవంతుని ప్రవచనాల"ని శాసనాలుగా చేస్తుంది.

భగవంతుని వాక్కు ఏ విషయంలో సూచింపబడివుండలేదో, ఆ విషయాల గురించి వివరంగా ఆలోచింపగల స్వతంత్రమూ, పరిశోధనా చింతనా స్వతంత్రమూ అనుగ్రహిస్తుంది - ఈ పవిత్ర ఉపదేశ గ్రంథం !

"ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వంటి వారిని పోలిన వ్యక్తి వీరి వలె ఇతరులతో తరచూ తన ఆలోచనలని పంచుకుని ప్రవర్తించే

ప్రజానాయకుని రాజ్యాధిపతిని మేము ఇంతవరకూ చూడలేదు" అని ఆయన అనుచరులు కన్నీటితో చెప్పివున్నారు అంటే అందుకు కారణం పవిత్ర ప్రవచన గ్రంథంలోని మహత్తువే !

మత గ్రంథాలు చాలామటుకు, చక్రవర్తికి, రాజుకీ, అధికారులకు విధేయత కలిగివుండి, హీనమయిన పనులు చేస్తూంటాయి.

కాని అల్ కితాబ్ అయిన దివ్య ఉపదేశ గ్రంథం - ఖుర్‌ఆన్ ఒక్కటే మానవుని స్వతంత్రునిగా, స్వేచ్ఛా జీవిగా చెయ్యటానికి వచ్చిన అమోఘ మయిన 'మాగ్నాకార్టా' అంటాను.

ఎందువల్ల?

★ ★ ★

# మానవజాతికి 'మాగ్నా కార్టా'

వేదాలు - మత గ్రంథాలన్నీ మనిషి, భగవంతుని సన్నిధికి చేరుకోవటానికి వివిధ మార్గాలు ప్రబోధిస్తాయని ప్రకటిస్తాయి. అయినా రాజులు, ప్రభువులు, చక్రవర్తులు మొదలగు వారి గురించి, పొగడ్తలూ, స్తోత్రపాఠాలతో అవి నిండి ఉంటాయి. వీటితో పాటు, మానవుని కాళ్ళూ - చేతులకి సంకెళ్ళు బిగించి, ఆ గొలుసులని రాజుల వంటివారి చేతికి అప్పగించే ప్రయత్నాలే వీటిలో ఎక్కువ భాగం ఉన్నాయి.

చూడండి :

చక్రవర్తి - భగవదంశ గలవాడు.

రాష్ట్రాధిపతి - భగవత్ కృప పొందినవాడు.

జిల్లా అధికారి - భగవంతునిచే పంపబడిన ఉన్నతాధికారి.

అనేటువంటి వర్గీకరణ చేయడమే కాదు, చుట్టు ప్రదేశాలకి అధిపతి, గ్రామాధికారి మొదలగువారి పట్ల వినయవిధేయతలు చూపటం, భయభక్తులతో మోకరిల్లడం, వంగి వంగి విధేయత తెలుపటం వంటి నీచమైన స్థితిని ఖండించడంకాని, తక్కువవాడినన్న న్యూనతాభావం ఏ మనిషిలోనయినా ఉండకూడదనిగాని, వద్దనిగాని ఏ మతగ్రంథమూ అడ్డగించలేదు.

కొన్ని మత గ్రంథాలు అక్కడా అక్కడా మానవుని స్వాతంత్ర్యాన్ని ప్రవచిస్తూ వచ్చాయి. కాని, నిత్య జీవితంలో లౌకిక ప్రవర్తనలో మనిషి - మరొక మనిషికి బానిస అవకుండా ఆపలేకపోయాయి.

కాని అల్ ఖుర్ఆన్ - మనిషి తోటి మనిషికి తలవంచనక్కరలేదు ;

మోకరిల్లి న్యూనతపడనవసరం లేదు. వంగి వంగి నమస్కారాలు చెయ్యనవసరం లేదు, అని ప్రబోధించి వ్యక్తి గౌరవానికి, మానవునిలో స్వతంత్రతా భావ బీజాలు నాటి కొత్త బాట వేసింది.

"అల్లాహ్ ఒక్కనికి మటుకే మీరు తలవంచి నమస్కారం చెయ్యాలి" అని ఆదేశించడం వల్ల ఏం జరిగింది? ఏం జరుగుతోంది?

★ సాటి మనిషి పట్ల అధికారదర్ప ప్రదర్శన.

★ మానవుని తెలివితేటలను అణిచివెయ్యగల ఆధిక్యత.

★ భావ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛాయుత ఆలోచనల్ని నాశనం చేసే మానవ కట్టుబాట్లు –

– వీటన్నిటినీ ఖండఖండాలుగా నరికి, చితకగొట్టి నుగ్గు నుగ్గుగా చెయ్యడం జరిగింది.

....మనిషి పరిపూర్ణమైన స్వాతంత్ర్యం పొంది, పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకుంటున్నాడు. అతని భావనా ప్రపంచంలోకి కొత్త గాలులు ప్రవేశించి, ఆ వ్యక్తి ఆత్మకు వికాసాన్నిస్తాయి.

సాటి మనిషి మీద, మరో మనిషి చూపే ఆధిక్యతని అణిచివేసి, దానిని ముక్కలు ముక్కలుగా నరికివెయ్యాలన్న వాదాన్ని ఒప్పుకున్న విప్లవాత్మక గ్రంథం దివ్య ఖుర్‌ఆన్ మాత్రమే.

మానవ జాతి ఇంతవరకూ కనీవినీ ఉండని, మానవ స్వేచ్ఛా శాసనం, మాగ్నాకార్టా కంటే అత్యున్నత శాసనం – పవిత్రమయిన ఖుర్‌ఆన్ ఒక్కటే.

బానిసల శృంఖలాలని విరగగొట్టిన అల్ ఖుర్‌ఆన్ – మానవులందరూ సమానమే – అనే ఏక దృష్టితో, సమ దృష్టితో చూసింది, ఆ విధంగా

చూడమని ప్రబోధించింది.

"ఓ మానవులారా ! నిస్సందేహంగా మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల జంట ద్వారా సృష్టించాము. మీ పరస్పర పరిచయం కొరకు మీలో కుటుంబమూ, వంశమూ, తెగలు సృష్టించాము. కాని నిత్య జీవితంలో దైవభక్తి - అల్లాహ్ పట్ల అధిక భయభక్తులు కలవాడే ఆదరణీయుడు."

(దివ్య గ్రంథం - 49 - 13)

దీని అర్థం... మానవ జాతి అంతా ఒక్కటే అనీ, కుటుంబాలూ, కులాలు, తెగలూ అన్నీ పరస్పరం పరిచయ సాధనాలే అని స్పష్టమవుతోంది. అంతమటుకే కాదు...

పుట్టుక వల్ల ఏర్పడిన ఘనత

కులం వల్ల ఏర్పడిన ఘనత

కుటుంబం వల్ల ఏర్పడిన ఘనత

ఈ బూటకమైన ఘనతలని తొలగించి, విరగగొట్టడం జరిగింది. సర్వ సమానమైన పుట్టుక, సర్వ సమానమయిన జీవిత విధానం - అందరికీ ఏకీకృతమైన జీవన మార్గం - అని స్థిరపరచటం జరిగింది.

మనిషిని పుట్టుక ఆధారంగా ఏర్పడిన ఆధిక్యత నుంచి విముక్తి కలిగించి, సర్వ సమానత్వాన్ని సమకూర్చిన దివ్య ప్రబోధం ఏం చేసింది? కేవలం క్రూర మృగాల వలె, బాధ్యతలనూ, విధులనూ నిర్వర్తించని, అడవి జీవాల వలె మానవ సముదాయాన్ని మారుస్తున్నదా? - లేదు.

దైవం పట్ల భయభక్తులు అన్న విధిని ఒక్కటే శాసించింది. "దేవుణ్ణి

ఒక్కడినే పూజించండి, ఆయన శాసించిన కట్టుబాట్లనే అవలంబించండి" అని చెప్పినదాని కారణంగా...

ప్రజలని పీడించే ప్రభుత్వం

వివేకరహితమయిన శాసనం

ఆధిక్యతతో అధికారం చెలాయించే దుర్మార్గులు

యుద్ధాలు

వ్యాధి బాధలు

వృద్ధాప్యము

మరణము

దారిద్ర్యం

అవమానం

ధన ప్రలోభం

- ఇటువంటి వాటిలో దేనిని చూసి ఆశపడకు, భయపడకు - అని మనిషిని శక్తిమంతునిగా, వీర పురుమనిగా తీర్చిదిద్ది అతను దృఢ చిత్తంతో నిలబడగల మార్పు తీసుకొస్తోంది - ఈ దివ్య గ్రంథం.

భయంకరమయిన ఎడారి ప్రదేశాల్లో యుద్ధాలూ, అంతర్ పోరాటాల్లో లీనమైపోయి, బయటి ప్రపంచాన్ని చూడలేని అంధకార స్థితిలో ఉన్న అరబ్ జాతిని ఈ ప్రపంచాన్నే పాలించగల జాతిగా తీర్చిదిద్దిన, ఈ దివ్య గ్రంథ ప్రవచనాలు అమోఘమయినవి, ప్రతిభాన్వితమయినవి అని - హిమాలయ శిఖరం ఎక్కి - నొక్కి వక్కాణించగలను.

ఈ దివ్య గ్రంథంలో మరో విశిష్ట విషయం... నీతిని, న్యాయాన్ని, రుజువర్తనాన్ని ఏ కారణంచేతా ఎటువంటి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదు అన్నది - స్పష్టంగా, దృఢంగా, కఠినంగా కూడా చెపుతున్నది.

ఆ విధంగా ధర్మమార్గాన్ని విడిచిపెట్టినవారు పరలోకంలో తప్పకుండా దండన అనుభవించడం అన్నది - తధ్యమని, నిశ్చయమని సిద్ధాంతీకరించి చెపుతున్నది.

తన రక్త సంబంధీకుల కొరకైనా సరే, ధర్మమార్గాన్నించి ఎప్పుడూ, ఏ సమయంలోనూ తప్పకోకూడదు. అందరి దగ్గరా న్యాయభావనతో, న్యాయస్ఫురణతో మాట్లాడాలి - అని దివ్య గ్రంథం నొక్కి వక్కాణించింది.

ఈ ప్రాతిపదికలే ఇస్లామీయ రాజ్యాలలో న్యాయపరిపాలనకు, నీతి మార్గం నుండి వైదొలగని, సమాజానికి మూల స్థంభాల వలె నిలిచాయని నేను మనవి చేసుకుంటున్నాను.

మానవ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

సామాజిక సమానత్వపు చైతన్యం

నీతిమంతమయిన, న్యాయవంతమయిన ఆలోచనలు

మొదలయినటువంటివి గల అపూర్వ పునాదుల్ని పరిపూర్ణంగా వివరించి, వాటి ఆధారంగా మానవ సమాజాన్ని నిర్మించింది దివ్య ఖుర్ఆన్.

ఇంకొక ముఖ్యమయిన విషయం ఉంది.

మత గ్రంథాలలో చాలా భాగం మానవ జీవితాన్ని పాపపంకిలమయిన జీవితమని వర్ణిస్తూ ఉంటాయి. క్షణభంగురమైన ఈ జీవితం నుండి వీలయినంత త్వరగా విముక్తి పొందాలని, దీన్ని పరిత్యజించాలని, దీనికి దూరంగా ఉండాలని ఘంటాపథంగా చెపుతున్నాయి.

"మానవ సృజన ఉన్నతమయిన సృజన" అని నొక్కి చెప్పటమే కాదు, మానవుడు తన జీవిత కర్తవ్యాన్ని, బాధ్యతలని నెరవేర్చి, పరిపూర్ణ జీవితాన్ని తృప్తిగా జీవించాలి - అని ఖచ్చితంగా చెప్పిన గ్రంథం దివ్య ఖుర్ఆన్ ఒక్కటే.

జీవితం నుంచి భయపడి, పిరికితనంతో పారిపొమ్మని ఎక్కడా చెప్పలేదు. పలాయన వాదాన్ని సమర్థించలేదు, పూర్తిగా సంతృప్తిగా, సంపూర్ణంగా జీవితాన్ని జీవించు - అని నిర్దేశించి చెప్పింది...

ఒకటే గ్రంథం

పవిత్ర గ్రంథం

ఉన్నత గ్రంథం

- అన్న ముప్పేటల, మూడు, మూడు కాలాలకు శ్లాఘనీయ మయినది దివ్య ఖుర్ఆన్.

★ ★ ★

# మానవతకి ప్రతిరూపమైన మార్గం

న్యాయవర్తనమూ, సత్యబోధన, సన్మార్గము, నైతిక జీవనం - వీటిని బోధించటానికి మానవాళికి వీటిని ఉపదేశించటానికి ఈ లోకానికి విచ్చేస్తూ ఉన్నవారు మహనీయులు, ప్రవక్తలూ.

ఎందువల్లనో, ఈ మానవ జాతి ఆ మహనీయుల నిరాడంబర జీవితాన్ని, వారి బీద స్థితినీ చూసి ఆ వ్యక్తులు సామాన్యమైన, సాధారణమైన మనుషులు అంటే వారు చెప్పిన మాటలని, హితోక్తులని అంగీకరించటానికి అర్థం చేసుకోటానికి వెనుకాడుతుంది, సందేహిస్తుంది.

ఆయన - భగవంతుని అవతారము

ఈయన - భగవంతుని కుమారుడు

ఆయన - భగవంతుని అంశం...

- అని అంటేనే నమ్ముతారు. ఆపై మరుపు మాటలని ఆంగీకరిస్తారు, అందుచేతనే మత ప్రబోధకులు, మార్గ ఉపదేశకుల గురించి 'భగవదంశలో జన్మించారు' అని వారి జీవితకాలంలోనో, లేక తరువాత వారిచేతనో, వారి శిష్యుల చేతనో కల్పనలు చేయబడి, వారు బోధించిన సిద్ధాంతాలు గట్టిగా పాతుకుపోయేందుకు ప్రయత్నాలు చేయడం జరిగింది.

కాని, ఇస్లామ్ మార్గంలో ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ని దైవాంశ సంభూతులుగా, దేవుని కుమారులుగా, దేవుని అవతారముగా పరిగణించడం జరగలేదు, ఆ పేర్లతో పిలవనూ లేదు, ఈ వాదాన్ని వారు తిరస్కరించారు, ఏ మాత్రం ఒప్పుకోలేదు.

ఈ మహానాయకుడు ఒక బీద వ్యక్తి, మామూలు మనిషి. అయితే

ఉన్నతమయిన మానవుడు - అని అల్ ఖుర్ఆన్ చెపుతున్నది.

> (ఓ ముహమ్మద్) చెప్పండి, "నేను మీవంటివాణ్ణే అయిన ఒక మనిషిని. (అయితే నా ప్రత్యేకత ఏమిటంటే) నా వద్దకు వహీ (దైవవాణి) వస్తుంది - మీ దైవం కేవలం ఒక్క దేవుడే అని !"
>
> (అల్ కహఫ్ : 110)

దివ్య గ్రంథంలో పలుచోట్ల, వివరంగానూ, స్పష్టంగానూ "నేను మానవుడిని, సచ్ఛీలవంతుడైనవాడిని" అని పలకమన్న దైవాజ్ఞ ప్రవక్తకి ఇవ్వబడినట్లు కనిపిస్తుంది.

నేను అద్భుతాలను చెయ్యబోవటం లేదు. నా వద్ద ఆకాశ నిధులేవీ లెవ్వు. నాకు అజ్ఞాత విషయాల గూర్చి తెలియదు. నేను ఒక మనిషిని, మీ వంటి సాటి మానవుడను.

- అని మటుకే చెప్పి ఒక ఉదాత్తమయిన మార్గాన్ని ప్రబోధించినవారు ఈ యావత్ ప్రపంచంలో ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ఒక్కరే.

> "ప్రవక్తా ! నిశ్చయంగా మీరు మృతులకు మీ మాటలు వినిపింపజెయ్యలేరు. ఇంకా, వెనక్కి మరలి పలాయనమవుతున్న చెవిటివారికీ మీ పిలుపును వినిపించలేరు. గుడ్డివారికి మార్గం చూపి, వారు మార్గం తప్పకుండా రక్షించనూ లేరు. ఎవరు మా సూచనలు (ఆయతులు) నమ్ముతారో, ఇంకా విధేయులవుతారో వారికే మీరు మీ మాటలు వినిపించడం సాధ్యమవుతుంది."
>
> (అన్ నమల్ : 80 - 81)

కాబట్టి ప్రవక్త మహనీయులు ఏదో అద్భుత మహిమలు చెయ్యగలవారు, దైవాంశ సంభూతులనికాక, మానవులని మంచి మార్గంలో నడిపించటానికి వచ్చిన మానవతామూర్తి అని మాత్రమే రూఢిపరచడం జరిగింది.

అది ఒక్కటే కాదు, ఈ సత్యపథాన్ని, ఈ జీవన విధానాన్ని – మహా ప్రవక్త అయినా సరే, మీరినట్లయితే, ఆ మార్గాన్ని విస్మరించినట్లయితే, భగవంతుడు ఆయనని (ప్రవక్తని) తప్పక దండిస్తాడని, ఈ శిక్ష నుంచి ఆయనను కూడా ఎవరూ తప్పించలేరని చెపుతున్నది.

> (ప్రవక్తా !) నీవు ఈ జ్ఞానం పొందిన తరువాత కూడా, ఒకవేళ నీవు వారి(భగవంతుని నిరాకరించినవారి) కోర్కెలను మన్నించి అనుసరిస్తే నీవు కూడా నిశ్చయంగా దుర్మార్గుల్లో చేరిపోతావు.
>
> (అల్ బఖర – 145)
>
> (ప్రవక్తా !) దివ్యజ్ఞానం నీ వద్దకు వచ్చిన పిదప కూడా, ఒకవేళ నీవు వారి ప్రలోభాలకు లొంగిపోతే, నిన్ను .అల్లాహ్ దండన నుండి కాపాడగల మిత్రులు, సహాయపడువారు ఒక్కరూ లేరు.
>
> (అల్ బఖర : 120)

ఇది చదువుతుంటే హృదయం తల్లడిల్లిపోతున్నది. మానవ జాతికే అపూర్వ ఆదర్శవంతుడయిన ఈ మహాప్రవక్త తప్పు చేస్తారా? శిక్షార్హులవుతారా? ... లేదు. అలా ప్రవర్తించటానికి వీలులేదు. ఒకవేళ అలా ప్రవర్తిస్తారేమో నని– ఆ మహాత్మునే హెచ్చరించటం జరిగింది. ఇటువంటి హెచ్చరిక ఏ మత గ్రంథంలోనూ, ఏ మత మార్గంలోనూ, ఇంతవరకూ ఎక్కడా చెప్పివుండలేదు – అన్నది నేను ఘంటాపథంగా చెప్పగలను.

నేనూ ఇతరుల వలెనే ఒక మానవమాత్రుడను – అని చెబుతూ, నేను కూడా ధర్మమార్గాన్ని త్యజించి, ధర్మ చ్యుతుడిని అయితే, భగవంతుని దండనకి పాత్రుడనవుతాను, అని తలవంచి ప్రవచించే ప్రవక్త ప్రబోధించిన ఒక మహోన్నత మార్గం ఇస్లామ్ అన్నదానికి పై మాటలు సాక్షీభూతంగా నిలిచివున్నాయి.

మానవ శిఖామణి అయిన ప్రవక్త జీవిత కాలంలో మటుకే కాదు. ఆ తరువాత కూడా ఈ మానవత్వాన్ని నిలబెట్టి, నిలబెట్టుకుంటూ ఉన్నది ఇస్లామ్ మార్గం. ఆ విషయం మిక్కిలి కొనియాడతగిన - మహోన్నతమయిన విస్మయానందభరితమైన విషయం.

కొందరు మహాత్ములు, మత పురుషులు మానవ జన్మపొంది, మనుషులుగానే జీవించి, మత విధానాలని ప్రబోధించి మరణించారు.

అయితే వారి మరణానంతరం - వారిని భాగవతులుగా, అవతార పురుషులుగా చేసివేశారు ప్రజలు.

ఉదాహరణకు గౌతమబుద్ధుని చరిత్ర కూడా ఈ విషయమే చెపుతూ ఉన్నది. మనిషిగా పుట్టి, ధర్మమార్గంలో నడిచి, ధర్మప్రబోధం చేసి తనువు చాలించారు. ఆయన మరణించిన వెనుక, ఆయన బుద్ధభగవానుడయి పోయారు.

కాని, ఒక్క ఇస్లామ్ విధానంలోనే ఇంతవరకూ ప్రవక్త శిఖామణిని భగవంతుని చెయ్యకుండా ఆయన మానవుడు, మానవ జాతికి చెందిన అపూర్వమయిన ఆదర్శం అన్న సిద్ధాంతం పధ్నాలుగు వందల సంవత్సరాల నుంచీ, తిరుగులేకుండా కాపాడటం జరుగుతూ ఉంది.

ఈ వ్యాస పరంపరలోని వివరణని - ముస్లిమ్ సహోదరులూ, ఇతర స్నేహితులూ అభినందించి మెచ్చుకున్న -"ఈ మార్గం యింత సుదీర్ఘ మయినదా - ఈ పయనంలో యింతటి లోతైన అంతరార్థం వుందా...." అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చిన వారు కూడా లేకపోలేదు.

అటువంటివారు సమర్థించిన ఒక విషయం గురించి ప్రస్తావించ బోతున్నాను. దాని కొరకై ఎదురు చూడండి.

★★★

# ఇస్లామ్‌ను గురించి అన్నాదొరై...

ఇస్లామ్‌ని గురించి నేను రాస్తున్న ఈ వ్యాస పరంపరకు నైతిక శక్తిని కలిగించు రీతిలో గొప్ప మేధావి తొలి కాంగ్రేసేతర ముఖ్యమంత్రి అయిన అన్నాదొరై 7-10-1957న చేసిన ప్రసంగాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము.

## అన్నాదొరై ప్రసంగం

ఇస్లామ్‌లో అపూర్వ లక్షణాలు, సూత్రాలు, సిద్ధాంతాలు, గడిచిపోయిన కాలంలోని సమాజానికి ఎంత అత్యవసరమైనవిగా పరిగణించబడినవో, అంతకు మించి – ఈ వర్తమాన సమాజానికి, సత్య సాక్షాత్కారం కలిగించే ఒక్క కాంతి కిరణం కోసం కొట్టుమిట్టాడుతున్న, ప్రస్తుత పరిస్థితులకి అతి ముఖ్యముగా, సత్వరముగా కావలసివున్నాయి.

ఇస్లామ్ అనునది ఒక మతం కాదు. ఇది ఉత్కృష్టమయిన ఒక జీవన విధానం. ఇస్లామ్ జీవిత విధానాన్ని ప్రపంచంలోని పలు దేశాలు తమ మార్గంగా స్వీకరించాయి.

ఇస్లామ్ జీవిత విధానాన్ని నిశితంగా పరిశీలించి చూడటం చేతనే, ప్రపంచంలోని మేధావులు 'ఇస్లామ్'ను ఒక మతం అన్న అభిప్రాయంతో గాక– ధర్మము, జీవిత విధానము అని – నిర్వచించారు.

'మతం' గురించి నేను ప్రకటించే నా అభిప్రాయాలకు గాని, ఇక్కడ జరుగుతున్న ఉత్సవంలో నేను పాల్గొనడంలో గాని ఎలాంటి పరస్పర విరుద్ధ భావం లేదు. ఇస్లామ్ అన్నది ఒక జీవన వ్యవస్థ – ఒక జీవన విధానం అని భావించటంచేతనే ఈ ఉత్సవంలో పాల్గొనటానికి నేను వచ్చాను.

ఇస్లామ్ జీవిత విధానం లేక ఇస్లామీయ జీవన వ్యవస్థ యొక్క అపూర్వమయిన విధానాలను మేము కొనియాడుతున్నామంటే, మానవ హృదయంలో తలెత్తే రకరకాల సందేహాలకి, సుస్పష్టమయిన రీతిలో విశదీకరించగల సమాధానాలు ఇందులో పొందుపరచబడివున్నాయి. మహాప్రవక్త బోధనలలో ఒకటి - "భగవంతునితో ఎవరినీ సామ్యం తీసుకురాకండి. ఎవరినీ భగవంతునితో సరి సమానం అని పోల్చకండి. భగవంతునికి ఎవరూ సాటిరారు" అను ఈ ఉపదేశానుసారం నా హృదయాన్ని సూటిగా స్పృశించింది. నేను మనోవాక్కాయకర్మలా ఈ అభిప్రాయాన్ని నమ్ముతున్నాను.

ఈ ఒక్క ప్రబోధం నన్నెందుకింత తీవ్రంగా ఆకర్షించింది అంటే, ఈ బోధన మానవునిలోని జిజ్ఞాసకి పదును పెడుతుంది. భగవంతునితో ఎవ్వరూ సరిసమానం కాదు - ఎవరూ సాటి కాదు... ఏం? ఎందుకు సాటి కాదు? అసలు భగవంతుడు ఏ విధంగా ఉంటాడు? ఏ విధంగా వుండాలని అనుకుంటున్నారు? ఈ వూహ ఎన్ని రకాల పరుగులు పెడుతుంది? అన్న రకరకాల ఆలోచనలకి చోటు యిస్తుంది - 'సాటి కాదు' అన్న ఈ మాట. అయితే భగవంతుడు ఎలా వుండాలి? అన్నదానికి ఇదమిత్థమయిన ముగింపు దొరకదు. ఏమైనా మన పూర్వీకుల్లో పెద్దలు, తమిళ మేధావి, కవి :

"చూసినవారు పొందలేదు"

"పొందినవారు చూడలేదు"

"చూసినవారు చెప్పలేదు"

"చెప్పినవారు చూడలేదు"

అని అన్నారు.

భగవంతుడు అన్న అస్తిత్వంలోని తత్వమే యిది. 'భగవంతునికి

సరిసమానము' - అన్నది ఒప్పుకుంటే, భగవంతుని ముందు ఒకరిని సాటిగా నిల్చోపెట్టాల్సి వస్తుంది. ఆ 'ఒకరు' ఎవరని నిర్ణయించటం? ఎవరు ఎవరిని నిర్ణయించాలి ? అందుచేతనే భగవంతునికి సాటి, సరిసమానమయిన వ్యక్తిగా ఎవరినీ పోల్చ కూడదు అన్న బోధన చేశారు మహాప్రవక్త.

ఇతర మతాలలో మనిషిని భగవంతునితో సరిసమానమని పోల్చి చెప్పిన కారణం వల్లనే - నాలాంటి వారు ఎందరో విరోధ భావంతో మతం నుంచే తొలిగిపోయారు. ఇస్లామ్ మతంలో నన్ను ఆకట్టుకున్న మరో విషయం ఏమిటంటే - అది మనిషిని మానవునిగా మార్చటం, మనిషిని పరిపూర్ణమయిన మానవునిగా చెయ్యగలిగింది ఇస్లామ్ మార్గం ఒక్కటే. మనిషి తన శక్తి సామర్థ్యాలతో, భగవంతుడు మనిషికై నిర్ణయించిన - అత్యున్నత లక్ష్యాన్ని సాధించి, ఆదర్శ శిఖరాలకు చేరుకోగల శక్తి మనిషిని ఎంతో ఉన్నతుని చేయగల, ఉత్తమమయిన నైతిక బలం ఇస్లామ్ మార్గంలో మటుకే వున్నది.

తానే ప్రత్యక్షమయి, నేనే భగవంతుడినని స్వయంగా చెప్పి ప్రజలచేత నమ్మించడం దైవానికి కష్టం కాదు. అయినప్పటికీ దూతను పంపడానికి కారణం? "నేనే నిన్ను పంపానని చెప్పు" అని దైవం చెప్పినందువల్లనే - మానవులు, "భగవంతుడు ఆయనని నిజంగా తన దూతగా పంపాడా?" అన్న జిజ్ఞాసలో ఆలోచించడం మొదలుపెడతారు. ఏ ఉద్దేశ్యంతో పంపి ఉంటాడు? అని మనిషి నిశితంగా యోచించ ప్రారంభిస్తాడు. ఈ ముఖ్యమైన సందేశంతోటే దైవం తన దివ్య దూతను పంపించి వున్నాడు. అందుకనే తమిళ జ్ఞానులు - 'జ్ఞానమే దైవం. దైవమే జ్ఞానం' అని చెప్పారు. ఇస్లామ్‌లోని మరో ఉదాత్త విషయం, ఇస్లామ్‌లో ఎవరుజేరినా, ఏ కులానికి

చెందినవారు స్వీకరించినా, ఆ జాతి, ఆ కులం మారిపోతాయి. ఆ కుల విభేదం పూర్తిగా సమసిపోతుంది.

ముదుకుళత్తూర్‌లో ఒకరి తలలు మరొకరు నరుక్కునే పరస్పర వైషమ్యంగల ప్రజలయినా, ఉన్నత తేవర్ జాతికి చెందినవారయినా, హీనజాతికి చెందినవారయినాసరే, కులభ్రష్టులయినా, ఏ పరిస్థితుల నుంచి, వచ్చిన మానవులయినా సరే ఇస్లామ్‌ని స్వీకరించి, మత వైషమ్యాల నుంచి, కులభేదాల నుంచి విముక్తి పొందారు. సమతా సమానతలు వెల్లివిరిశాయి. ఇస్లామ్‌లోని ముఖ్యసూత్రం ఇదే. అందుచేతనే ఇది నన్ను మిక్కిలి ప్రభావితుని చేసి, నా హృదయాన్ని గాలంవేసి లాగుతున్న మార్గమయింది.

ఈ విషయాలన్నీ గ్రహించటం చేతనే, ఏ విషయాన్నయినా క్షుణ్ణంగా వివిధ కోణాల నుంచి అధ్యయనం చేసి, తరిచి తరిచి లోతుకు వెళ్ళి పరిశీలించి చూసే మేధావి బెర్నార్డు షా - "ప్రపంచంలో చివరిదాకా నిలబడగలిగిన మార్గం - ఇస్లామ్ జీవన మార్గం ఒక్కటి మటుకే" అని రాశారు.

(ఇవి మటుకే కాదు మహాప్రవక్త మహోన్నత మూర్తి అని కొనియాడ బడటానికి ఒక కొత్త వ్యాఖ్యానము యిచ్చారు అన్నాదొరై) అది ఏమిటి ?

★★★

# నా మనసులోని మాట –
# ఆయన మహోమనీషి !

**మద్రాసు నగరంలో మహోసాగర తీరాన మేధావి అన్నాదొరై...**

ప్రవక్తాధినాయకుని 'మహోన్నత వ్యక్తి' అని నేను ఎందుకు శ్లాఘిస్తున్నానో కాస్త గమనించండి. ఈ 1957వ సంవత్సరంలో మన సమాజంలో వివేకాన్ని మేలుకొలుపవలెనని మాలాంటివారం హెచ్చరించి నపుడు, మమ్మల్ని తరిమి తరిమికొట్టి దూరంగా పొమ్మంటున్నారు. అయితే పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం, రకరకాల దేముళ్ళను, పలు దేవతా విగ్రహాలను పూజించేటటువంటి ప్రజకి – "నువ్వు మొక్కవలసినది ఈ విగ్రహానికి కాదు, నువ్వు వెళ్ళవలసింది ఈ కోవెలకు కాదు" అని చెప్పగల గుండె ధైర్యంతో, అందులోనూ అటువంటి మోటు మనుషులకి తమ సందేశాన్ని, ఆత్మస్థయిర్యంతో సిద్ధాంతపూర్వకంగా చెప్పగలిగారే ఆయన... అందుకనే ఆయనని 'మహోన్నత వ్యక్తి' అని గౌరవించి, అభిమానిస్తున్నాను. ఆనాడు మహాప్రవక్త ప్రేరణవల్ల కలిగిన ఆత్మబలం, యిప్పుడు, ఈనాడు ఆ మార్గం స్వీకరించిన వారికి కూడా వున్నదీ అంటే– అందుకు ఆశ్చర్యపడనక్కరలేదు.

మార్గము లేక జీవన విధానము అన్నది మానవులందరిలో ఏకీభావం మేలుకొలిపేది. మనుషులలో జ్ఞానజిజ్ఞాసను పెంపొందించేది, మానవులలో ఐకమత్యం నెలకొల్పేది, అపురూపమైన మానవతా బంధనాలని సృష్టించేది, స్నేహ సౌహార్థాలను పెంపొందించేది, చెడు ఆలోచనలను సమూలంగా

నాశనం చేసేదిగా ఉండాలి. కాని నేడు 'మతము' అని చెప్పబడేది, అది మనుషులని మతమౌఢ్యమనే నిషాలో ముంచి పారేస్తుంది. ఆ నిషా నుంచి కాపాడటానికి పోలీసులు అవసరం అవుతున్నారు. ధర్మమార్గంలో సరళంగా, న్యాయబద్ధంగా ఉన్నపుడు, మనుషులు ప్రేమపూరిత విధానంలో ఒకటి కావడం సంభవం.

మతంలో (సారం) అంతరార్థం ఏ విధంగా ఉండాలి ? అన్నదానికి మనలో భేదాభిప్రాయాలు చాలా వున్నాయి. అందుచేతనే కొందరు నాస్తికులు అనీ, మరికొందరు ఆస్తికులనీ పేరుబడినా, నాస్తికుడు అన్న బిరుదు... ఆస్తికులమని తమని తాము అనుకునేవారు, తమకి అవతలవారు అంటే యిష్టం లేకపోవటంచేత, ఆ అవతలవారి తల మీద రుద్దిన, తలకి తగిలించిన పేరు తప్ప మరింకేమీ కాదు. అంతేతప్ప నాస్తికులు అన్నవారు లేరు. అసలు అలాంటి వారు ఉండవలసిన అవసరం కూడా లేదు.

అలాంటివారు వున్నా లేకపోయినా, నాలాంటివారు అటువంటి నాస్తికవాదులతో చెయ్యి కలిపేవారంకాదని, ఈ పుణ్యదినం రోజున - మీ అందరిముందు తెలియచెప్పుకుంటున్నాను. ఎందుకంటే ఆస్తికత అన్నది ప్రకృతికి సహజం. ప్రకృతికి విరుద్ధంగా, అసహజంగా వుండటం ఎవరికీ సాధ్యం కాదు, ఎవరూ ఉండలేరు.

ఇస్లామ్ మార్గంలోని మంచిని ఇతర దేశాలలో పై వర్గాల వారు క్రింది వర్గాలవారికి ఉపదేశం చేస్తుంటారు. కాని మన దేశానికి సంబంధించినంతవరకూ, క్రింది వర్గాలవారే పై వర్గాల వారికి అర్థం అయ్యేలా ఉపదేశించాలి. అప్పుడే భగవంతుని సత్యసాక్షాత్కారాన్ని అందరూ గ్రహించుకోగల శక్తిమంతులవ గలుగుతారు.

ఎందుకు ఇన్ని మాటలు చెబుతున్నానంటే, రైలుబండి దిగి మనం

స్టేషన్ నుంచి గుర్రపు బండిలో ఇంటికి వస్తూంటాము. మనం గుర్రపు బండి ఎక్కిన చోటు నుంచీ, దిగి ఇంటికి వచ్చే దాకా వున్న మధ్య దూరానికి బండి చార్జీ మాట్లాడుకుంటాము.

గుర్రంబండివాడు మనం మొదట్లో చెప్పిన దూరం వచ్చేశాక, వాడు తాను అనుకున్నదానికంటే ఎక్కువ దూరం బండి తోలి వుంటానని అనుకుని, బండి ఛార్జి మరికాస్త ఎక్కువ ఇమ్మని అడిగాడే అనుకోండి. అప్పుడు "అబ్బి - భగవంతునికి భయపడి నడుచుకో" అంటూ నీతులు బోధిస్తూంటారు. అయితే నిజంగానే చెప్పినదానికంటే ఎక్కువ దూరం వుండి, ఆ దూరానికి తగ్గట్లుగాక, తక్కువ బండి ఛార్జీ యిచ్చివుంటే, అప్పుడు ఆ బండివాడు "అయ్యా! భగవంతునికి భయపడి నడుచుకోండి!" అని చెపుతాడే అనుకోండి. ... దాన్ని మనలో ఎంతమంది పాటిస్తున్నారు? మీరు మనస్ఫూర్తిగా ఆలోచించి చూడండి.... అంటే.

భగవంతునికి భయపడి ఎంతమంది ఆలోచిస్తున్నాము?

అందుచేతనే - ముఖ్యంగా మన దేశంలో క్రింది వర్గంలోనివారి ఉపదేశాలను పై వర్గం వారు అర్థంచేసుకోవాలి.... అర్థం చేసుకుని ఆచరించేందుకు ప్రయత్నం చెయ్యాలి - అని చెపుతున్నాన్నేను.

మత విధానం పట్ల ఎవరికీ విరోధ భావం వుండరాదు అయితే ఆ మార్గం ప్రబోధించే సిద్ధాంతాలు ముందు తరాలవారికి ప్రయోజనకారిగా వుండాలి. అందుకు అనువయిన వాతావరణం, పరిస్థితులు ఏర్పడాలి. చుట్టూ పరిస్థితుల్ని మనిషి సృష్టిస్తున్నాడు. అయితే వాతావరణం, చుట్టుపట్ల వున్న ప్రభావాలు ఏ విధంగా ఉంటే ఆ మార్గంలోనే పయనించేవారు వాతావరణమంటే ఏమిటో కొద్దిపాటిగా మాత్రమే అర్థం చేసుకోగలిగే వారు - సామాన్యులు.

అయితే చుట్టూ పరిస్థితులకి భిన్నంగా, వాటిని సవాలుచేస్తూ మనం నడుచుకుంటే, అందువల్ల దుఃఖమూ, బాధలూ ఎక్కువవుతాయన్నది స్పష్టంగా గ్రహించుకుని కూడా, చుట్టూ అల్లుకుని వున్న చెడు బంధాలు, పరిస్థితుల ప్రభావాన్ని ఛేదించుకుని, సరళమైన సక్రమమయిన పరిస్థితులని ఏర్పరచుకోగల వారిని 'మహోన్నత వ్యక్తులు' అని మనం పిలుస్తూ వుంటాము.

కాని అటువంటి మహోన్నతులు అన్ని కాలాల్లోనూ మనకి లభించరు. వారు లభించినపుడు మనం ఆ ఫలసాయాన్ని పొందప్రయత్నించాలి. అటువంటి మహోన్నత వ్యక్తులలో ముహమ్మద్ ప్రవక్త ఒకరు. అటువంటి మహనీయుల్ని పొందే మహాభాగ్యం, తిరిగి తిరిగి లభించదు. అందుచేతనే ఆ తేజోరాశి చేసిన గణనీయమయిన ఉపదేశాలు, దేశం నలుమూలలకీ విస్తరింపచేయటానికి చుట్టూ పరిస్థితులు ఉత్తమ రీతిలో అమరాలంటే మంచి విద్యా విధానం వుండాలి. మంచి విద్యావిధానం కావాలంటే - మంచి ప్రభుత్వం, మంచి ప్రభుత్వం ఏర్పడాలంటే - మంచి రాజకీయ నాయకులు కావాలి. మంచి రాజకీయ నాయకులని తయారుచెయ్యటానికి, మంచి మనుషులు సజావుగా, సరళంగా బ్రతకగల అవకాశం కలిగించాలి - ఇవన్నీ ఒక దానిపై మరొకటి ఆధారపడివున్నాయి.

మహాప్రవక్త ప్రబోధించిన ఇస్లామ్ మార్గం మేలి వజ్రం వంటిది. మంచి వజ్రాలని సానబట్టి వుంగరంగాచేసి వేలికి పెట్టుకోవచ్చు. చెవులకి దుద్దులుగానూ పెట్టుకోవచ్చు. అదే వజ్రాన్ని అమ్మేసి, గిండీ గుర్రపు పందాల్లో ఆ డబ్బు తగలపెట్టనూవచ్చు. ఆ వజ్రాన్ని ఎలా వినియోగ పరిచామన్న దాన్నిపట్టే - అది మనకి ఉపయోగపడే విధం తెలుసుకోగలిగేది. ఆ మాదిరిగానే ఇస్లామ్ అను ఈ వజ్రం ఎవరికి ఏ విధాన ఉపయోగకారి

అవుతోంది? - అన్నదానిలోనే - ఆ మార్గంలోని పరమోత్కృష్టత, ఆనందం ఇమిడివున్నాయి. ఈ గమ్యం చరించి ఆలోచించినపుడు - మంచి మనుషులు లభించటం అనే ప్రసక్తి వస్తున్నది. అయితే ఆ సత్ పురుషులు చెప్పే మంచి విషయాలని ఆచరణలో పెట్టినపుడే - ఆ విషయాలకి విలువ పెరుగుతుంది.

ఇస్లామ్‌లోని ఉత్కృష్టమైన మార్గం నేడు ఎవరికి ఉపయోగకరమవుతోంది? - అన్నది ఆలోచించి చూడగలగాలి. అధికారులకి మటుకే అది ఉపయోగమార్గమై - బీదవారూ 'అయ్యో' అంటూ ఆక్రందనచేసే వారికి ఉపయోగపడకపోతే అందులోని ఔన్నత్యం అంతా వృధా. ఈ మహోన్నత మార్గం అక్రమాలని, అన్యాయాలని అణిచివేయటానికి ఉపయోగపడాలి. ఏనాడు ఈ ఆశయాలని ఈ మార్గం కార్యరూపంలో పెడుతుందో, ఆ రోజున ఈ మార్గం ఫలప్రదాయమై అందులోని ఉత్తమ ఆశయాలని కార్యరూపంలో తేవటానికి సాధ్యమవుతుంది.

7-10-1957 రోజున మద్రాసులోని సముద్రపు ఒడ్డున జరిగిన మహాప్రవక్త జన్మదిన ఉత్సవంలో అన్నాదొరై వెలువరించిన భావతరంగాలివి.

(ఇస్లామ్‌ను గురించి, దివ్యఖుర్‌ఆన్ యొక్క ప్రాశస్త్యాన్ని గురించి పలువురు మేధావులు వెలువరించిన అభిప్రాయాలు ఇక్కడ పొందుపరుస్తున్నాను.)

★ ★ ★

# ఆ మాట... ప్రపంచ ప్రముఖుల నోట!

ఇస్లామ్ మతాన్ని, మహాప్రవక్త(సఅసం)ని, దివ్యఖుర్‌ఆన్‌ని ప్రశంసించిన పెద్దలు అన్నాదొరై ఒక్కరే కాదు. ఈ ప్రపంచంలోని ఎందరో మహామేధావులు, మహాయోధులు ఇస్లామ్‌లో గొప్పతనాన్ని గుర్తించి మెచ్చుకున్నారు. వీరాధివీరుడయిన నెపోలియన్ చక్రవర్తి నుంచి, యన్‌సైక్లోపీడియా బ్రిటానికా వరకూ ఎందరో, ఎన్నో సందర్భాలలో దివ్యఖుర్‌ఆన్‌లో నిక్షిప్తమైవున్న ఘనతని గూర్చి ఎంతో గొప్పగా పేర్కొన్నారు. వారి అభిప్రాయాలను ఇక్కడ పొందుపరచప్రయత్నించాను.

"అన్ని దేశాలలోని మేధావులు, విద్యావంతులు ఒకటిగా గుమికూడి, దివ్య ఖుర్‌ఆన్‌లో నిర్వచించబడినదాని కనుగుణంగా - ఒకే విధమయిన పరిపాలనా విధానాన్ని స్థాపించగల కాలం ఎంతో దూరంలో లేదు. అది కనుచూపు మేరలో ఉంది. దివ్యఖుర్‌ఆన్‌లోని ప్రవచనాలు సత్యప్రధానమైనవి. అవి మనిషి జీవితాన్ని సత్యపథంలో, ఉన్నత పథంలో నడిపించగల శక్తి కలిగి ఉన్నాయి. ఈ కారణం చేతనే - భగవంతునిచే పంపబడినటువంటి, దివ్యదూత అయిన ముహమ్మద్ ప్రవక్త ఔన్నత్యమూ పవిత్ర గ్రంథమయిన ఖుర్‌ఆన్ ఔన్నత్యమూ, అవి పొందుతున్న అపూర్వ స్థానమూ, గౌరవమూ- వీటి ఎదుట నేను శిరసావహిస్తున్నాను" అన్నారు నెపోలియన్ బోనాపార్టే.

జాతిపిత మహాత్మాగాంధీ "ఒకసారి కాదు అనేకసార్లు నేను దివ్య ఖుర్‌ఆన్‌నిచదివి ఉన్నాను. సత్యమూ, అహింసా దివ్యఖుర్‌ఆన్‌లో ప్రబోధింపబడినదన్న నిజాన్ని గ్రహించుకున్నపుడు నేను సంతోషంతో పరవశించి పోయాను" అని మెచ్చుకున్నారు.

దివ్యఖుర్‌ఆన్ ఒక కావ్యం కాదు అనటానికి - అది కావ్యము అవునా కాదా అని నిర్ణయించటం చాలా కష్టమయిన విషయం. అది గద్య రచనకి

చెందింది. కాని పద్యంలోని సొగసులూ అందులో ఉన్నాయి. అది ఒక చరిత్ర గ్రంథం కాదు. ఒక వ్యక్తి జీవిత చరిత్ర అంతకన్నా కాదు.

మూసా ప్రవక్త దూర్సీనా కొండమీదనుంచి ప్రవచించిన వృత్తాంతంలా పొందుపరచబడివున్న జ్ఞాన బోధ కూడా కాదు. దైవ సందేశహరులు ఎవరు అన్న విషయాన్ని తర్కబద్ధంగా చర్చించిన తత్వ విచార ప్రబంధ గ్రంథం మాత్రమే కూడా కాదు, ఇది ఒక దీర్ఘదర్శన భవిష్యత్ వాణి. తనకు తానుగా నిలిచి, గొంతెత్తి పరిచయం చేసుకున్న నిక్షిప్త ప్రవచనాలని అఖిల భూమండలానికి కొత్త గొంతులో వినిపింపచేసిన వాణి, ఇష్టం వుండో - లేకో అన్ని కాలాలవారూ అందులోని ఉపదేశాలని గ్రహించి, ఆ విధంగా నడుచుకోవలసిన అగత్యాన్ని ప్రబోధించిన వాణి బిగ్గరగా గొంతెత్తి పలికిన ఈ వాణి, రాజ ప్రాసాదాల్లో, ఎడారి ప్రదేశాల్లో, పట్నాల్లో, బీద సమూజాల్లో తరతమ భేదాలన్నవి లేకుండా అన్ని చోట్లా ప్రతిధ్వనించింది.

"మొదట్లో బిగ్గరగా - గొంతెత్తి పలికిన ఈ వాణి, నిజమయిన విశ్వాసాన్ని నెలకొలిపి, ప్రపంచాన్ని జయించటానికి తోడ్పడింది. ఆటు తరువాత అది ఒక పునరుద్ధరణ ఉద్యమంగా రూపొంది, గ్రీసులోనూ, ఆసియాలోనూ అనేక చోట్ల జ్ఞానదీపులు వెదజల్లి అంధకారంలో మునిగిపోయిన క్రైస్తవ యూరప్‌లోకి చొచ్చుకుపోయి, విస్తరించ ఆరంభించింది......" ఇది డాక్టర్ శామ్యూల్ జాన్సన్ రాసిన 'ఓరియంటల్ రిలిజియన్స్' అను గ్రంథంలో ఉదాహరింపబడినది.

ప్రప్రథమంగా దివ్య ఖుర్‌ఆన్‌ని ఆంగ్లంలోకి అనువదించిన వారు రాడ్‌వెల్ అను ఫాదర్, ఈ క్రిష్టియన్ మత గురువు రాసిన ముందు మాటలో, దేశదిమ్మరులు, నాగరిక ప్రపంచంతో సంబంధములేని వారుగా బ్రతుకుతూ, ఆటవికుల వలె జీవిస్తున్న అరబ్‌లని అతి స్వల్పమయిన వ్యవధిలో - ప్రపంచానికే నాయకత్వం వహించగల శక్తిమంతులుగా చేయటానికి దివ్య

ఖుర్ఆన్ ఒక ముఖ్యసాధనమయింది. వారిలో కలిగిన ఈ అమోఘమయిన మార్పు ఈ మహా విప్లవం మంత్రగాడు మంత్రదండంతో - క్షణంలో కలుగజేసిన మార్పుని పోలి వుంది" - అని దివ్య ఖుర్ఆన్ ప్రాశస్త్యాన్ని శ్లాఘించారు ఆ మత గురువు.

కవికోకిల సరోజినీ దేవి, 1945వ సంవత్సరం జనవరి ఒకటో తేదీన కలకత్తా మహానగరంలో - ముస్లిమ్ ఇన్స్టిట్యూట్ హాలులో ఉపన్యసించారు: "మానవులకి దివ్య ఖుర్ఆన్ ఒక నీతి శాస్త్ర గ్రంథం. అది స్వాతంత్ర్య వీరఖడ్గం, నైతిక వర్తనని ప్రబోధించే పవిత్ర గ్రంథం, ఇది మనిషి నడవడికని క్రమమైన కట్టుబాట్లకి లోనుచేసే శాసనమేగాక, ఇంక ఏ మత గ్రంథాల్లోనూ దివ్య ఖుర్ఆన్‌లో వలె - సర్వ విషయాల గూర్చి ఇంత విపులంగా చెప్ప ఉండలేదు - "

"దివ్య ఖుర్ఆన్ చదువుతున్నపుడు ప్రతిసారి అది ఏదో ఒక కొత్త సందేశం ఇస్తున్నట్లు అనిపిస్తూ ఉంటుంది. ఆ గ్రంథం పాఠకుని కొంచెం కొంచెంగా తన వైపుకి లాక్కుంటూ, క్రమంగా పరిపూర్తిగా ఆకర్షించుకోగల సూదంటురాయి. హృదయం విప్పి తనని పఠించేవారిని, తనపై తీవ్రమయిన కాంక్షగల వారిగా చేస్తుందీ గ్రంథం - " అని ప్రశంసించారు మహామేధావి జె. డబ్ల్యూ గొయ్‌తే.

మేధావి గిబ్బన్ - "దివ్య ఖుర్ఆన్ దేవుని ఏకత్వపు సిద్ధాంతాల విషయంలో అపూర్వమయిన ప్రామాణిక ఆధారాలను వివరించిన గొప్ప గ్రంథం" అని ప్రస్తుతించారు.

యన్‌సైక్లోపీడియా బ్రిటానికాలో "దివ్య ఖుర్ఆన్ అని పిలువబడు పవిత్ర గ్రంథం ప్రపంచంలోని అనేకానేక మత గ్రంథాలకంటే, అధికంగా, అధిక సంఖ్యాకులచేత పారాయణం చేయబడుతున్నది - " అని వివరించారు.

★ ★ ★

# మహాప్రవక్త రాకను గూర్చి ముందే వివరించిన వేదవేదాంగాలు

అనూహ్యం - కాని నిజం !

ఎక్కడో అరేబియా దేశంలో మహాప్రవక్త ప్రబోధం చేస్తున్నారని, వారి రాకను గురించి వైదిక మతంలోని వేదాలు ముందుగానే చెప్పి ఉన్నాయని - తలపండిన ఒక పండితుడు అనగా, అది విని ఆ విషయం గురించి - వివరాలు తెలుసుకోవాలన్న ఆతృత నాలో కలిగింది.

ఆ విషయాల గురించి వెతకటం ప్రారంభించిన తరువాత ఆయన చెప్పినదాంట్లో నిజం ఉంది - అన్నది తెలుసుకుని నేనే ఆశ్చర్యపోయాను.

వ్యాస మహర్షిచే వ్రాయబడినవి అని చెప్పబడుతున్న పద్దెనిమిది పురాణాల్లో ఒకటైన భవిష్యత్ పురాణంలోని ఒకటో సూత్రాన్ని ఈ క్రింద యథాతథంగా పొందుపరిచాను.

> ఏతస్ మిన్నన్తరే మ్లేచ్ఛ ఆచార్యేణ సమన్వితః
> మహామద ఇతిఖ్యాతః శిష్య శాఖా సమన్వితః ।౫।
> నృపశ్చైవ మహాదేవం మరుస్థల నివాసినమ్ . . . . . .

(భవిష్యపురాణం - పర్వం : 3 ; ఖండం : 3,
అధ్యాయం : 3 ; శ్లోకం: 5-8)

ఒక మ్లేచ్ఛుడు, పరదేశస్థుడయిన ఒక ప్రబోధకుడు తన శిష్యులతో పాటు వస్తాడు. ఆయన పేరు మహమద్. ఆయన ఎడారి ప్రదేశానికి చెందిన వారయివుంటారు.

మహమద = ముహమ్మద్

అతి స్పష్టంగా, సూటిగా పేరూ, రాబోయే వ్యక్తి నివాసమూ చెప్పబడినది అంటే, అది విస్మయాల్లో కెల్లా అతి పెద్ద విస్మయం !

ఆ ప్రబోధకుని జాతి, ఆయన గుణగణాదుల గూర్చి, అదే పురాణం చెపుతున్నది.

లింగచ్ఛేది శిఖాహీనః శ్మశ్రుధారిస దూషకః
ఉచ్చలాపీ సర్వభక్షీ భవిష్యతి జనోమమ
..............................................
ముసలైనైవ సంస్కారః ....................
(భాగం : ; ఖండం : 3, అధ్యాయం 3, శ్లోకం : 25-27)

ఆయన 'లింగచ్ఛేది' - అంటే సున్నతి చేయించుకున్న వాడయి వుంటారు. తలపైన ముడివుండదు, గడ్డం పెంచుకుని వుంటారు. మాంసాహారి అయివుంటారు. బిగ్గరగా, గొంతెత్తి మాట్లాడుతారు. 'ముసలై' అని పరిచయం చేయబడుతారు అని ఆ పురాణం చెబుతూవుంది.

మరోసారి మళ్ళీ చదివి చూస్తే అతిముఖ్యమైన విషయం ఒకటి బోధపడుతుంది.

లింగచ్ఛేది - సున్నతి - అన్నది హిందూ మతంలో లేదు. తల మీద ముడి అన్నది హిందూ మతంలో తప్పకుండా వుండాలి. కాని 'శిఖాహీనః' శిరోముండనము చేయించుకున్న వాడు అన్నది స్పష్టంగా చెప్పబడింది.

వీటన్నిటికంటే ఆశ్చర్యమైన మాట 'ముసలై' అన్నది.

ముస్లిమ్, ముసల్మాన్ అనువారికి 'ముసలై' అన్న పదం ఆపాదించి చూడండి.

ఇవ్వే కాదు.... మహాప్రవక్త జీవితం గురించి కూడా చెప్పి ఉన్న మాటలు - ఆయన ఎలా ఉండేవారు - అచ్చు అదే విధంగా వర్ణించబడింది.

ఇదం జనా ఉపశ్రుత నరాశం సస్తవిష్యతే
షష్టిం సహస్రానవతిం చ కౌరుమ్ ఆ
రుశమేషు దద్మహే ।౧।

ఉష్ట్రాయస్య ప్రవాహిణో వధూమన్తో ద్విర్దశ
వర్ష్మా రథస్యని జిహీడతే దివ
ఈషమాణా ఉప స్పృశః ।౨।

ఏష ఇషాయ మా మహే శతం నిష్కాన్ దశ స్రజః
త్రీణి శతాన్య ర్వతాం సహస్రా దశ గోనామ్ ।౩।

(అధర్వణ వేదం - 20వ కాండం, 127వ సూక్త, 1-3వ మంత్రం)

"ఓ భక్తులారా ! ఈ ప్రబోధకుని మాటలు వినండి......

ప్రశంసనీయుడూ, ప్రశంసింపబడినవాడూ అయిన ఆ మహర్షి 60090 మంది మనుషుల మధ్య జననమొందుతాడు."

(ముహమ్మద్ అంటేనే ప్రశంసనీయులు, ప్రశంసింప తగిన లక్షణములు గల వ్యక్తి, ఆయన జన్మించేనాటికి మక్కా నగర జనాభా సంఖ్య 60 వేలు).

"ఆయన ఇరవై ఆడ, మగ ఒంటెల మీద సవారీ చేస్తారు. అమోఘమయిన వారి కీర్తి స్వర్గలోకం దాకా పాకుతుంది. ఈ మహర్షి 100 బంగారు నాణెములు కలిగి ఉంటారు."

(ఒంటెల మీద పయనించిన మహర్షులు మన భరత ఖండంలో కనిపించరు. అందుచేత అది ముహమ్మద్ ప్రవక్తను ఉద్దేశించి రాసిన మాటలై

వుంటాయి. 100 బంగారు నాణెములు - అరేబియా వదిలి అబిసీనియాకు వలస వెళ్ళిన 100 మంది ప్రవక్త శిష్యులు అని అర్థం.)

"10 ముత్యాల హారాలు - 300 అరబ్బీ గుర్రాలు 10 వేల పశువులు వుంటాయి."

(మహాప్రవక్త చేత అమరలోకపు వాసులుగా ప్రకటింపబడిన 10 మంది భక్తుల గూర్చి చెప్పినదే 10 ముత్యాల హారములు. మహిమాన్వితుడైన ప్రవక్త సలిపిన ప్రథమ యుద్ధంలో వున్న 313 మందిని యుద్ధ అశ్వాలుగానూ, ఆయన వెంటవున్న 10 వేల మంది అనుయాయులను 10 వేల పశు సంపదగానూ చిత్రించబడినట్లుగా మౌల్వీ ముహమ్మద్ ఉమర్ చెపుతున్నారు.)

"మహాప్రవక్తను విశ్వకారుణ్య స్వరూపుడుగా దివ్య ఖుర్‌ఆన్ నిర్వచిస్తున్నది.

ఋగ్వేదంలో ఈ ప్రపంచాన్ని పరిరక్షించిన పదివేల మంది పేర్లను పేర్కొన్నారు. అటువంటి వారిలో ఈ మహోత్తమ నాయకుని - ఒకరిగా పేర్కొన్నారు.

అనస్వన్తా సత్పతిర్ మామహే మే గావా చేతిష్ఠో
అసురోమ ఘోనః
త్రైవృష్ణో అగ్నే దశభిః సహస్రైర్ వైశ్వానర త్ర్యరుణ శ్చి కేత
*(ఋగ్వేదం - మండలం : 5 ; సూక్తం: 27; మంత్రం : 1)*

ఈ విధంగా సంస్కృత భాషలో కూడా మామహే అనియు 'ముహమ్మద్' అనియు పిలువడం, స్పష్టంగా చెప్పబడివుంటం మిక్కిలి ఆశ్చర్యమూ - అనూహ్యమూ !

వచ్చే వారపు వ్యాసంలో ఇస్లామ్ గురించి జరుగుతున్న అసత్య ప్రచారం గురించి చర్చిస్తాను.

# అణకువకీ, పట్టుదలకీ ఆలవాలమైన అందమయిన చరిత్ర

"ఎలోయీ, ఎలోయీ, లామా సబక్తానీ !"

"నా దేవా ! నా దేవా ! నన్ను ఎందుకు చెయ్యి విడిచితివి?"

- ఏసు క్రీస్తు శిలువ బాధను భరించలేక, ఆవేదనతో అన్న వ్యధాపూరితమైన మాటలని - బైబిల్ అంటున్నది.

"భగవంతుడు భక్తుని చెయ్యి విడిచిపెట్టాడు" అన్న అభిప్రాయానికి వచ్చి ఆ విధంగా మాటలు, పాడిన పాటలు చాలా మతాలలో ఉన్నాయి.

ఆ మతం పట్ల భక్తివిశ్వాసములు కలవారు సత్పురుషులూ శాంత స్వభావులు అయినప్పటికీ - 'భగవంతుడు చెయ్యి విడిచిపెట్టేశాడు' అన్న దానిని తలుచుకుని కొన్ని సమయాల్లో కన్నీరు కారుస్తుంటారు.

అణకువ ఉన్నంత తీవ్రంగా - పట్టుదల లేదు - అన్నది దానిలోని అర్థం.

కాని మహాప్రవక్త ఎంత అణకువతో ఉండేవారో - అంతకి మించిన పట్టుదలతోనూ ఉన్నారు.

"దేవుడు ఒక్కడే" అన్న 'ఏకేశ్వరోపాసన' సిద్ధాంతాన్ని ఆయన ప్రచారం చెయ్యటం చూసి చాలామంది భయపడి ఆయన పెత్తండ్రి దగ్గిరకెళ్ళి మొరపెట్టుకున్నారు. వారి మాటను కాదనలేక అబూతాలిబ్ మహాప్రవక్తని అడిగారు 'ఇదేమిటని?'

అప్పుడు ఆయన చాలా అణుకువతోనూ, అదే సమయంలో స్థిరసంకల్పంతోనూ బదులు చెప్పారు.

"బాబాయి ! దైవం సాక్షిగా చెపుతున్నాను. నా విశ్వాసాలని నేను వదులుకోను. వారు నా కుడిచేతిలో సూర్యుని, ఎడం చేతిలో చంద్రుని తీసుకొచ్చిపెట్టినా, దైవ కృపని వారికి తెలియజెప్పే నా ఈ ప్రయత్నాలని, అనగా ఈ సిద్ధాంత ప్రచారాన్ని మానను. దీనిని పరిపూర్తిగా నిర్వర్తించేదాకా ముందుకు వేసిన ఈ అడుగుని ఏ పరిస్థితిలోను వెనక్కి లాక్కోను" అని చెప్పారు శాంత స్వరాన.

అదేకాదు - ఆయనను ఎన్నో విధాలా బోధించారు, హింసించాలని ఎంతో ప్రయత్నించి చూశారు. విరోధులు తుక్కూదూగరా తీసుకొచ్చి ఆయన తలపై దిమ్మరించారు. కమ్చీతో అమానుషంగా కొట్టారు. ప్రార్థనలు చేసుకుంటుంటే ఒంటె దేహంలోని పేగులు తీసుకొచ్చి ఆయనపై విసిరారు.

చిట్టచివరికి - ఆయనని హత్య చెయ్యాలని ఇంటికో మనిషి చొప్పున కత్తిపుచ్చుకు బయలుదేరారు.

వినయము, అంతకు మించిన దృఢచిత్తము, లోతుగా పాతుకుపోయిన మహావృక్షంలాగా, స్థిరమై నిలిచారే తప్ప ఒక వీసమెత్తు కూడా కదలలేదు.

'కదన రంగంలో - పరిపూర్ణ విజయం పొందటానికి రా !' అని జయభేరి మ్రోగించి కదన రంగానికి పిలిచారు.

అప్పుడు... దృఢ సంకల్పమూ, శాంతిసౌజన్యాలూ కఠారులుగా తీసుకొని బయలుదేరారు.

313 మంది మటుకే ఈయన సైన్యం, ప్రత్యర్థుల సంఖ్య మూడింతలు అధికంగా ఉన్నప్పటికీ సాహసంతో పోరాడారు, విజయం పొందారు.

పోరాటం జరుపుతున్నపుడు ఈ మహా యోధుని శిరో కవచాన్ని ఒక సైనికుడు కత్తితో పొడిచాడు. నుదిటి మీద గాయం ఏర్పడింది.

ఇంకొకడు కైజారుని పళ్ల మీదకి విసరగా, పళ్లకి దెబ్బ తగిలి రాలిపోయినాయి. గోతిలో పడిపోయారు. ఇన్ని జరిగినా మనసుని చెదరిపోనివ్వక, కొండలాగా నిలబడి పోరాటం సలిపారు.

మదీనా నగరం ముట్టడిలో ప్రత్యర్థులతో జరిపిన పోరాటంలో ఆహారపదార్థాల కొరత, ఆకలి, తిండి లేక ఉపవాసాలు - ఇన్ని బాధలకి లోనయి కూడా ఆయన హృదయం అలసిపోలేదు.

మహాప్రవక్త ఒక్కరికే కాదు - ఆయన చుట్టూ ఉన్న అనుచరులు కూడా అమిత బాధలకు లోనయ్యారు.

తిట్లు తిన్నారు, కమ్చీలతో దెబ్బలూ తిన్నారు. భగ భగమండే మంటల్లోకి విసిరివేయబడ్డారు.

అయినప్పటికీ 'దేవుడు ఒక్కడే' అన్న విశ్వాసాన్ని ఊపిరి ఉన్నంత వరకూ వదల్లేదు, ఆఖరి నిశ్వాసదాకా దాన్ని తొణక్కుండా బెణక్కుండా ప్రాణప్రదంగా కాపాడారు.

వారికి వినమ్రతనీ నేర్పారు, వారిలో పట్టుదలకీ, నిశ్చలతకీ ప్రాణమూ పోశారు ఈ మహామనీషి.

ఇన్ని బాధలు పడి, విజయం పొంది, ప్రత్యర్థుల అహంకారాన్ని అణిచిన తరువాత, మదీనా నుంచి మక్కా వైపుగా పయనం సాగించారు మహాప్రవక్త.

ఆ సంఘటన గురించి మనం కొంత తెలుసుకోవాలి.

విజయం - విజయోన్మాదం వీరి తలకి ఎక్కలేదు. పగ తీర్చుకోవాలన్న ప్రతీకార వాంఛ చోటు చేసుకోలేదు.

మక్కా నగర ప్రవేశమప్పుడు, ఈ మాననీయుడు నమ్రతతో, ఒంటె మూపురానికి తన గడ్డం తగులుతుండగా తల వంచుకు వెళ్ళారు ప్రవక్త మహనీయులు.

ఎన్ని బాధలుపడాలో, ఏం జరగనున్నదో - అని ప్రత్యర్థులు భీతితో, తల్లడిల్లిపోయి, నిరీక్షిస్తున్నపుడు....

"మక్కా నగర ప్రజలారా! ఈనాడు మీపై ప్రతీకారం తీర్చుకొనవలెనన్న పగగాని, ద్వేషంగాని, విరోధభావంగాని మాకు లేదు. దైవం మిమ్ములను క్షమిస్తాడు. ఆయన కరుణా కటాక్షములని ఆయన వాత్సల్య ప్రేమలనూ మీరు పొందెదరుగాక ! మీరు ఈనాడు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందిన మానవులు !"

పరాజితులయిన శత్రువుల హృదయపు లోతుల్లోకి చొరబడి, అక్కడ గూడు కట్టుకుని ఉన్న భీతిని, నిస్సహాయతని, ద్వేషభావాన్ని తవ్వితీయగల వివేకం, మానవ విశిష్టత - వీటిని ఏ పేరుతో పిలవాలి? ఏమని అనాలి?

"ఈ రోజెళ్ళి - రేపు రా - " ఇది అద్భుతమయిన కల్పనా రచనకు మచ్చుతునక. కాని మక్కా నగరంలోని ఆ దృశ్యం - ఆ జరిగిన సంఘటన అపూర్వమయిన చరిత్ర, ఉన్నతమయిన చారిత్రక సంఘటన.

తరువాత వ్యాసంలో ముస్లిమ్‌ల గురించిన మరొక అపోహ గురించి వివరిస్తాను.

★ ★ ★

# పరిశుభ్రతకు మరోపేరు ఇస్లామ్

ముస్లిమ్‌ల ఆచార వ్యవహారముల గురించీ, వారు అనుసరిస్తున్న నిత్య జీవిత విధానం ఎటువంటిది అన్నదాన్ని గురించి తెలియని వారికి కొన్ని విషయాలు చెపుతాను.

ఇస్లామ్ మార్గం పరిశుభ్రతని ఉపదేశించిన మార్గం. మహాప్రవక్త వలె వ్యక్తి శుభ్రత, పరిసర శుభ్రత, నగర శుభ్రత, ఆచరణలో పెట్టి జీవించినట్లయితే ఈ ప్రపంచమే నిర్మలమయిన పారిశుధ్యానికి నిలయమయిన ఒక సుందర లోకమవుతుంది.

ఆ మార్గం రోజుకి అయిదుసార్లు ప్రార్థన చెయ్యవలెనని నిర్దేశించింది. ప్రార్థన చెయ్యటానికి ముందు....

శుచీ - శుభ్రతలు అత్యంత ముఖ్యమయినవి. అవసరమయినవి - అని ఈ మార్గం పదే పదే నొక్కి చెప్పింది.

పరిశుభ్రతని - 'తహారత్' అని అంటారు. ఈ శుచీ - శుభ్రతలు మూడు విధాలుగా ఉండాలి.

(1) దేహ పరిశుభ్రత.

(2) దుస్తుల పరిశుభ్రత.

(3) పరిసరాల పరిశుభ్రత.

మలమూత్ర విసర్జన అనంతరం దేహాన్ని అతి శుభ్రంగా కడుక్కోవాలి.

మూత్ర విసర్జన తరువాత 'ఢేలా' (మట్టిపెళ్ళ)ను ఉపయోగించాలి. ఆ తరువాత మంచినీళ్ళతో పరిశుభ్రంగా కడగాలి.

మల మూత్ర విసర్జనలు చెయ్యకూడని స్థలాలు :

1) మనుషులు తిరిగేటటువంటి రహదార్లలో.

2) నదీ ప్రవాహపు ఒడ్డున.

3) ఆహార పదార్థాలు పండించే పొలాల్లో.

4) చెట్ల మొదళ్ళలో

5) ఈద్‌గాహ్ - (పండుగ నమాజ్ చేసే స్థలం) మస్జిద్, క్రబస్తాన్ (గోరీల వాటిక) ఇత్యాది స్థలాలు.

ఇవేగాక చెయ్యకూడని పనులు ఏమిటి - అన్నది కూడా - స్పష్టంగా తెలియజెయ్యబడింది.

నుల్చుని మూత్రవిసర్జన చెయ్యకూడదు. నీటి ప్రవాహాన్ని లాగే నీటిని మూత్ర విసర్జనతో కలుషితం చెయ్యరాదు.

కుక్క, పంది వంటి జంతువుల ఎంగిలి తగిలితే లేక అది వంటి మీద పడితే, బాగా కడిగి శుభ్రపరచుకోవాలి.

జంతువుల పెంట, మూత్రం, చీమూ, రక్తం వంటివి వంటి మీదనో, బట్టల మీదనో పడితే వాటి మచ్చలు పోయే వరకూ కడిగి, శుభ్రపరచుకోవాలి.

పసి పిల్లలు మూత్రంపోసుకున్నా కూడా శుభ్రంగా నీటితో కడిగి తుడవాలి.

ప్రార్థనకి వెళ్ళబోయేవారి ప్రథమమయిన ధర్మం(స్నానం) గుసుల్. రెండో విధి 'వుజూ' - కాళ్ళూ చేతులూ శుభ్రం చేసుకోవటం.

## గుసుల్ (స్నానం)

స్నానం లేక వంటి మీద నీళ్ళు పోసుకోవటం అనబడు ఈ గుసుల్ విధానాలు :

నోటినిండా నీళ్ళు పోసుకు పుక్కిలించటం.

ముక్కు లోపలికి నీరు పీల్చి పరిశుభ్రపరచుకోవడం.

దేహమంతా పూర్తిగా శుభ్రపడునట్లు నీళ్ళతో స్నానం చేయడం.

స్నానం చేస్తున్నపుడు దేహంలో వెంట్రుకవాసి కూడా తడవని పొడి ప్రదేశం ఉండకూడదు. అల్లా ఏ కాస్త పొడి స్థలం దేహం మీద ఉన్నా 'గుసుల్' నెరవేరలేదని అర్థం.

దీని తరువాత 'వుజూ' అనేటువంటి కాళ్ళూ చేతులూ శుభ్రపరచుకునే విధానం చూద్దాం.

రెండు చేతులనీ మణికట్టుదాకా మూడుసార్లు కడుక్కోవాలి.

పల్లు శుభ్రంగా తోముకుని - మూడుసార్లు నీటితో పుక్కిలించి కడుక్కోవాలి.

నోరులాగానే ముక్కుని నీళ్ళతో కడిగి, చీది, ముక్కు రంధ్రాలలో మాలిన్యం లేకుండా శుభ్రపరచుకోవాలి.

అలాగే ముఖమంతా, నుదుటి నుండి గడ్డం వరకు కుడి చెవి నుండి ఎడమ చెవి వరకు పరిశుభ్రంగా మూడుసార్లు కడుక్కోవాలి.

కుడి చెయ్యి ఆ తరువాత ఎడమ చేతినీ, మూడుసార్లు మోచేతి దాకా తోమి కడుక్కోవాలి.

నుదిటి నుంచి తల మీదుగా, మెడ వెనక భాగం దాకా తడి చేతులతో తుడుచుకోవాలి.

మంచి నీటిలో వేళ్ళు ముంచి (తడి వేళ్ళతో) చెవి వెనక, ముందు భాగాలని, లోపలి భాగాన్ని మూడుసార్లు శుభ్రపరచుకోవాలి.

రెండు కాళ్ళనీ, పాదాలు మడిమలూ పూర్తిగా తడిసేటట్లు మూడుసార్లు కడుక్కోవాలి.

ఒక రోజుకి అయిదుసార్లు - ప్రార్థన చెయ్యవలసినప్పుడల్లా అయిదుసార్లూ - ఎన్ని విధాలుగా దేహాన్ని శుభ్రపరచుకోవాలో చూడండి.

ఈ పవిత్రమూర్తి - ఆత్మ పారిశుధ్యానికేగాక, దేహ పరిశుభ్రత గురించి కూడా, అమితమయిన - క్రమతతో కూడిన స్థిర అభిప్రాయాలకి పునాదులు వేశారు, ఆయన దగ్గిర పల్లు తోముకునే పుల్లలు (మిస్‌వాక్) ఎప్పుడూ సిద్ధంగా ఉండేవి - వుజూ చేసినప్పుడల్లా పల్లు తోముకోవాలి !

ఎక్కడబడితే అక్కడ ఉమ్ములు వేసే మనుషులంటే ఆయన ఇష్టపడేవారు కాదు. ఎవరయినా పొరబాటున తెలియక ఉమ్మివేస్తే, ఆ స్థలాన్ని వెంటనే నీళ్ళతో కడిగేవారు.

తాను ఉండేటువంటి పరిసర ప్రదేశాలని అద్దంలాగా, శుభ్రంగా తళతళ మెరిసేటట్లు ఉంచుకునేవారు. చినిగిపోయిన పాత బట్టలు వాటికి అతుకులు వేసి ధరించినా అవి శుచీశుభ్రతలతో తళతళమని మెరుస్తూ ఉండేవి.

"పరిశుభ్రత అన్నది 'ఈమాన్' (విశ్వాసం, ఆచరణ)లో సగభాగం" అన్నది ప్రవక్తాధినేత సుభాషితం.

మరణించిన వ్యక్తిని - సమాధి చెయ్యబడే చోటు శుభ్రంగా శుచిగా ఉండాలన్నది కూడా వారి ప్రవచనమే.

ముస్లిమ్‌ల గురించి చెప్పవలసిన మరో విషయం గూర్చి ఈసారి వివరిస్తాను.

★ ★ ★

# ఇస్లామ్ – కత్తిబలంతో వ్యాపించిందా?

**క**త్తి ఝుళిపించటం చేత ఇస్లామ్ మార్గం వ్యాపించింది – అన్న తప్పుడు అభిప్రాయం కొందరు కలిగివున్నారు.

క్రీస్తు మతము, ఇస్లామూ ఈ రెండూ ఆరంభంలో – రహస్య మార్గాలుగానే ఉన్నవి – అని స్థూలంగా చరిత్ర చెపుతున్న విషయం.

అందులోనూ క్రీస్తు మత ప్రబోధనలు, ఏసుక్రీస్తు మరణించిన తరువాత ఆయన శిష్యుల చేత ప్రచారం చేయబడి, వ్యాపించాయి.

కాని ఇస్లామ్ – మొదట్లో రహస్యమైన ప్రబోధమార్గమయివుండి, తరువాత బహిరంగపరచే అధికారము పొంది, బయట ప్రపంచానికి తెలియపరచబడినది.

నిర్బంధము లేక బల ప్రయోగము – వీటిని ఇస్లామ్ ఎంతమాత్రమూ ఒప్పుకోదు అని ఖ్యాతి వహించింది.

అటువంటప్పుడు, మహాప్రవక్త కత్తిదూసి పోరాటాలు జరపడం ఎలా సంభవించింది?

ఆ యుద్ధాలన్నీ స్వీయ రక్షణ కోసం చేయబడిన యుద్ధాలే.

మక్కాలోని ఖురైషి తెగవారు, మహాప్రవక్తకి ఆశ్రయం ఇచ్చిన మదీనా ప్రజలపై దాడి జరిపినపుడు, కొత్త మార్గాన్ని స్వీకరించిన మదీనా వాసులని అణగదొక్కాలన్న ప్రయత్నం జరిగినపుడు, పోరాటాలకి అంకురార్పణ జరిగింది.

అందుచేత, స్వీయరక్షణ కొరకు, తన మార్గాన్ని అనుసరించిన ప్రజా

రక్షణ కొరకు ఖడ్గం ఎత్తబడిందే తప్ప మత విస్తరణ కోసం మటుకు కాదు.

ఆ తరువాత కాలంలో ముస్లిమ్ చక్రవర్తులు తమ సైన్యంతో ఇతర దేశాలపై దండయాత్రలు జరిపిన సంఘటనలు లేకపోలేదు. ఆ దండయాత్రలు కూడా 'ఇస్లామ్ మార్గ విస్తరణ కొరకు' అన్న లక్ష్యంతో ఆరంభించబడలేదు.

భారతీయ చక్రవర్తులయిన రాజరాజు, రాజేంద్రుడూ మొదలగువారు జావా, సుమిత్రా ఇంకా దిగువ భాగాన ఉన్న దేశాలపై దండయాత్రలు సలిపారు.

ఇప్పటికీ ఆ దేశాలలో హిందూ మత చిహ్నాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఆ కారణంచేత హిందూ మత విస్తరణ కోసం ఆ చక్రవర్తులు కత్తి పట్టుకున్నారని అనటానికి వీలవుతుందా?

క్రీస్తు మతస్తులయిన, యూరోపియనులు ఎన్నో యుద్ధాలు జరిపారు. సామ్రాజ్యాలు స్థాపించారు. ఆ సామ్రాజ్యంలో క్రీస్తు మతస్థులే ఎక్కువ సంఖ్యలో ఉండేవారు.

అట్లాంటప్పుడు క్రీస్తు మతం కత్తి బలంతో విస్తరణ చేసిన మతం అవదా?

అసలు ఇందులోని సత్యం ఏమిటంటే ఇంకో దేశాన్ని చేజిక్కించు కోటానికి, ఆ దేశంలో తమ అధికారాన్ని నెలకొల్పటానికి దండయాత్రలు జరుగుతూ ఉంటాయి.

'యధారాజా – తధాప్రజా' అన్నట్లు పాలకులు ఏ మతానికి చెందినవారై ఉంటారో – ఆ వైపునకే ప్రజలు మొగ్గు చూపటం సహజం.

ఇదే దక్షిణ భారతంలో జైన మతావలంబకులైన రాజులు పరిపాలించినపుడు జైనుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. చక్రవర్తులు బౌద్ధ

మతస్థులయినపుడు బౌద్ధ మతం తామరతంపరగా పాతుకుపోయింది. రాజులు శైవులుగా మారినపుడు శైవుల సంఖ్య అధికమయింది. ఆ తరువాత వైష్ణవులుగా మారినపుడు వైష్ణవుల సంఖ్య మిక్కుటంగా పెరగగల అవకాశం ఏర్పడింది.

తమ మార్గాన్ని అనుసరించలేదన్న ఆ ఒక్క కారణం కోసం, ఇస్లామ్ మతపరమైన హత్యలను ఏనాడూ సమర్థించలేదు.

కాని, కేథలిక్కులకీ, ప్రొటెస్టెంటులకీ మధ్య నడిచిన పోరాటంలో మతపరమైన హత్యలు జరిగినవి.

అంతదాకా ఎందుకు? మధురైలో కూడా జ్ఞాన సంబంధర్ కాలంలో ఎనిమిది వేల మంది జైనులు గ్రద్దలకి ఆహారమయ్యారని చరిత్ర చెబుతున్నది.

అరేబియా దేశానికి మహాప్రవక్త పాలకుడై పరిపాలించిన కాలంలో - ఆ దేశంలో యూదు మతస్థులు ఉన్నారు. క్రీస్తు మతస్థులు కూడా ఉన్నారు.

ఏం... భారతదేశంలో కూడా ముస్లిమ్ నవాబులు పరిపాలించిన కాలంలో హిందూ మతమూ, హిందూ దేవాలయములు మున్నగునవి పరిరక్షింపబడినవని చరిత్ర చెపుతున్నది.

మత విస్తరణ కొరకే - ముస్లిమ్‌లు దండ యాత్రలు జరిపారు అంటే....

పర రాజ్యాన్ని ఆక్రమించుకోవటం ఆ కాలంలోని రాజధర్మం, రాచరిక వ్యవస్థలో రాజ్య విస్తీరణే పరాక్రమ చిహ్నం. ఆ ప్రకారం దండయాత్రలు జరిపేవారు తప్ప, మతాన్ని విస్తృతపరిచే ఉద్దేశ్యంతో మటుకు కాదు.

హిందూ చక్రవర్తులతో సంబంధం లేకుండానే, కొందరు ముస్లిమ్ మతప్రచారకులు - భారత దేశంలో ఈ మార్గాన్ని విస్తృతపరిచివున్నారు.

ఉదాహరణగా చెప్పాలంటే - నాగూర్‌లో సమాధి చేయబడివున్న అత్యున్నత వ్యక్తి - 'షాహుల్ హమీద్'ని చెప్పుకోవచ్చు.

ఉపదేశాల వల్ల, జీవన విధానం వల్ల మానవుని మనసులో ఆర్ద్రత కలిగించగల శక్తివున్న ఇస్లామ్‌కి కత్తి పట్టుకోవలసిన అవసరం లేదు. చరిత్ర పట్ల సరిఅయిన అవగాహనలేని వ్యక్తులు అనేటువంటి అర్థవిహీనమయిన మాటలని మనం పట్టించుకోనక్కరలేదు.

"ఇస్లామ్ గురించి ఇంత రాసిన నువ్వు ఎందుకు ముస్లిమ్ అవలేదు? ఆ మార్గాన్ని ఎందుకు స్వీకరించలేదు" అన్న ప్రశ్నలు తలఎత్తుతాయి. వాటి సమాధానం తరువాత చెపుతాను.

★ ★ ★

# నేను ఇంకా ముస్లిమ్‌ని ఎందుకు అవలేదు?

నన్ను కలుసుకునే అనేక మంది ముస్లిమ్ సహోదరులు - నన్ను చూడగానే తరచు అడిగే ప్రశ్న ఒకటుంది. "మీరు ఎందుకని ఇంకా ముస్లిమ్‌గా మారలేదు?" అని.

అందుకు చాలా కారణాలున్నాయి :

1. ఇస్లామ్‌ని గూర్చి నేను ఇంకా పరిపూర్ణమయిన జ్ఞానం పొందలేదు. 2. ఇస్లామ్ పరిధికి బయట నుల్చుని, ఆ మార్గపు జ్ఞాన జ్యోతిని చీకటి మూలలకి తీసుకెళ్ళవలెనని ఆశిస్తున్నాను. 3. నిజమయిన ముస్లిమ్ ఎలా ఉండాలి అన్నది చదువుతున్నపుడు నాలో ఒక రకమయిన దుడుకుతనం, దగ్గిరిగా రాలేని సంకోచమూ ఏర్పడుతున్నాయి.

నిజమయిన ముస్లిమ్‌కి అల్లాహ్ పైన, రాబోయే రోజులోని న్యాయ ధర్మం పట్లా నమ్మకం ఉండాలి.

నిజం దాచకుండా చెపుతున్నాను. ఇంకా నేనా స్థితికి చేరుకోలేదు.

'మీసా' నిర్బంధంలో ఉన్నపుడు ప్రపంచంలోని పలు మత గ్రంథాలని చదివే అవకాశం కలిగింది.

ఒక్కొక్క మత గ్రంథమూ, ఉపదేశ గ్రంథమూ ఒక్కో విధంలో, ప్రత్యేకత, ప్రాధాన్యం కలిగివున్నాయి. కాని దివ్య ఖుర్‌ఆన్ మటుకు వాటన్నిటిలోకి మిక్కిలి శ్రేష్టమయిన ప్రతిభ కలిగివుంది. ఆ గ్రంథ పఠనా

ప్రయత్నం అక్కడితో ఆగిపోయింది. ఎవరయినా అందులోని సూక్ష్మ జ్ఞానాన్ని- బోధించ గలిగితే, వివరంగా చెప్పగలిగితే స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నాను.

నిజమైన ముస్లిమ్ త్రాగుడికి బానిస అయివుండకూడదు.

ఇది తల్చుకుంటేనే గుండెలు దడదడ కొట్టుకొంటున్నాయి. ఈ చేదు ద్రవాన్ని తాగుతున్న మనిషి అద్దం ముందు నిల్చుని ఆకులా కంపించిపోతున్నాడు. తన అసందర్భ ప్రేలాపన విని, ఊగుతూ, తడబడే స్థితి చూసి కూడా మానవుని మనస్సు తాగాలన్న ఇచ్ఛకు లోబడిపోతూవుంది, వార్థక్యమూ, విసుగూ, ఇతరుల దృష్టిలో చులకనా, అందువలన ఏహ్యభావమూ ఏర్పడుతోంది. ఇది కూడా బలహీనత వలన ఏర్పడిన మానవ బలం ! బల హీనతకి లొంగని మనోధృతి కలవారే ముస్లిమ్ అవటానికి సాధ్యమవుతుంది.

"పొరుగింటివారు ఆకలితో మాడుతున్నపుడు, తాను మటుకు కడుపునిండా తిని ఆనందించేవాడు నిజమైన ముస్లిమ్ కాడు."

ఎవరినయినా కలుసుకోగానే, "భోంచేశావా? భోంచెయ్యి" అని అడిగేటువంటి స్వభావ లక్షణం ఉన్నవాడినేఅయినా పొరుగు వాని ఆకలి గురించి ఆలోచించే మనోస్థితికి ఎదగలేదు.

పక్కింటివారిని చూస్తేనే మొఖం చాటేసి మర్యాదకి ఒక మాట మాట్లాడి తప్పించుకుని పారిపోయే స్వభావమే అధికం. పొరుగువారి ఆకలిని గూర్చి అర్థం చేసుకోగల మనోపరిపక్వత వచ్చిన రోజున - ముస్లిమ్‌గా మార వీలవుతుంది.

భేదాభిప్రాయంతో - తన సహోదరునితో మూడు రాత్రులపాటు వాదులాడినా, అతనిని కలుసుకున్నపుడు మాట్లాడకుండా ముఖాన్ని

తిప్పుకోటం ఒక ముస్లిమ్ చేసే పని కాదు.

అభిప్రాయ భేదం అంటూ వచ్చిందా - దాంతో పాటు వీరావేశమూ వచ్చేస్తూ ఉంటుంది. కఠినత్వమూ, కరుకుతనమూ వచ్చేస్తాయి : అతనితో మాట్లాడటం ఆపేసి, అతనిని గూర్చి దుర్భాషలు ఆడమని మనసు ప్రోత్సహిస్తూవుంటుంది.

అది మనసుకి పట్టిన మకిలి. ఈ మనసులోని మాలిన్యాన్ని ప్రక్షాళన చెయ్యగలిగినవాడే ముస్లిమ్ అవగలుగుతాడు.

పరిచయస్తులకీ - అపరిచితులకీ ఉభయులకూ సలామ్ చెయ్యి అంటుంది గణనీయమయిన ఇస్లామ్.

కొన్ని సమయాల్లో పరిచయస్తుల పట్లే గౌరవం కనబరచం - ఇక అపరిచితుల గురించా...?

పరిచయస్తుల పట్ల మర్యాదసూచకంగా కొన్ని సమయాల్లో చేతులెత్తి నమస్కరించం - ఆఖరికి చేతులే కదల్చం సరికదా, తల మటుకే ఊపుతాం, కొన్ని పరిస్థితుల్లో కళ్ళు మటుకే కదల్చటం కద్దు.

గర్వమూ, అహంకారమూ జీర్ణించుకుపోయిన దేహస్థితి. స్వభావ లక్షణమూ - ఇవి మారినపుడే ముస్లిమ్ అవటానికి అర్హత కలిగేది.

ధర్మం చెయ్యటం ప్రతి ముస్లిమ్‌కి ముఖ్యమైన బాధ్యత.

ఒకసారి హోటల్లో భోంచేసి, కిందకి దిగి వస్తున్నపుడు ఆకలితో ఉన్న ఒక పెద్దాయన - "అయ్యా ! అన్నం తిని రెండు రోజులయింది-" అని జాలిగా అడిగాడు.

"హోటల్లో భోంచెయ్యండి - " అన్నాను.

"డబ్బులు కావాలి కదండి" అన్నాడాయన. 'ఎంత కావాలి?' అని అడిగాను. "రెండు రూపాయలు" అన్నాడు.

అయిదు రూపాయలిచ్చాను. పక్కనవున్న స్నేహితుడు ముఖం చిట్లించుకున్నాడు... అదేకాదు....

"ఈ విధంగా చేస్తే, కొన్నాళ్ళకి ఓటిడబ్బా అయిపోతావు" అని మందలించారు నన్ను. 'ధర్మం చేస్తే చెడిపోతావ్' అంటూ స్నేహితులూ సమాజం అందరూ చెపుతూనే ఉంటారు. వీటన్నిటినీ జయించుకుని దాతృత్వమను సహజ గుణాన్ని ప్రోది చేసుకున్నపుడు గదా - ముస్లిమ్ అవగలిగేది?

ఏ వ్యక్తి ప్రవర్తనా, మాటలూ మరో వ్యక్తిని బాధించవో ఆ వ్యక్తే ముస్లిమ్ అవగలుగుతాడు.

ఇది సాత్వికమైన స్థితి, ప్రవర్తన ద్వారా ఇతరుల మనసు నొప్పించకుండా ఉండగలగటం సాధ్యం అవచ్చు. కాని మాటలా ! ఆ మాటలు గభాలున బయటికి దూరినపుడు ఎదుటి మనసుని ఈటెల్తో పొడిచినంత బాధకి లోనుచేస్తాయి. కాని మౌనం కూడా చాలా మందిని బాధిస్తూ ఉంటుందే ! అయ్యో నేను వీటి నుంచి ముందు విముక్తి పొందగలగాలి. ఆ తరువాతనే ఈ ప్రశాంత మార్గానికి చేరగలుగుతాను.

సౌందర్యమూ, సంపదాగల యువతి ఒకత్తె - లాలనతో ఆహ్వానించినపుడు అది త్రోసిపుచ్చి, "భగవంతునికి అర్పించుకున్నాను" అని అనగలిగినవాడే ముస్లిమ్.

అందమైన అమ్మాయిని డబ్బు ఇచ్చి అయినా - కొంచెం సేపు అనుభవించినపుడు అది వ్యభిచారం అవుతుంది. సంపద గల అమ్మాయి

అండ జేరుకోవటమే పెద్ద ఇంటి సంబంధం, ఈ రెండూ రా రమ్మని పిలుస్తుంటే నిరాకరించటమా? ఈ ఏడు అంతస్థుల మేడని ఎక్కి, నేను ఏనాడు ఈ మెట్లన్నీ ఎక్కి, పైకి చేరుకోగలనో - ఆనాడు నేనీ మార్గాన్ని పొందగలనేమో !

మహాప్రవక్త సూచించిన ఇటువంటి నిబంధనలు చదువుతున్నపుడు, శిరస్సు నుంచి పాదాలదాకా ఒక రకమైన ప్రకంపనలో ఊగిపోతున్నాను. కన్నీరు ! దేహమంతా ఒక రకమైన అనిర్వచనీయభావంతో రోమాంచిత మవుతోంది. గాలి స్థంభించిపోయినట్లు, నీలి మబ్బుల్లేని ఆకాశంలాగా కదలకుండా కదలిక లేకుండా నిల్చివున్నాను.

★ ★ ★

మలి పలుకు :

# ఒకే గ్రంథంలో నిక్షిప్తమైవున్న పెద్ద గ్రంథాలయం : దివ్య ఖుర్‌ఆన్ ప్రపంచ విజ్ఞాన సర్వస్వం (ఎన్‌సైక్లోపీడియా)

ఒకనాటి ప్రత్యూషకాలం వేళ. ఆ తరువాతనూ దివ్య ఖుర్‌ఆన్ పఠిస్తున్న శబ్దతరంగాలు నా చెవులబడినాయి.

ఆ తరువాత వేద శబ్దాలు, తమిళ భక్తి గీతాలూ నా చెవులలోకి వినిపించాయి.

ఈ మూడూ ఒక్కొక్కటి ఒక్కొక్క రీతిలో నా హృదయ తంత్రులని శబ్దమాధుర్యంతో ముంచెత్తినవి.

కాని, నా మాతృభాషలోని పరిమళ మాధుర్యం, కాస్త అధికంగానే నా మనసుని పట్టుకు లాగనారంభించింది.

ఒకవేళ నా రక్తంలో జీర్ణించుకుపోయిన భాషాభావం వల్లనో, ఒకవేళ బాల్యం నుంచి నా మాతృభాషలో విద్యాభ్యాసం చేయటంచేతనో లేక ఈ మధ్య జరిగిన ప్రపంచ తమిళ మహాసభల ప్రభావం చేతనో - అటువంటి మనోస్థితి నాలో ఏర్పడివుండవచ్చు.

సంస్కృతంలోని వేదపఠనం - ఆ శబ్దబలంలో మనిషి హృదయాన్ని పట్టుకుని లాగగల శక్తివుంది.

దివ్య ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు - ఆ శబ్దం మానవుని హృదయపు లోతుల్లోకి చొచ్చుకుపోతుంది.

ఈ మూడు ప్రార్థనా తీరులలో మొదటి రెండు కేవలం కావ్యరీతిలో పద్యరూపాల్లో ఉన్నాయి. కాని అరబీ భాషలో ప్రవచించబడిన దివ్య ఖుర్ ఆన్- వచనమూ, కవనమూ - ఈ రెండూ సమ్మిళితమయిన ఒక అపూర్వ ప్రయోగం. అదొక్కటే కాదు - అంతకంటే ఉన్నతమయిన మరో సంగతి....

"వచన రూపంలో నడిచిన కవితాగానం" అని శిలప్పది రాగానికి ఒక ప్రత్యేకమయిన పేరువుంది.

అదే మాదిరిగా, ఇంకా అంతకి మించిన శ్రేష్ఠమయిన నూతన కవితా మధురిమలని వెదజల్లుతూ వుంది దివ్య ఖుర్ఆన్.

వేదము - అనేది ఇది చెయ్యి, అది చెయ్యకు అని నిర్ణయించి విచక్షణా జ్ఞానము ప్రబోధించేది.

ఇతిహాసము, ఆదర్శప్రాయములయిన కథలూ గాథలూ చెప్పి, వాటికి అనుగుణంగా మన జీవితాలను గడపమని ప్రబోధించేది.

కావ్యము అంటే... కవితా మాధుర్యంతో భావదీప్తిని కలిగించేది.

ఈ మూడు లక్షణములూ కలిగిన ఒకే ఒక గ్రంథం - దివ్య ఖుర్ఆన్.

ఆ గ్రంథంలో - విజ్ఞాన, న్యాయ, ఆర్థిక ఇత్యాది విషయాల గురించి వివరాలు... మానవ జీవితానికి సంబంధించిన సర్వ విషయాల గురించీ, అన్ని కోణాల నుంచీ దివ్య ఖుర్ఆన్ నిర్వచించింది.

అయితే పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం జన్మించి దృఢంగా, సూటిగా నిలబడగలిగిన, జీవిత నిఘంటువు లేక ఎన్సైక్లోపీడియా, జ్ఞాననిలయం దివ్య ఖుర్ఆన్ అని చెప్పవచ్చు.

అంతేకాదు, ఒక చిన్న గ్రంథంలో దాగివున్న మహా గ్రంథాలయమని కూడా చెప్పుకోవాలి.

మిగతా ఉపదేశాలకీ – దీనికీ మధ్య ఒక ముఖ్యమైన తేడా ఉంది. పాత కథలనిగాని, చారిత్రక గాథలనిగాని కించపరిచే విషయాలు ఏ వాక్యంలోనూ కనిపించవు.

పాత నిబంధన (బైబిల్) లోని గాథలు, అశ్లీలమయినవి, ముఖం చిట్లించుకోతగినవీ అయిన కొన్ని సంఘటనలు తీసేసి, దోషరహితము చేసి, 'నీతి ప్రబోధకమైనవిగా' తీర్చిదిద్దిన ఘనత దివ్య ఖుర్‌ఆన్‌కే లభించింది.

దివ్య ఖుర్‌ఆన్ పఠించటం ఆరంభించగానే, (ముస్లిమ్‌లు కానివారికి) మొదట ఒక విధమైన బాధకు లోనయినట్లు భ్రాంతి ఏర్పడుతుంది.

తరచూ – క్షణక్షణానికి అరబ్ మాటలు వస్తున్నాయే అన్న ఇబ్బంది మొదటిది.

స్వచ్ఛమైన తమిళ భాషలో మనం ఆంగ్ల పదాలు ఎందుకు వాడుతున్నాం? ఆ పదాలకి రెండు వైపులా బ్రాకెట్లు ఎందుకు తగిలిస్తున్నాం?

ఒక భాషని – మరో భాషలో అనువదించినపుడు మూల భాషలోని సారం కొంత తగ్గవచ్చు. అయితే మూల భాషలోని మాటని యథాతథంగా బ్రాకెట్లో ఉంచినపుడు – అర్థ లోపం తగ్గే అవకాశం ఉంది.

అదే విధంగా అరబీ మాటలు కూడాను. ఆ మాటలని యథాతథంగా వాడినపుడు సరిఅయిన, సమానమయిన అర్థం స్ఫురిస్తుంది.

ఈ విషయం అర్థం చేసుకున్ననాడు – భయం అనే భ్రాంతి మాయమయిపోతుంది.

మరో విషయం ఊహాజనితమయిన చారిత్రక కథలు, సినిమాలు, సినిమా కథలూ చూసి, చదివేటువంటి మనుషులకి దివ్య ఖుర్‌ఆన్‌లో మొదటి నుంచి చివరిదాకా మాట్లాడేవాడు ఒకే ఒక వ్యక్తి అన్న భ్రాంతి కలుగుతుంది.

కాని లోతుగా వెళ్ళి పరిశీలిస్తే - ప్రథమ పురుష ఏక వచనంలోను, ప్రథమ పురుష బహువచనంలోను, తృతీయ పురుషలోనూ మూడు స్థితులకి అనువగు వచనంలో చెప్పబడుతోందని స్పష్టంగా బోధపడుతుంది.

ఇంకా సూటిగా చెప్పాలంటే ఈ ప్రబోధాలని తిరిగి తిరిగి నొక్కి నొక్కి చెబుతున్నది కూడా బోధపడుతుంది.

జీవితంలో వివిధ విషయాల గురించి చెప్పబడినవి అన్న మనోపరిపక్వతతో దీనిని చూసినట్లయితే - మొదట్లో కలిగిన భయభ్రాంతులు మాయమయిపోగలవు.

మరొక భ్రాంతి... తిరిగి తిరిగి ఒకే మాటని పలుమార్లు చెప్పే దివ్య ఖుర్ఆన్ ఉపదేశ భాష.

గోడకి మేకు కొడుతున్నపుడు, ఒక్క దెబ్బతో మేకు లోపలికి వెళ్ళదు. చాలాసార్లు కొట్టినప్పుడే మేకు గోడలోకి దిగబడుతుంది.

అదేవిధంగా, గాఢంగా హత్తుకుపోవాలని, వివరంగా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో - ఒకే విషయం తిరిగి తిరిగి చెప్పబడింది.

రైలు ప్రయాణంలో చదువుకునే కథల పుస్తకాల లాగా ఉపదేశ గ్రంథాలు ఉండవలసిన అగత్యం లేదు. ఉపదేశ గ్రంథాలు నిదానంగా, జాగ్రత్తగా, ఏకాగ్రతతో తిరిగి తిరిగి అధ్యయనం చేసి జీర్ణించుకోవలసినవి.

ఈ దృష్టితో దివ్య ఖుర్ఆన్‌ని చూసి - పఠించినట్లయితే... దివ్య ఖుర్ఆన్ ప్రపంచంలోని గొప్ప ఉపదేశ గ్రంథమన్న అభిప్రాయానికి - ఒక్కసారి చదివినవారు కూడా వచ్చి తీరుతారు.

★ ★ ★

# ఆఖరుదాకా బీదవానిగానే ఉండాలి!

నా మనసు, నా ఆలోచనలు ఇస్లామ్ ప్రబోధాల్లో సుళ్ళు తిరుగుతూ ఉన్నాయి. ఆ ప్రబోధాలలోని దివ్య మకరందాన్ని నా గుండెల్లో అణుచుకోలేక, ఈ రోజు ఏమయినా సరే నా హృదయం లోనవుతున్న సంచలనాన్ని రాసి తీరాలన్న పట్టుదలతో కలం చేతిలోకి తీసుకున్నాను.

హృదయపు లోతుల్లోనించి ఏదో ఒక కొత్త అనుభూతి – కొత్త భావ పరంపర.

నా ఆలోచనా విధానంలో – మెరుపువంటి మార్పు, ఇప్పటిదాకా నాకు స్ఫురించిన మనో దృశ్యాల్లో కొత్త మార్పు.

ఇస్లామ్ అను మందమారుతం, సుగంధ పరిమళంలాగా మెల్లిమెల్లిగా వీచి, నన్ను చుట్టుముట్టి, నాలోని తాపాన్ని పోగొడుతూ సేద దీరుస్తూ ఉన్నది. పూలరథం కట్టి ఆకాశ మార్గంలోకి తీసుకెళ్ళి, అక్కడి నుంచి భూమి మీదకు తొంగి చూడమంటున్నది.

> ఏదో ఒకటి చేసి
> ఎట్లాగో అట్లా ధనం సంపాయించు
> ధనవంతుడిలాగా జీవించు
> ఇల్లూ, తోట, కారు గల జీవితం గడుపు
> బ్యాంకులో బాగా డబ్బు నిలవజెయ్యి
> జరీ అంచు సిల్కు ఉత్తరీయం ధరించు
> సంపన్నునిగా బ్రతికి, సంపన్నుడిగానే మరణించి – నీ కథ ముగించుకో.

– ఈ విధంగా భూమి మీద ఉన్నవారి హృదయాలన్నీ రణగొణధ్వని చేస్తున్నాయి.

అర్థం లేనివాడు వ్యర్థుడు. డబ్బులేని వాడికి ఈ ప్రపంచంలో స్థానం లేదు – అని తమ మనో కవాటాలని పూర్తిగా మూసివేసుకుంటున్నారు.

పిల్లవాడు పెరిగి, యవ్వనప్రాయంలోకి అడుగుపెట్టి, అతనిని పై చదువులకి పంపేటప్పుడు కూడా –

చదువుకో – పట్టభద్రుడవయి, గొప్ప ఉద్యోగం సంపాయించి, రెండు చేతులా సంపాయించరా....

– అని రోజూ బుద్ధులు చెపుతూ ఉంటారు.

పిల్లని ఇచ్చేటప్పుడు, పిల్లని తెచ్చుకునేటప్పుడూ – అందమయినా ఉందో లేదో చూడకుండా డబ్బూ దస్కం ఉంటే చాలు అనుకుంటారు.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అయ్యారు, పిల్ల పెళ్ళీడుకి వచ్చింది. డబ్బు కూడబెట్టు, ఎలాగో అలా డబ్బు వెనకెయ్యి – అని జోరీగల్లాగా చెవులో చెబుతూంటారు.

సర్వసంగపరిత్యాగులమని చెప్పుకునే సన్యాసులు, భక్త శిఖామణులు, పరమార్థ చింతనతో భగవంతుని వేడుకునే సాధకులు, గురువులు సంపన్నులైన శిష్యుల ఇంట ఉండి విందులు సేవిస్తూ ఉంటారు.

కార్మికులనీ – కర్షకులనీ ఉద్ధరిస్తాను అని కంకణం కట్టుకున్న బడుగు జనుల నాయకుడు – తన ఏకైక పుత్రికకు మద్రాసులో అబట్స్‌బరీ భవంతిలో, చెట్టుచెట్టుకీ, ఆకు ఆకుకీ విద్యుద్దీపాలంకరణ చేసి, రంగరంగ వైభోగంగా వివాహం జరిపిస్తున్నాడు.

కష్టపడి పనిచేసి, లేమి నుంచి బయటపడలేని ఇజాన్నే సోషలిజం అంటున్నారు.

డబ్బ్యాదస్కం వచ్చి, మేడల్లో నివసిస్తున్న ఆధునిక సోషలిజాన్ని చూస్తున్నాము.

ఈ విధంగా, పుడుతూనే ధనవంతుడై పుట్టి, బ్రతుకంతా సంపదలో వెళ్ళదీసి, కన్నుమూసేటప్పుడు కూడా– భాగ్యవంతుడిగానే కన్నుమూయాలన్న ఇచ్ఛతో డబ్బు చుట్టూ ప్రదక్షిణాలు చేసే ఈ ప్రపంచంలో.

"భగవంతుడా ! నన్ను బీదవానిగా వుంచేటట్లు అనుగ్రహించు" అని ప్రార్థించినవారు ఒక్కరే.

ఆయన, బీదవారి ప్రార్థనా సమావేశాలని నిర్వహిస్తున్నపుడు... అరేబియా దేశానికి పాలనాధిపతిగా ఉన్నవారు, ఆయనే నా హృదయాధినేత ముహమ్మద్ ప్రవక్త.

ఈ భూమండలంలో ఇలా భగవంతుని వేడుకున్నవారు గాని, ఇలా ప్రబోధం చేసినవారుగాని, చేసిన ప్రబోధాన్ని జీవితంలో అమలుపరచిన వారుగాని లేరు.

బీదరికాన్ని ఆహ్వానించి, బీదవారితో కలిసి బ్రతికినవారు ఉన్నారు. శ్రీమంతుల భవనాల్లో పుట్టి, బంగారు తూగుటుయ్యాలలో బాల్యం గడిపినవారూ ఉన్నారు.

బీదరికం గురించి ఉపదేశాలు చేసినవారూ ఉన్నారు. చేయూతనిచ్చే వారులేని నిర్భాగ్య జీవితం గడుపుతున్నవారూ ఉన్నారు.

అన్నిటినీ పరిత్యజించామనుకున్నవారు తమ పర్యటనలప్పుడు రాజ భవనాల్లో విడిది దిగినవారూ ఉన్నారు.

కాని నాయక శిఖామణి అయిన ఈ పవిత్రమూర్తి సర్వ సంగపరిత్యాగం చేయలేదు. గృహ జీవితం గడుపుతూనే, అధికార పీఠం అలంకరించి, సంపన్న జీవితం గడపగల అవకాశం ఉండి కూడా, బీదరికాన్ని వరించి, అతి బీదగా ఆదర్శవంతంగా నడుచుకున్నారు.

చాప మీద పడుకున్నారు... ఉత్త మట్టి నేల మీద పడుకున్న రోజులూ ఉన్నాయి.

దేహాన్ని నిలబెట్టుకోటానికి, విధి నిర్వహణకి కావలసిన ఆహారం మటుకే అతి క్లుప్తంగా తీసుకునేవారు.

బార్లీ రొట్టెని ఇష్టంగా తినేవారు, వారింట పొయ్యి అంటించని రోజులు కూడా ఉన్నాయి. అటువంటి సమయాల్లో ఖర్జూరపు పళ్ళు తిని మంచి నీళ్ళు తాగి ఊరుకునేవారు.

కడుపులో ఆకలి దహించుకుపోతున్నా, బట్టలలో ఇటుకలు చుట్టి కడుపుమీద కట్టి, చిరునవ్వుతో ఇతరులకి తన ఆకలి బాధ తెలియకుండా ప్రవర్తించి జీవించేవారు.

బాగా ఆకలిగొన్న ఒక క్షుధార్తుడు, ఈ నాయక శిఖామణి ఇంటికెళ్ళి ఏదైనా తింటానికి పెట్టమని అడగ్గా, ఈ మాననీయుడు - "ఇంట్లో ఏమైనా ఉందా" అని భార్యనడిగారు.

"మంచినీళ్ళు మటుకే ఉన్నాయి" అని జవాబొచ్చింది.

ఒక దేశానికి, సువిశాలమయిన భూభాగానికి చక్రవర్తి అయిన వ్యక్తి ఉండవలసిన పరిస్థితా ఇది? వచ్చిన సంపదనంతా ఏం చేసేవారు? వచ్చింది, వచ్చినట్లు దోసెళ్ళతో పంచిపెట్టేవారు, ధర్మం చేసేవారు - చేతికి ఎముకలేని దీన దయాళువయిన ఈ మహావ్యక్తి.

ఈ దీన జన బాంధవుడు జీవించిన ఇల్లు మట్టితో కట్టబడింది. మట్టిగోడలు - పై కప్పుకి ఖర్జూరపు ఆకులు - అతి సామాన్యమయిన కుటీరం.

ఈ మహాదాత్తుని ప్రియపుత్రిక అయిన ఫాతిమా - తమ ఇంటికి కావలసిన పిండి తానే విసిరేది, తమకు కావలసిన నీళ్ళు తానే స్వయంగా తోడి తెచ్చుకునేది.

ఒక దేశానికి నాయకుడయిన ఆ మహా చక్రవర్తి ప్రియపుత్రిక జీవించిన విధానాన్ని చూస్తున్నాం. ఆ తరువాత వచ్చిన సార్వభౌముల పిల్లలు, నవాబుల భార్యలు, ఈ కాలంలోని మంత్రివరేణ్యుల కొడుకులని, కుమార్తెలని, మన ఇళ్ళలోనే ఉండే 'రాజా-రాణీ'లను అందరినీ చూస్తున్నాము. ఫాతిమా వంటి వనితా రత్నాన్ని తల్చుకున్నపుడు కళ్ళ నిండా నీళ్ళు పొంగుకువస్తున్నాయి.

కడుపున పుట్టిన బిడ్డలకి - మనం ఏం ఇవ్వాలి?

మంచి చదువు,

మంచి ఆహారం,

మంచి శిక్షణ.

- కాని ఈ మూడూ పిల్లలు ఎదగడానికి దోహదం చేస్తాయి - అని మనం అనుకోవటం లేదు.

వారి కోసం డబ్బూ దస్కం కూడబెట్టి ఉంచాలని ప్రయత్నం చేస్తుంటాము. డబ్బు కూడబెట్టి చేతికి ఇవ్వటం చేత మన పిల్లలు ఎందుకూ పనికిరాని సోమరిపోతులు అయిపోతున్నారన్నది మర్చిపోతున్నాము.... "కష్టపడి వాళ్ళ సంపాదన, వాళ్ళకి కావలసినది, వాళ్ళు సంపాయించుకోవాలి"

అన్న ఆలోచన లేకుండా, "మీరు కష్టపడకండి – వాళ్ళు కందకుండా జీవితం గడపండి – " అంటూ మనమే వారిని ఆ దార్లో పెడుతున్నాము.

ఆ పిల్లవాడు డబ్బు తగలేసి, ప్రపంచ జ్ఞానశూన్యుడయి ఏకు మేకై, ముల్లుగా, ముళ్ళకంచెగా పెంచిన మన కళ్ళముందే మారిపోవటం చూస్తున్నాం.

అరేబియాలోని ఒక మహారాజుకి కుమార్తె అయిన ఫాతిమా తండ్రి ఇంట్లోంచి తీసుకెళ్ళిన సామాను ఏమిటి?

చాప ఒకటి.

తోలు దిండు ఒకటి.

మట్టి పాత్రలు రెండు.

పిండి విసిరే రాళ్ళు రెండు.

జాడీ ఒకటి.

అధికార పీఠంలో ఇదివరకు కూర్చుని ఉన్నవారు, ఇప్పుడు కూర్చున్నవారు, ఇకముందు అలంకరించబోయేవారు, వీరంతా – మానవజాతికే భూషణమయిన, మునుపు ఎన్నడూ మానవ జాతి చూసివుండని, ఈ మహనీయ వ్యక్తి – నిరాడంబర జీవితం ముందు, చేతులు కట్టుకు, పెదవి కదపకుండా, వారి ఉపదేశాలని ఆలకించి, వాటిని ఆచరణలో పెట్టగలగాలని ప్రార్థిస్తున్నాను.

ఈ వ్యాసపరంపరని చదివినందువల్ల ఏం ప్రయోజనం ? మహాప్రవక్త వంటి మహనీయులు ఉంటారా? సుఖసంపదలు, అధికార దాహం ఒదులుకొని– దేశాన్ని పరిపాలించటం సాధ్యం అవుతుందా?

"మహానుభావుడు కాబట్టి ఆయనకి సాధ్యం అయింది – మా వల్ల

సాధ్యం అవుతుందా?" అంటూ అసాధ్యమయిన దానికి చప్పట్లు చరచి ప్రశంసించాలా?

లేక ఆయనలాగా, "పరాత్పరా, నన్ను బీదవానిగానే ఉంచు" అని ప్రార్థించాలా?

అవును ! ఆ విధంగానే మనిషి మనోవాచా భగవంతుని వేడుకోవాలి.

బీదవానిగా పుట్టాను.

బీదవానిగానే జీవితం గడుపుతున్నాను.

బీదవానిగానే ఆఖరిదాకా ఉండేట్లు చెయ్యి,

మధ్యలో బీదరికం పోయి,

పటాటోపం తల ఎత్తుతూంది.

నాకీ ప్రలోభం నుంచి విముక్తి ప్రసాదించు.

– ఈ విధంగా కొందరైనా ప్రార్థించవలసివుంది. అయితే అలా ప్రార్థిస్తున్నారా? అందుకు లక్షా తొంభై కారణాలు చెబుతుంటారు. ఆకాశం నుంచి అగ్ని జ్వాలలు వారిపై కురిసే కాలం ఎంతో దూరంలో లేదు... దగ్గిరపడుతూనే ఉంది.

★★★

# ఇస్లామ్ – క్రైస్తవములు కూడా భారతీయ మతాలే !

ఇస్లామ్, క్రైస్తవమువంటివి అన్యదేశపు మతమార్గములు అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కాని కొన్ని వేల సంవత్సరాలకు ముందే జీవించిన మన తాత ముత్తాతలకు జీవం ఇచ్చినవి అవి.

ఎట్లా ? అని కనుబొమ్మలు విల్లంబుల్లా వంచి, పైకి ఎగరేసి ప్రశ్నార్థకంగా చూడవచ్చు. దానికి బదులు కళ్ళు ఎగరేసి చూసేకంటే, కళ్ళు కిందకి దించి, కంటికి ముందున్న బైబిల్‌లోని వాక్యాలని శ్రద్ధగా పరిశీలించి చూడమని వేడుకుంటున్నాను.

దేవుడు భూమి మీదకు చూశాడు. ఆ భూమి పాపపంకిలమై, చెడిపోయింది. భూమి పైన మానవులు – దేహలాలస వల్ల తాము పతనమై, ఈ భూమిని భ్రష్టుపట్టించారు.

అప్పుడు దేవుడు నోవాతో అన్నాడు : మనుషుల చెడు ప్రవర్తన మితిమీరిపోతున్నది – ఈ భూమి మీద వారి వల్ల దౌర్జన్యం ఎక్కువయి పోయింది– చూస్తూవుండు. ఈ భూమిని మానవులతో పాటు సర్వనాశనం చేస్తాను.

నువ్వు గోఫర్ చెట్టు చెక్కతో ఒక ఓడ నిర్మించు. దీనిని మూడు అంతస్తులుగా కట్టి, కీలువంటి పదార్థం పొయ్యి.

ఓడని ఈవిధంగా తయారుచెయ్యి, పొడవు మూడు వందల మూరలు, వెడల్పు యాభై మూరలు, ఎత్తు ముప్పైమూరలు ఉండేట్లు నిర్మించు.

నువ్వు తయారుచేసే ఆ ఓడకి మూర పొడవు వెడల్పుతో ఒక కిటికీ పెట్టి, దానికి తలుపు పెట్టు, ఓడ ముందు భాగాన ఒక తలుపు అమర్చు. ఆ తరువాత ఒకటి, రెండు, మూడు అంతస్తులుగా విభజించు.

దేవుడు నోవాతో అన్నాడు : నువ్వూ, నీ ఇంటివారూ వచ్చి ఈ ఓడలో ప్రవేశించండి. ఈ తరం మానవులందరిలో నువ్వు సత్ప్రవర్తన కలవాడివని నాకు తెలుసు.

భూమిపై నున్న పరిశుద్ధమయిన ప్రాణులను, పరిశుభ్రతలేని జంతువులను, వివిధ ప్రాణులను, ఒక్కొక్కటిలో ఆడా - మొగా జోడుగానూ

మరియు ఆకాశంలో ఎగిరే పిట్టలు జంటలు ఆడా -మొగా కోడిపెట్టా పుంజూ, భూమి మీద పాకే సరీసృపాలు - ఈ జాతులన్నీ నశించి పోకుండా ఉండటానికి నీతో తీసుకెళ్ళు.

జలప్రళయం నుంచి తప్పించుకోటానికి దేవుని ఆజ్ఞ ప్రకారం నోవా, అతని భార్య, కొడుకులు, కోడళ్ళు ఓడలో ప్రవేశించారు.

దేవుడు ఆదేశించిన ప్రకారం పరిశుద్ధమయినవీ, కానివీ, మృగాలు, భూమిపై సంచరించే ప్రాణులు అన్నిటినీ ఓడలో ఎక్కించాడు.

ఆడామొగా జోడిజోడిగా ప్రాణులన్నీ నోవాతో పాటు నివసిస్తున్నాయి.

ఏడు రోజులు గడిచిన తరువాత భూమి మీద జల ప్రళయం ఏర్పడింది.

నోవాకు ఆరు వందల సంవత్సరాల వయసు వచ్చిన, ఆ సంవత్సరంలోని రెండో నెలలో, పదిహేడవ రోజున, ఆ రోజున భూమండలం మీదున్న సముద్రాలూ, నదులూ కట్టలు తెంచుకుని పొంగిపొర్లనారంభించాయి, ఆకాశ ద్వారాలన్నీ తెరుచుకుని వర్షం భూమి పైకి దూకటం మొదలుపెట్టింది.

నలభై రోజులపాటు వర్షం ఆగకుండా పగలూ - రాత్రీ కురిసింది.

నలభై రోజులు జలప్రళయం కొనసాగింది. నీటి ప్రవాహపు ఉధృతం పెరిగిపోయింది. జలప్రళయంలో నోవా ఓడ సముద్రమట్టం మీంచి పైకి ఎత్తబడింది.

జలప్రళయం ఉధృతం అయింది. విపరీతం కావొచ్చింది. ఆకాశం కింద, భూమిపైనా ఉన్న చెట్లు, కొండలు, పర్వతాలు, పర్వత శిఖరాలు అన్నీ మునిగిపోయాయి.

పర్వత శిఖరాలకి పైన పదిహేను మూరల ఎత్తున కెరటాలు ఎగిరిపడుతూ, జలప్రవాహం పొంగిపొర్లిపోతున్నది.

అప్పుడు భూమిపై చరిస్తున్న నరమాంసలాలసులు, జంతువులు, పక్షులు, సరీసృపాలు, సకల జీవరాసులు, నరులు, ప్రాణికోటి అంతా పూర్తిగా నిర్మూలనమైపోయింది.

గాలి పీల్చే అన్ని ప్రాణులు, పొడి భూమి మీద ఉన్న జీవచరాలు అన్నీ జలప్రళయంలో నశించిపోయాయి.

ఈ విధంగా నూట యాభై రోజులు జలప్రళయం భూమిని ముంచివేసింది.

అప్పుడు దేవుడు నోవాని, అతనితోపాటు ఉన్న సకల జీవాలని, పశువులని, మృగాలని, పక్షులని జ్ఞాపకం చేసుకుని, భూమిపై గాలులు వీచేటట్లు చేశాడు. అప్పుడు జలప్రవాహం ఉపశమించనారంభించింది.

లోతయిన జల ప్రవాహాలు, ఆకాశంలోని ద్వారబంధాలు అన్నీ అదుపులోకి తేబడినవి. స్వర్గంలోంచి పడుతున్న వర్షధారలు అడ్డగించబడ్డాయి.

భూమిపైనున్న సకల జలం క్రమక్రమంగా వెనక్కి మళ్ళిపోతు॰

ఉంది. నూట యాభై రోజుల అనంతరం నీరు తగ్గుముఖం పట్టింది.

నోవా ఓడ ఏడు నెలల పదిహేడవ రోజున 'అరాక్' అన్న పర్వతంపై స్థిరంగా నిలిచింది.

తరువాత నీటి ప్రవాహం క్రమంగా తగ్గిపోతూ వచ్చింది. పది నెలలు గడిచిన తరువాత మొదటి రోజున పర్వత శిఖరాలు కనబడజొచ్చాయి.

నలభై రోజులు గడిచాయి. నోవా ఓడలోని కిటికీ రెక్క తెరిచి – ఒక కాకిని బయటికి వదిలాడు.

అది బయలుదేరి వెళ్ళి, భూమిపై ఉన్న జలములు ఎండే దాకా ఇటూ అటూ తిరగవలసినదిగా పంపబడింది.

తరువాత భూమి మీద నీరు తగ్గిందో లేదో తెలుసుకోటానికి ఒక పావురాయిని బయటికి వదిలాడు.

కాని అది భూమి మీద పొడి ప్రదేశం ఎక్కడా కానక, జలమయమైన భూమిపై కాళ్ళుమోపే పొడి స్థలం కనిపించక పోవటంచేత, తిరిగి ఓడ దగ్గరకు ఎగిరివచ్చేసింది. నోవా చెయ్యి బయటికి చాచి ఆ పావురాయిని లోనికి తీసుకున్నాడు.

మరో ఏడు రోజులు గడిచాయి. మళ్ళీ పావురాయిని బయటకి వదిలాడు నోవా.

ఆ పావురాయి సాయంకాలం వేళ తిరిగి అతని దగ్గరకు ఎగిరివచ్చింది. దాని నోట్లో పచ్చని ఆలివ్ ఆకు కరచుకుని తీసుకొచ్చింది. అందుచేత నోవా భూమిపైనున్న జలం తగ్గుతుందని తెలుసుకున్నాడు. జల ప్రవాహం వెనక్కి మళ్ళింది.

ఆ తరువాత అతను మరో ఏడు రోజులు ఓడలోనే ఉండి, మళ్ళీ

పావురాయిని బయటకి వదిలాడు. అది వెనక్కి తిరిగి రాలేదు.

అప్పటికి నోవాకి ఆరు వందల ఏళ్ళు నిండి, మొదటి సంవత్సరం, మొదటి నెల, మొదటి రోజున భూమిపైనున్న నీరంతా పూర్తిగా ఎండి పోయింది. అప్పుడు నోవా ఓడపై మూత తీసి బయటికి చూశాడు. భూమి మీద నీరు లేదు.

రెండో నెలలో, ఇరవయ్యో రోజున భూమి ఎండి పొడిగా అయింది.

అప్పుడు దేవుడు నోవాని ఉద్దేశించి :

నువ్వూ నీ భార్యా, కొడుకులు, నీ కోడళ్ళు ఓడ వదిలిపెట్టి బయటకి రండి.

మీతో పాటు ఉన్న ప్రాణమున్న ప్రతి జీవిని తీసుకుని రండి – అనగా పశువులు, కోళ్ళు, మృగములు, పక్షులు, సరీసృపములు అన్నీ మీతో బయటకి తీసుకురండి – అవి జీవించి సంతానాభివృద్ధి చేసి, ఈ భూమిని ఫలప్రదం చేయగలవు...

(బైబిల్ : ప్రథమ భాగం : అధ్యాయం : 7 –8)

క్రమానుగతంగా ఉన్న ఈ మాటల వరుసల్లో కొన్ని సంఘటనలు... ఈ భూమండలానికి సంబంధించిన చరిత్రతో పోల్చి చూడాలి.

నోవా తాత గురించి బైబిల్ చెపుతున్నది – దివ్య ఖుర్ఆన్ కూడా నూహ్ ప్రవక్త అన్న పేరున్న వ్యక్తిని పేర్కొన్నది.

నోవా (నూహ్ ప్రవక్త) కాలంలోనే జలప్రళయం సంభవించి భూమి మునిగిపోయింది.

దీనితో లెమూరియా ఖండం సముద్రంలో మునిగిపోయిందన్న భౌగోళిక సత్యంతో పోల్చి చూడండి.

నోవా తాత జీవించింది – లెమూరియా ఖండంలోనే. ఆ లెమూరియా ఖండం సముద్రగర్భంలో కూరుకుపోయింది.

క్రరతో ఓడని తయారుచేసిన నోవా సమస్త ప్రాణులనీ – ఒక్కొక్క జోడీ చొప్పున పడవలోకి ఎక్కించుకున్నాడు. కొన్ని నెలలు ఆ పడవలోనే నివసించాడు. జలప్రళయం సంభవించడానికి ముందు, ఆ తరువాతనూ పడవ ఒకేచోట కదలకుండా లేదు. ప్రయాణం సాగించింది.

*"ఆ తరువాత ఆ పడవ పర్వతాల వంటి ఎత్తయిన అలల దగ్గరకు వారిని నెమ్మదిగా తీసుకెళ్ళనారంభించింది" –*

– దివ్య ఖుర్ఆన్ – అధ్యాయం – 11 – వచనమ్ – 42

సముద్రంలోకి మునిగిపోయిన లెమూరియా ఖండంలోనిదే భారతదేశమని, ఇప్పటి హిమాలయ, ఆల్ప్స్ పర్వత శ్రేణులూ అందులోని కొంత భాగమనీ, పాలస్తీనా, అరబ్ దేశాలు కూడా సముద్రంలోంచి తేలిన భూభాగాలనీ – భౌగోళిక సత్యాలని ఒప్పుకుని చూడండి.

(నోవా తాత) నూహ్ ప్రవక్త భూమిపై జలప్రళయం ప్రారంభమయినపుడు, లెమూరియా ఖండం నుంచి పడవలో బయలుదేరారు. కొత్తగా లేచిన 'జూదీ' పర్వతం మీదనే ఈ పడవ ఆగింది. అక్కడి నుంచే మానవ జాతి పెరగటం ప్రారంభించింది. ఆ మానవ సంతతిలో ఇబ్రాహీమ్, మూసా, ఈసా (క్రీస్తు), మహాప్రవక్త (సఅసం) ప్రభవించారు. ఆ కారణంగానే వారందరూ లెమూరియా ఖండం ద్వారా మనకి సన్నిహితులయ్యారు. వారి యొక్క మతమూ ప్రబోధములు మనకి సన్నిహితములయ్యాయి.

అదే మాదిరిగా ఈడెన్ తోట లెమూరియా ఖండంలోనే ఉండి ఉండాలి. ఎందుచేతనంటే, భూమధ్య రేఖ వెళ్ళే ఉష్ణఖండాల్లోనే దట్టమయిన

అడవులు ఏర్పడి ఉండాలని భౌగోళిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

అట్లా అయినపుడు ఏడెన్ తోట లెమూరియాలో ఉండి ఉండాలి. ఆది మానవుడయిన ఆదమ్ - హవ్వా (ఆదామ్ - ఇవ్) లెమూరియా ఖండానికి చెందినవారే అని ఒప్పుకున్నపుడు....

బైబిల్‌కు, దివ్య ఖుర్‌ఆన్‌కూ జ్ఞాన సంబంధమైన, ప్రబోధపరమైన పోలిక కనిపిస్తూ ఉంటుంది. బైబిల్ - దివ్య ఖుర్‌ఆన్‌లు పాత కాలానికి చెందిన ఉత్త గాథలు మటుకే కాదు. విజ్ఞాన పరంగా భౌగోళిక మార్పులని వివరించే శాస్త్ర గ్రంథాలని చెప్పాలి.

ఆదేగాక లెమూరియా ఖండానికి చెందిన నూహ్ ప్రవక్త మార్గాన్ని అనుసరించే ఇస్లామీయులూ, క్రైస్తవులూ మన దక్షిణాదికి చెందినవారూ ఒకే శాఖవారన్న విషయం బోధపడుతుంది.

అది ఒక్కటే కాదు, బైబిల్‌లోని 'అబ్బా (ABBA) అన్న మాట తండ్రిని పిలిచే మాటగా గుర్తింపబడింది. ఇలాగే అనేకమైన ఇతర మాటలు ఈ విధంగానే ఉన్నట్లు మనం చూడవచ్చు.

ఈ సత్యాలను గురించి హృదయపు లోతుకెళ్ళి ఆలోచించినట్లయితే, ఇస్లామ్, క్రీస్తు మతమన్నవి అన్య మతాలు కావు - మనకి చెందినవే - అన్న విశాలభావమూ, విశాల దృక్పథమూ ఏర్పడి తేజోరూపమయిన మహదానందము కలుగుతుంది.

★★★

# ఇస్లామ్ మరియు మహిళలు

ఇస్లామ్ మరియు ముస్లిమ్‌ల గురించి అనేక అపోహలు ఉన్నాయి. వాటిలో ముస్లిమ్ స్త్రీలను గురించిన అపోహలు మరికొన్ని.

ఇస్లామ్ ఆవిర్భావానికి ముందు సాధారణంగా ప్రతి సమాజం, ప్రతి వ్యవస్థలో స్త్రీని అధమంగా చూచేవారు. ఆమెను అవమానపరిచేవారు. ఆమెపై రకరకాల దౌర్జన్యాలు జరిగేవి.

హిందూ సమాజంలో, భర్త చనిపోతే అతనితో పాటు భార్య కూడా చితిపై కాలిపోవలసివచ్చేది.

చైనాలో స్త్రీ కాలికి బిగువయిన ఇనుప బూట్లు తొడిగించబడేవి (చిన్న కాళ్ళు అందమయినవిగా భావించి వాటి పెరుగుదలను అరికట్టడానికి).

అరబ్బులో బాలికలను సజీవంగా పాతిపెట్టేవారు.

ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా ధ్వజమెత్తిన సంస్కర్తలు ఈ మధ్య కాలంలోనే ప్రభవించారన్నదానికి చరిత్రే సాక్ష్యం. కాని ఈ యావత్తు సంస్కర్తలకంటే శతాబ్దాలకు ముందు అరబ్ భూభాగంలో ప్రవక్త (సఅసం) అతివల యెడల మహోపకారిగా ప్రభవించారు - కోమలాంగులపై జరిగే దౌర్జన్యాలను అంతమొందించారు.

స్త్రీ హక్కులేవో తెలీని అరబ్ సమాజంలో ప్రవక్త మహనీయులు, స్త్రీకి పురుషునితో పాటు సమాన స్థాయిని కల్పించారు. నాడు స్త్రీకి ఆస్తిపాస్తుల్లో ఎలాంటి హక్కు ఉండేది కాదు. ప్రవక్త మహనీయులు ఆమెకు వారసత్వపు హక్కును నిర్ణయించారు. స్త్రీ హక్కుల్ని ప్రకటిస్తూ దివ్య ఖుర్‌ఆన్‌లో ఆజ్ఞలు వచ్చాయి.

తల్లిదండ్రులు తదితర బంధువుల ఆస్తిపాస్తుల్లో స్త్రీలను కూడా వారసులుగా నిర్ణయించడమయింది. నేడు నాగరికత గురించి గొంతెత్తి ఘోషించే అనేక దేశాలలో స్త్రీకి ఆస్తి హక్కుగాని, ఓటు హక్కుగానీ లేదు. ఇంగ్లండులో స్త్రీకి ఓటు హక్కు 1928లో ప్రప్రథమంగా ఇవ్వబడింది. హిందూ సమాజంలో స్త్రీకి ఆస్తి హక్కు మొన్నమొన్ననే ప్రాప్తమయింది. (అదీ అన్ని చోట్లాకాదు !).

అయితే నేటికి 14 వందల ఏండ్ల క్రితమే ఈ హక్కులన్నింటినీ స్త్రీలకి వర్తింపజేసిన మహనీయ ముహమ్మద్ (సఅసం) ఎంత గొప్ప మహోపకారి !

ఆయన (సఅసం) తన బోధనల్లో స్త్రీల హక్కుల విషయమయి నొక్కి చెప్పారు - స్త్రీల పట్ల పురుషులు తమ బాధ్యతను విస్మరించరాదని, న్యాయసమ్మతంగా స్త్రీల హక్కులను నెరవేర్చాలని నాయక శిఖామణి తన అనుయాయులకు తాకీదు చేశారు. స్త్రీలను కొట్టరాదని ఆయన హితబోధ చేశారు.

స్త్రీల పట్ల ఏవిధంగా ప్రవర్తించాలి అనే విషయంలో ఆయన (సఅసం) ప్రవచనాలను గమనించండి :

(1) తన భార్యను కొట్టేవాడు మంచి నడతగలవాడు కాడు.

(2) మీలో ఎవరయితే తన భార్య పట్ల ఉత్తమంగా ప్రవర్తిస్తాడో అతడే అత్యుత్తమ వ్యక్తి.

(3) స్త్రీలతో శ్రేష్ఠమయిన రీతిలో ప్రవర్తించమని దైవాజ్ఞకలదు. ఎందుకంటే వారు మీ తల్లులు, మీ చెల్లెళ్ళు, మీ కూతుళ్ళు.

(4) తల్లి పాదాల క్రింద స్వర్గముంది.

(5) ఏ ముస్లిమూ తన భార్యను అసహ్యించుకోరాదు. ఒకవేళ ఆమెలో ఏదైనా ఒక లోపం ఉంటే, ఆమెలోని మరో ఉన్నత గుణాన్ని చూచి భర్త సంతోషించాలి.

(6) భార్యను బానిసలాగా చూడకండి. ఆమెను హింసించకండి.

(7) మీరు తింటే మీ భార్యల్ని కూడా తినిపించండి. మీరు తొడిగితే, మీ భార్యల్ని కూడా తొడిగించండి.

(8) భార్యను దెప్పిపొడవకండి. ఆమె ముఖంపై కొట్టకండి. ఆమె మనసును నొప్పించకండి. ఆమెను వదిలి వెళ్ళిపోకండి.

(9) భార్య తన భర్త స్థానాన సర్వాధికారాలుగల రాణి.

(10) తమ భార్యల పట్ల మంచి ప్రవర్తన చూపేవారే మీలో మంచివారు.

ఇన్ని హక్కులను ప్రసాదించి స్త్రీని విచ్చలవిడిగా వదిలిపెట్టలేదు. ఆమెని కొన్ని విధుల పరిధులకు బద్ధురాలుగా చెయ్యడం జరిగింది.

1. భర్త తనను చూడగానే సంతోషపడేలాంటి సద్వర్తన కలిగి ఉండాలి, భర్త ఆదేశిస్తే దాన్ని నిర్వర్తించాలి. భర్త దూరాన ఉంటే అతని సంపత్తిని మరియు తన శీలాన్ని పరిరక్షించుకోవాలి - ఇలాంటి స్త్రీయే ఉత్తమమయిన భార్య అనబడుతుంది.

2. ఉత్తమ నడవడికగల భార్య లభించడం అనుపమ సంపదకు సమానం.

3. రోజూ 5 పూటలు నమాజ్ చేసి, రమజాన్ మాసంలో రోజా (ఉపవాసం) వ్రతం పాటించి, తన భర్త ఆజ్ఞల్ని నిర్వర్తించి, తన శీలాన్ని పరిరక్షించుకున్న స్త్రీ, తాను కోరిన ద్వారంగుండా స్వర్గంలోకి ప్రవేశించవచ్చు.

4. ప్రపంచంలోని యావత్తు సంపదలలోకెల్లా విలువైనది, సద్గుణవతి,

సౌశీల్యవతి అయిన భార్య.

ఈ విధంగా మహాప్రవక్త(సఅసం) స్త్రీకి హక్కుల్ని ఇవ్వడంతో పాటు, ఆమె విధులను కూడా గుర్తుచేశారు.

స్త్రీలకి ఇన్ని హక్కుల్ని ప్రసాదించిన ఇస్లామ్‌లో బహు భార్యాత్వానికి అనుమతి ఎందుకు ఇవ్వబడింది ? ఇది స్త్రీలపై దౌర్జన్యం కాదా ? అన్నది ఓ ఆక్షేపణ.

ఈ విషయంలో మనం పురుషుని నైజాన్ని, జీవితంలో ఎదురయ్యే క్రియాత్మక సమస్యల్ని దృష్టిలో ఉంచుకోవాలి.

భారత దేశపు దశరథ మహారాజుకు అనేక మంది భార్యలుండేవారు. మనం శ్రీకృష్ణుణ్ణి రుక్మిణి, సత్యభామ, రాధలే కాకుండా అసంఖ్యాక గోపికల మధ్య చూస్తున్నాము... 'వల్లీ' మహిళలతో మురుగన్‌లాంటి దేవత గడపటం మనం చూస్తున్నాము. ఇవయితే ప్రాచీన కాలంనాటి, పురాణాల సంగతి. ఇప్పుడు చారిత్రక విషయాలను తీసుకోండి – పెద్ద పెద్ద రాజుల వద్ద అనేక భార్యలుండేవారు.

తమిళనాడులోని కట్టబ్రాహ్మణునికి అనేకమంది భార్యలు.

నేటికీ కొందరు రాజకీయ నాయకులు అనేక భార్యలు కలిగి ఉన్నారు.

ఇస్లామ్ ఆవిర్భవించక ముందు అరబ్బులో భార్యల సంఖ్యపై ఆంక్ష ఏదీ ఉండేది కాదు. మహా ప్రవక్త (సఅసం) పురుషుని మనస్తత్వాన్ని, అతని అవసరాలను దృష్టిలో ఉంచుకుని, హద్దూపద్దూ లేని ఈ 'సంఖ్య'ను 'నాలుగు'కు కుదించారు.

ఇస్లామ్ ఆవిర్భవించక పూర్వం అరబ్బు ప్రపంచంలో వివాహానికి

సంబంధించిన ప్రత్యేక నియమం ఏదీ ఉండేది కాదు. పురుషుడు తన ఇష్టానుసారం ఎంతమంది భార్యలను, ఉంపుడుకత్తెలను ఉంచుకునే సంప్రదాయం ఆనాడు సర్వసాధారణం. విడాకులను గురించి కూడా ప్రత్యేక నియమం, ఆంక్ష అంటూ ఏదీ లేదు. పురుషుడు తాను తలచినప్పుడల్లా విడాకులిచ్చేవాడు. ఈ నికృష్ట పరిస్థితుల్ని సంస్కరించటానికి దైవం తరఫున ఆజ్ఞలు వచ్చాయి. పరిమిత సంఖ్యలోనే పెండ్లిండ్ల అనుమతినివ్వబడింది. విడాకుల విషయంలో సముచితమైన నియమాలు, నిబంధనలకు కట్టుబడివుండవలసినదిగా ఆజ్ఞాపించడం జరిగింది.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఉంది :

*"అనాధలకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసిగాని, ముగ్గురేసిగాని, నలుగురేసిగాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే సంశయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి. లేదా మీ స్వాధీనంలోకి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. అన్యాయానికి దూరంగా ఉండేందుకు ఇది అత్యుత్తమ మార్గం."*

(నిసా - 3)

ఈ బోధనల్లో దాగివున్న వివేచనలను గూర్చి ఆలోచించండి : భార్యపట్ల న్యాయంగా వ్యవహరించాలి. బహుభార్యాత్వపు అనుమతి కూడా ఉంది. అయితే దానితో పాటు వారి మధ్య అన్యాయం జరగకుండా చూడాలన్న తాకీదు కూడా ఉంది. న్యాయం చేకూర్చటం సాధ్యపడదన్న సంశయముంటే ఒక వివాహంతోనే సంతృప్తిపడాలని గట్టిగా చెప్పబడింది.

పురుషునికి ఏ సమయంలోనయినా తన లైంగిక వాంఛను తీర్చుకోవలసిన అవసరం ఆసన్నం కావచ్చు. కనుక ప్రకృతి అతనికి అన్ని

అవస్థల్లోనూ లైంగిక కోర్కెలకు అర్హునిగా చేసింది. కాని స్త్రీల స్థితి ఇందుకు భిన్నమయింది.

రుతుస్రావం జరిగే రోజుల్లో గర్భవతిగా ఉన్నప్పుడు (9, 10 మాసాలు) ప్రసవించిన తరువాత కొంతకాలంపాటు స్త్రీ తన భర్తతో దాంపత్య జీవితం గడపజాలదు.

అందరు పురుషులూ అత్యంత సహనంతో ఉంటారని, తమ భార్యలు దాంపత్య జీవితానికి అర్హులయ్యే వరకూ ఆవేశాన్ని అదుపులో ఉంచుకుంటారని ఆశించటం సరయింది కాదు. ధర్మసమ్మతమయిన మార్గంలోనే పురుషుడు తన కోర్కెల్ని తీర్చుకోగలిగేలా అతనికై ద్వారాలు తెరచి ఉంచటం అవసరం. ధర్మసమ్మతంకాని మార్గంలో పోవడం తప్ప గత్యంతరం లేదన్న సంకట స్థితిలో అతన్ని పడనివ్వకూడదు. అలా ఉంటే అతనికి భార్య అయితే ఒకటే కాని ప్రియురాళ్ళు అనేక మంది తయారవుతారు. అదే జరిగితే సమాజంలో వ్యాపించే నైచ్యం, దిగజారిపొయ్యే నైతికత గురించి ఊహించటం మీకు కష్టమేమీ కాదు.

వ్యభిచారాన్ని నిషేధించి, బహు భార్యాత్వాన్ని చట్టబద్ధం చేసిన పవిత్ర ధర్మం ఇస్లామ్ ధర్మమే. ఒకటికంటే ఎక్కువ వివాహాలను కొన్ని ఆంక్షలతో అనుమతించి స్త్రీ – పురుషుల శారీరక నిర్మాణం, వారి మనస్తత్వాలు, వారి అవసరాలకు పూర్తి న్యాయం చేకూర్చింది ఇస్లామ్. ఈ విధంగా ఇస్లామ్ మన ముందు ఒక సశాస్త్రీయమయిన ధర్మంగా నిరూపితమవుతోంది.

★★★

# కమ్యూనిజంకంటే ఉన్నతమైన వ్యవస్థ

పెట్టుబడిదారీ వ్యవస్థ వెన్నెముకను విరిచే సిద్ధాంతాలు రెండు - ఒకటి కమ్యూనిజం, రెండోది ఇస్లామ్.

ఇక్కడి (భారతదేశంలోని) కమ్యూనిస్టుల్లో కొద్దిమంది మాత్రమే 'దాస్ కాపిటల్' (DAS CAPITAL) ను లోతుగా అధ్యయనం చేసి ఉంటారు. మార్క్స్ సిద్ధాంతాలలో 'మిగులు విలువ' (SURPLUS VALUE) అన్నదొక్కటి. ఈ సూత్రాన్ని మార్క్స్ మూడు గ్రంథాల్లో విశదీకరించాడు.

పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడతాడు. శ్రామికుడు తన శ్రమతో ఆ పెట్టుబడికి లాభం చేకూరుస్తాడు. ఈ లాభం అసలు మూలధనం కంటే అధికంగా ఉంటుంది. ఈ అధికాదాయంతో పెట్టుబడిదారుడు మరో ఫ్యాక్టరీ స్థాపనకు పూనుకుంటాడు. ఈ విధంగా అతడు సామాన్యుల్ని దోచుకుంటాడు - ఇదీ కమ్యూనిజం వాదన, ఈ స్థితిలో కమ్యూనిజం రంగప్రవేశం చేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు అసలు బలమైన ఈ 'మిగులు విలువ' ను అంత మొందించగోర్తుంది. అది పెట్టుబడిదారీ వ్యవస్థను తుదముట్టించి ఉత్పత్తి సాధనాలన్నింటినీ జాతీయం చేసుకుంటుంది.

పరిశ్రమలను జాతీయం చేయడంవల్ల సమస్య పరిష్కృతమవుతుందా? అన్నది ఆలోచించవలసిన విషయం. జాతీయం చేయబడిన పరిశ్రమల

నుండి కూడా మిగులు విలువ ఉత్పన్నమవుతుంది. ఈ లాభాన్ని ఎటు తరలించాలన్నది ప్రశ్న. నేడు ఆచరణాత్మకంగా ఈ లాభం ఏమవుతుంది అన్నదాన్ని కూడా చూడాలి.

ముందు పరిశ్రమలు జాతీయం చేయబడుతాయి. వాటినుండి వచ్చే లాభంలో కొంత భాగం కార్మికులకు ఇవ్వబడుతుంది, మిగతా ప్రజలకు ఏమీ లేదు.

ఏదయినా పరిశ్రమ వల్ల వచ్చే లాభంలో కేవలం ఆ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు మాత్రమే భాగం లభిస్తుంది. ఇతర రంగాల్లో పనిచేసే శ్రామికులు, ఇంకా దేశంలోని నిరుపేదలు, నిరాధార జీవులకు ఇందులో ఎలాంటి వాటా లేదన్న మాట. జాతీయకరణ యొక్క ఉద్దేశ్యం ఇది కారాదు. లాభం అన్నది యావత్తు జాతి ప్రజకు పంపిణీ కావాలి.

కమ్యూనిస్టు ప్రభుత్వం శాసన దండంతో ఈ లాభాన్ని ఒకరి నుండి లాక్కొని మరొకరికి ఇస్తుంది. దీనికి భిన్నంగా ఇస్లామ్‌లో, మిగులు విలువ (SURPLUS VALUE) ను – దానికర్తలయిన వారందరికీ పంచేందుకు ప్రేరేపింపజెయ్యడం జరుగుతుంది. దాని గురించి ఉపదేశించబడింది కూడా. ఇస్లామ్‌లో ఈ పంపిణీ వెనుక ప్రేరక శక్తి ప్రభుత్వపు ఒత్తిడి కాదు – విశ్వాసబలం అయి ఉంటుంది.

కమ్యూనిస్టు దేశాల్లో పరిశ్రమల్ని మాత్రమే జాతీయం చేయడం జరుగుతుంది. ఆదాయం పంపిణీ అయ్యేదేదో ఆ పరిశ్రమల్లోనే అవుతుంది. ఇక వ్యక్తుల అధీనంలోనున్న ఆస్తిపాస్తులపై వచ్చే లాభాల పంపిణీకి సంబంధించిన భావన లేనేలేదు. ఆచరణాత్మకంగా కూడా అలాంటి ఏర్పాటేదీ ఉన్నట్లు కానరాదు. కాని ఇస్లామ్, వ్యక్తుల ఆదాయంలోని 'మిగులు విలువ'ను కూడా సమాజంలోని ఇతరులపై వెచ్చించాలని తాకీదు చేస్తోంది. మిగులు

విలువలో నుండే ఒక భాగం తీసి సత్కార్యాలకై ఖర్చు చేయడాన్ని జకాత్ అనంటుంది ఇస్లామ్. అరబీ భాషలో 'జకాత్' అంటే పరిశుద్ధపరచుట అని అర్థం. వ్యక్తులు తమ ఆదాయంలోని ఒక భాగాన్ని ఇతరుల కోసం ఖర్చుచేయడమే జకాత్. అంటే జకాత్ ఇచ్చి మనిషి తన ధన సంపత్తిని పరిశుద్ధపరచుకుంటాడన్న మాట. అలా చేయకపోతే అతని యావత్తు ధనసంపద అశుద్ధమైనదవుతుంది. ఇంతటి ఉన్నతమైన బోధన, శిక్షణలు ప్రపంచంలో కేవలం ఇస్లామ్ మాత్రమే ఇచ్చింది. ధనంలో నుండి కొంత భాగం మంచి పనులకై ఖర్చుపెట్టే ప్రబోధనలైతే ఆ మతం యొక్క సిఫారసులు మాత్రమే కదా, ధనవంతుడెవడైనా మోసగించదలిస్తే అతన్ని దాన్నుండి వారించేదెలా? అని ఎవరయినా ఆక్షేపించవచ్చు.

అయితే ఈ ఆక్షేపణకు సమాధానం మనకు చరిత్రలో లభిస్తుంది. జకాత్ ఇవ్వడానికి నిరాకరించినవారికి వ్యతిరేకంగా ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజిఅన్) కరవాలం చేబూనారు. నిజానికి నాడు జకాత్‌ను తిరస్కరించినవారు బాహ్యంలో ముస్లిమ్‌లే. ఇస్లామ్ ధర్మావలంబీకులే, విశ్వాసులు, మహనీయ ముహమ్మద్(సఅసం) అనుయాయులు, నమాజ్‌ను ఆచరించేవారయిన ముస్లిములకు వ్యతిరేకంగా ఈ కరవాలం ఝుళిపించబడింది. వారు ఏ నేరానికి (జకాత్‌ను ఎగ్గొట్టే) పాల్పడ్డారో అది అంత కఠినమయిందన్నమాట. దైవాన్ని విశ్వసించిన తరువాత ఇస్లామ్ ఒక వ్యక్తిపై విధిగామోపే బాధ్యత, చాలా గట్టిగా తాకీదు చేసే విషయం - జకాత్. అంటే తన ఆదాయంలో నుండి ఒక నిర్ణీత భాగాన్ని తీసి తన తోటి బలహీన సోదరులకు సహాయం చేయటం అన్నమాట.

ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే, వ్యక్తి తన సొంత ఆదాయం మరియు సొంత పెట్టుబడిలో నుండి ఇతరుల కోసం ఖర్చు చేయమని

కమ్యూనిజం బోధించదు. అయితే ఇస్లామ్ ఈ విషయమై గట్టిగా తాకీదు చేస్తుంది – ఇటువంటి ఖర్చు తప్పక చెయ్యాలని కోరుతుంది. ఈ ఖర్చును ఎవరయినా చెయ్యకపోతే (అతడు ముస్లిమ్ అయినప్పటికీ) ఇస్లామ్ అతనికి వ్యతిరేకంగా ధ్వజమెత్తుతుంది. అందుకే ఇస్లామ్ కమ్యూనిజం కంటే ఉన్నతమయినది, శ్రేష్ఠమయినది –

సాధారణంగా పెట్టుబడి పెట్టే ప్రతి వ్యక్తి తన ఈ ధనం తన సొంత సుఖభోగాలకని భావిస్తాడు. తన ఆదాయాన్ని ఇతరుల కోసం ఖర్చు చేయడం స్వయంగా లేమిని కొనితెచ్చుకోవడమేనని కూడా అతడు తలుస్తాడు. ఈ సంశయమే ప్రజల్ని సాధారణంగా సంకటపెడుతుంది.

ఇస్లామ్ అన్నిటికంటే ముందు ఈ భావనను వ్రేళ్ళతో సహా పెకలించి పారేస్తుంది. ఇతరులపై ఖర్చు చేయటం వల్ల సంపద తరగదు – పెరుగుతుంది అని దివ్య ఖుర్ఆన్ చాటిచెబుతోంది :

> "దారిద్ర్య ప్రమాదం చూపి షైతాన్ మిమ్మల్ని భయపెడతాడు, నీతిబాహ్యమైన, నీచమయిన మార్గం అవలంబించమని ప్రేరేపిస్తాడు; కాని మిమ్మల్ని క్షమిస్తానని, కరుణిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ అత్యంత ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు."
>
> (బఖర – 268)

పిసినారితనం అంటే ఏమిటి? తన కోసం, తన భార్యాపిల్లల కోసం, లోటి సమాజంలోని వారి అవసరాల కోసం ఖర్చు చేయడానికి బదులు ఒక్కొక్క పైసను కూడబెట్టడమే పిసినిగొట్టుతనం.

తమిళ సినీ పరిశ్రమలో ఒక ప్రసిద్ధ గాయకుడుండేవాడు. అతను అత్యంత పిసినారి. తన కొడుకు కాలికి గాయమయితే వైద్య చికిత్స

చేయించడానికి కూడా అతను వెనుకంజవేశాడు. పర్యవసానంగా అతని పుత్రుడు చనిపోయాడు. ఇదీ పీనాసితనానికి ప్రతిఫలం ! ఇలాంటి పిసినారితనాన్ని, సంకుచిత హృదయాన్ని ఇస్లామ్ గట్టిగా వ్యతిరేకిస్తుంది.

ఇస్లామ్ ఇతరులకై ఖర్చు చేసేందుకు కేవలం ఉపదేశాలు మాత్రమే ఇవ్వలేదు. దాంతోపాటు ఖర్చు చెయ్యాల్సిన నియమాలను, పద్ధతులను కూడా అది నేర్పింది. కొంతమంది ఖర్చు చేస్తారుగాని ఇతరులను దెప్పిపొడవడం, ఉపకారంచేసి తమ ప్రతిష్టను పెంచుకోవటం వారి ఆశయమయి ఉంటుంది. ఇవి, ఇంకా ఇలాంటి ఇతర ఉద్దేశ్యాలు ధర్మబద్ధంకావని ఇస్లామ్ చెపుతుంది. దానం చెయ్యడం ధార్మికమయిన విధి అని, ఇది నమాజ్ తరువాత రెండో పెద్ద అంశమని ఇస్లామ్ చెపుతుంది. తోటివారికై ఖర్చు చేసి దైవ ప్రసన్నతను బడయటం తప్ప మరే ఉద్దేశ్యం దానధర్మాలకు ఉండరాదన్నది ఖుర్ఆన్ ఉపదేశం.

నేనొక చోట చూశాను - ఒకాయన ఓ సంస్థకు ట్యూబ్‌లైట్‌ను విరాళంగా ఇస్తూ, దానిపై తన పేరును వ్రాయించారు. ఎంత ఘోరంగా రాయించారంటే - ఆ లైటు వెలుగు అసలు బయటికే రాలేదు. ఇలాంటి దానధర్మం, ఇటువంటి సహాయం కేవలం తప్పు మాత్రమే కాదు, అది అతని సకల సత్కార్యాల ప్రతిఫలాలను నాశనం చేసివేస్తుందని ఇస్లామ్ హెచ్చరిస్తోంది. కొంతమంది ధన సహాయమో లేక వేరే ఏదయినా సహాయమో చేస్తారు కాని తమ పెత్తనాన్ని సహాయం పొందిన వ్యక్తిపై రుద్దుతారు. తత్ఫలితంగా సహాయం పొందిన ఆ వ్యక్తి మనసు గాయపడుతుంది. ఈ పోకడలన్నీ అధర్మమయినవని ఇస్లామ్ ఉద్ఘాటిస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో ఉంది :

> *మనసు గాయపరచే దానం కంటే, మృదుభాష్యం, క్షమాబుద్ధి ఎంతో మేలయినవి."* (అల్ బఖర - 263)

వినోబాభావే భూదాన ఉద్యమం నడిపినప్పుడు కొంధరు సారవంత మయిన భూముల్ని కూడా దానం చేసినవారున్నారు. కాని చాలా మంది భూస్వాములు బంజరు భూములు, రాళ్ళు-రప్పలు నిండిన భూముల్నే దానరి చేశారు.

తమ ఇంట్లోని చినిగిపోయిన దుస్తుల్ని, చద్ది అన్నాన్ని, విరిగిపోయిన, పగిలిపోయిన సామాన్లను ఇతరులకు దానం చేసే దాతలు కూడా కానవస్తారు. చినిగిపోయిన నోట్లను, చెల్లని నాణాలను దానం చేసేవారూ ప్రపంచంలో వున్నారు. కాని ఇస్లామ్, మీ వద్ద ఉండే మంచి వస్తువుల్ని దానం చేయమని ప్రబోధిస్తోంది, దానం చెయ్యదలిస్తే - మీరు ఇష్టపడే దుస్తులు స్వయంగా మీరు తినే పదార్థాలు, మీకు ప్రియమైన సంపద - వీటన్నిటినీ అల్లాహ్ మార్గంలో ఖర్చు చెయ్యమని తాకీదు చేస్తోంది ఇస్లామ్. మీరు సంపాయించేదాన్లో అన్నింటికంటే మంచి వస్తువును దేవుని బాటలో ఖర్చుపెట్టాలి. ఇదీ ఇస్లామ్ ఉద్బోధన. ఖుర్‌ఆన్‌లో ఇలా వుంది :

> *"విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు సంపాయించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసినదానిలోని మేలయిన భాగాన్ని దైవ మార్గంలో ఖర్చు పెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వడానికి పనికిరాని వస్తువుల్ని ఏరి తీసే ప్రయత్నం చెయ్యకండి."*
>
> (బఖర-267)

మీరు ఇతరులకు చేసే అన్నదానమయినా, దుస్తులయినా లేక ధనసహాయమైనా - వీటిని రహస్యంగా ఇవ్వడం ఉత్తమ విధానమని ఇస్లామ్ ప్రకటిస్తోంది. అయితే బహిర్గతంగా సహాయం చెయ్యాల్సిన అవసరం లేక స్థితి ఏర్పడితే అలా చెయ్యవచ్చు. దివ్యఖుర్‌ఆన్ ఉపదేశమిది :

"మీరు మీ దానధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే. కాని రహస్యంగా నిరుపేదలకు దానమివ్వటం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది." (2:271)

దానధర్మాల విషయంలో, ఎవరయినా ఒక త్రాగుబోతు లేక డబ్బును అనవసరంగా ఖర్చుపెట్టేవాడు మీ వద్దకు వచ్చి సహాయం అర్థించే పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మీరేం చేస్తారు? ఒక వేళ అలాంటి వారికి సహాయం చేస్తే అదేమవుతుంది? ఈ ప్రశ్నలకు కూడా జవాబిచ్చింది ఇస్లామ్. దుర్మార్గులకు, వ్యర్థప్రలాపనలకు పాల్పడేవారికి డబ్బు సహాయం ఇవ్వరాదన్నది ఇస్లామ్ ఉపదేశం. అయితే తిండి, దుస్తుల ఏర్పాటు చెయ్యవచ్చు. దివ్యఖుర్ఆన్‌లో ఉంది :

"అల్లాహ్ మీ కొరకు ఏ సొమ్మునయితే జీవనాధారంగా చేశాడో, దాన్ని అవివేకులకు అప్పగించకండి. అయితే దాన్నుండి వారి అన్న వస్త్రాలకు ఇవ్వండి, ఇంకా వారికి హితబోధ చేయండి.".

(అన్నిసా-5)

ఇలాంటివారి తిండి, బట్ట వంటి కనీసావసరాల ఏర్పాటు పూర్తయ్యాక, ఇక ఈ విషయంలో ఇస్లామ్ ఇచ్చే మార్గదర్శక సూత్రాలేమిటో చూడండి:

1. మీ కోసం, మీ భార్యాపిల్లల కోసం ఖర్చుచేయగా మిగిలిన సొమ్మును అల్లాహ్ మార్గంలో ఖర్చు చెయ్యండి.
2. మీ శక్తి స్థోమతలకు మించి ఖర్చు చేయకండి. అలా అని పిసినారులుగా కూడా వ్యవహరించకండి. మీ వైఖరి మధ్యేమార్గాన్ని అనుసరించేదిగా వుండాలి.
3. దానధర్మాల విషయంలో మీ హస్తాన్ని మరీ అంత బిగించి వుంచకండి. అలా అని మరీ అంత విస్తృతంగా కూడా ఇచ్చేయకండి. అలా అతిగా

దానం చేసేస్తే స్వయంగా మీరే ఇతరుల సహాయాన్ని కోరాల్సిన అగత్యం ఏర్పడవచ్చు.

4. మీ సమీప బంధువులు, నిరాధారులు, నిరుపేదలు, అనాధలు, బాటసారులు మీ సహాయం పొందటానికి అర్హులు.

తమ సొమ్ముపై జకాత్ చెల్లించడం ముస్లిమ్‌ల విధి. ఈ విధిని విస్మరించినవారికి కఠిన శిక్ష ఉంది. ఒకసారి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బంగారు గాజులను తొడిగిన ఓ స్త్రీని చూశారు, వీటికి జకాత్ చెల్లిస్తున్నావా? అని ఆయన (సఅసం) అడిగారు. 'లేదు' అన్నదా మహిళ. మహాప్రవక్త అన్నారు : "తీర్పుదినాన నీకు అగ్ని గాజులు తొడిగించ బడుతాయి." (అది విని ఆ మహిళ బంగారు గాజుల్ని దానం చేసేసింది).

జకాత్ పైకం ఎలాంటివారికి ఇవ్వాలి అన్నదాన్ని గూర్చి కూడా ఖుర్‌ఆన్ స్పష్టంగా ప్రకటించింది. బీదసాదలకు, నిరాధార జీవులకు, రుణ గ్రస్తులకు, అనాధలు మరియు బాటసారులకు సహాయం చేయడంతో పాటు మంచి వైపుకు ముందంజవేసేవారిని ప్రోత్సహించడానికి, బానిసలకు విముక్తిని కలిగించడానికి కూడా జకాత్ ధనాన్ని ఉపయోగించవచ్చు. అదీగాక, జకాత్ ధనాన్ని వసూలు చేసే కార్యంలో నిమగ్నమై ఉన్నవారికి కూడా ఆ మొత్తంలో నుండి భృతిని ఇవ్వవచ్చు. జకాత్‌ను ఖర్చుచేసే, పద్దుల్లో దైవమార్గం అన్న పద్దు కూడా ఉంది. 'దైవ మార్గంలో ఖర్చు' అనేది భావపరంగా చాలా విస్తృతమయిన అర్థాన్ని ఇస్తుంది. సత్కార్యాలన్నీ 'దైవమార్గం' పద్దులోకే వస్తాయి. ముఖ్యంగా ధర్మప్రచారం, ధర్మోన్నతికై జరిపే వైఖరిలో కార్యకలాపాలు 'దైవమార్గం'లోకే వస్తాయి.

తల్లిదండ్రులు, సంతానం మొదలగువారు ఒక వ్యక్తి పోషణలో ఉన్నప్పుడు అతనిచే జకాత్ ధనానికి వారు అర్హులు కాజాలరు. జకాత్

ధనమయితే ఇతరుల కోసమే కేటాయించబడుతుంది.

సాధ్యమయినంతవరకు అడగటం లేక యాచించటం నుండి తమను కాపాడుకోండి అనేది ఇస్లామ్ ప్రబోధనల్లో మరో అంశం. మనిషి వీలయి నంతవరకు ఇవ్వడానికి, ఇప్పించడానికి ప్రయత్నించాలిగాని పుచ్చుకోవడానికి కాదు. ఒకరి ముందు దేహి అని చేయి చాచడం కంటే కట్టెలు కొట్టి ఆ డబ్బుతో గడపడం ఎంతో ఉత్తమం అని మహాప్రవక్త(సఅసం) ప్రవచించారు.

ఒకసారి మహాప్రవక్త ఓ పల్లెటూరి వ్యక్తిని దగ్గరకు పిలిచి అతని చేతుల్ని ముద్దు పెట్టుకున్నారు. అతని చేతులు కాయలు కాసాయి. అతను బ్రతుకుతెరువు కోసం కూలి పని చేసేవాడు. కనుక మహనీయ ముహమ్మద్ సంతోషంతో అతని అరచేతుల్ని ముద్దాడారు.

ఒకవైపు, యాచించటాన్ని అరికడితే మరోవైపు, మనస్ఫూర్తిగా ఇతరులకు సహాయం చెయ్యమని ఆజ్ఞాపిస్తుంది. దీన్నిబట్టి ఇస్లామ్ ప్రబోధనల్లో ఎంతో గొప్ప సమతూలనం ఉన్నట్లు మనకు తెలుస్తోంది.

★ ★ ★

# సందేహాలు – సమాధానాలు

('నేను ఆరాధించే ఇస్లామ్'ను చదివి కొందరు పాఠకులు కొన్ని ఆక్షేపణలు చేశారు. కొన్ని ప్రశ్నలు వేశారు. ఆ ప్రశ్నలను, ఆక్షేపణలను, వాటికి రచయిత ఇచ్చిన సమాధానాలను మేమిక్కడ పొందుపరుస్తున్నాము).

ఒక ముస్లిమేతర సోదరుడు ఇలా ప్రశ్నిస్తున్నాడు :

"ముస్లిమ్ దేశాలు పరస్పరం పోరాడుకోవడాన్ని మనం చూస్తూనే ఉన్నాం. నిజానికి వారు ఇస్లామ్‌ను అనుసరించేవారే. మరి (మీరు) ఇస్లామ్‌ను ప్రేమించడంలోగల ఉద్దేశ్యం?"

ఈ ప్రశ్నకు బదులిస్తూ శ్రీ అడియార్, "నా అభిప్రాయంలో ప్రేమ ప్రేమే. ముస్లిములు ఏం చేస్తున్నారు ? అనే విషయంతో దీనికెలాంటి సంబంధం లేదు. ముస్లిమ్‌లలోని లోటుపాట్లను చూచి నేను ఇస్లామ్‌ను ప్రశంసించకుండా ఉండను."

అరబ్బు దేశాలు ఒకదానిపై మరొకటి కయ్యానికి కాలుదువ్వడం వల్ల, ఇస్లామ్‌పై ఉండే విశ్వాసం తొలగిపోదా? అని మరొక వ్యక్తి ప్రశ్నించాడు. దీనికి శ్రీ అడియార్ :

"పైకి ఈ ప్రశ్నలో పస ఉన్నట్లు కనిపిస్తోంది, కాని వాస్తవం వేరు. విశ్వాసం తొలగిపోవడానికి ఏదయినా బలమైన కారణం కావాలి. చైనా మరియు వియత్నాం – ఈ రెండు ఎర్ర జెండాలను ఎగురవేసిన కమ్యూనిస్టు దేశాలు అయినప్పటికీ ఆ రెంటి మధ్య యుద్ధం జరగడం మనం చూశాము. దీన్ని పురస్కరించుకుని భారత కమ్యూనిస్టులు, కమ్యూనిజంపై గల తమ

నమ్మకం కాస్తా పోయిందని అంటున్నారా ? - నిశ్చయంగా వారు అలా అనలేరు. అలాగే హిట్లర్, చర్చిల్ ఉభయులూ క్రైస్తవులే. వారిద్దరి నేతృత్వంలో జర్మని - ఇంగ్లండ్‌ల మధ్య భీకర సంగ్రామం జరిగింది. ఈ యుద్ధం వల్ల క్రైస్తవుల హృదయాల నుండి తమ ధర్మం పట్ల గల విశ్వాసం పటాపంచలయిందా ? - నిశ్చయంగా కాదు. భారత దేశంలోని వివిధ దేవాలయాల్లో అనేకమార్లు పోట్లాటలు జరిగినై. మరి ఆ దేవాలయ పూజారులు భయభక్తుల పట్ల విసుగుచెంది, దైవ తిరస్కారులయ్యారా ? - ఎప్పటికీ కాదు.

ఈ సంఘటనలన్నీ నిజమయితే, కేవలం ముస్లిమ్ దేశాలు పరస్పరం ఘర్షణపడినంత మాత్రాన ఇస్లామ్‌పై అపనమ్మకం కలిగే ఆస్కారమెక్కడుంది?

ఇవయితే వివిధ దేశాల మధ్యగల ఘర్షణలే. దీనికి విశ్వాసంతో, ధర్మంతో ఎలాంటి సంబంధం లేదు. ఈ ఘర్షణలు నేడుంటే రేపు సమసిపోగలవు. కాని విశ్వాసం లేక నమ్మకమనేది నేటికీ, రేపటికీ మరేనాటికైనా మిగిలి ఉంటుంది. ఇది మార్పుచెందే, పతనమయ్యే వస్తువు మాత్రం కాదు.

నేడు ప్రపంచంలో కమ్యూనిజం ఒక శక్తి అయితే దానికి పోటీగా పెట్టుబడిదారీ వ్యవస్థ మరో శక్తిగా ఉంది. ఇక తృతీయ శక్తి అనదగ్గది ప్రపంచంలో ఏదయినా ఉందంటే ఆ శక్తి ఇస్లామ్‌దే.

ఈ మొదటి రెండు శక్తులూ, చివరికి తృతీయ శక్తి (ఇస్లామ్) ముందు తలఒగ్గుతాయి. చరిత్ర చాటి చెప్పేది కూడా ఇదే. గత చరిత్రయినా, వర్తమాన చరిత్ర అయినా, భవిష్యత్‌కాల చరిత్ర అయినా - అంతా పై సత్యాన్నే ప్రస్ఫుటంగా సూచిస్తూ ఉన్నాయి.

ముస్లిమ్ దేశాలన్నీ ఒకనాడు నిరుపేద దేశాలే. కాని అరబ్బు ఎడారుల నుండి ప్రపంచంలో వెలుగు వ్యాపిస్తుందన్నది మహనీయ ముహమ్మద్

(సఅసం) చేసిన ప్రకటన. నేడక్కడ రాళ్ళల్లో నుండి పెట్రోలు★ తోడటాన్ని మనం చూస్తూనే ఉన్నాం.

అరబ్బులు గనక ఇస్లామీయ ఉద్బోధనలను మరింతగా విశ్వసించి, ఆచరించినట్లయితే వారిపై దైవ కారుణ్య వర్షం ఇహలోకంలోనూ అమితంగా పడగలదు.

నాయక శిఖామణి (సఅసం) జీవితం మచ్చలేనిది. అలాగే మొదటి నాలుగు ఖలీఫాల జీవితం కూడా. ఆ తరువాత కొందరు నవాబులు, చక్రవర్తుల పాదాలు తప్పటడుగులు వేశాయి. వారి వల్ల కొన్ని పొరబాట్లు జరిగాయి. అయితే ఇస్లామ్ అనుయాయులకు తమ ధర్మంపై, తమ నియమబద్ధమైన జీవన వ్యవస్థపై అచంచలమయిన విశ్వాసం నిత్యం ఉంటూ వచ్చింది. ప్రారంభంలో వారి సంఖ్య లక్షల్లో ఉంటే నేడు కోట్లకు చేరుకుంది. దీన్నిబట్టి తేలేదేమంటే ముస్లిమ్‌లు, ముస్లిమ్ దేశాల లోపాలు, పొరపొచ్చాల వల్ల ఇస్లామ్‌పై గల విశ్వాసం సడలిపోయే ప్రశ్నే ఉత్పన్నం కాదు. వ్యక్తుల వల్ల పొరబాట్లు జరిగినంతమాత్రాన సిద్ధాంతాలు అసత్యాలు కాజాలవు. పరాభవం నిష్ప్రయోజనంగా మారజాలవు.

యదార్థమేమంటే, ప్రపంచంలోని జటిలమయిన సమస్యలకు పరిష్కారం, ప్రపంచ ప్రజల కష్టాలను కడతేర్చగల పెన్నిధి ఇస్లామ్ మాత్రమే. సూర్యుడు ఒకవేళ కనుమరుగైతే వెలుగు ఎక్కడి నుండి వస్తుంది? సముద్రం ఉప్పును కోల్పోతే ఉప్పు ఎక్కడి నుండి లభిస్తుంది? జలాశయం గనక ఎండిపోతే జలధార ఎలా వస్తుంది ? ఇస్లామ్ గనక లేకపోతే ప్రపంచం మరియు మానవజాతి బాధలకు నివారణ ఎక్కడ లభిస్తుంది ?

---

★ పెట్రో అనేది లాటిన్ పదం. దాని అర్థం రాయి. పెట్రోల్ యొక్క అర్థం అనుగ్రహించబడినది అని.

# ఇస్లామ్‌లో శిక్షలు

ముస్లిములు నిర్దయులు అనే భావన సాధారణంగా ముస్లిమేతర సోదరులలో ఉంది. దీన్ని బాగా ప్రచారం చేశారు కూడా. ముస్లిమ్ సమాజంలో శిక్షలు కఠినంగా ఉంటాయని, దొంగతనం చేసినవారికి చేతులు నరుకుతారని, వ్యభిచారం చేసినవారిని రాళ్ళతో కొట్టి శిక్షిస్తారని ప్రచారంలో ఉన్న విషయాలు. దీనికితోడు ముస్లిములు దాడులు జరిపి, దేవాలయాలను ధ్వంసం చేసి దౌర్జన్యాలను జరిపారని కూడా ప్రచారం జరిగింది. వీటిని పురస్కరించుకుని ముస్లిములు దౌర్జన్యపరులని, నిర్దయులని చెప్పబడుతోంది.

ఈ నిందలను ఆపాదించే ముందు ప్రజలు తమనితాము పరిశీలించుకోవాలి. అప్పుడే అసలు యదార్థం తేటతెల్లమౌతుంది.

- ★ కొడుకు దూడను బలిచేసినందుకు, మనుస్మృతి ఆజ్ఞానుసారం చోళన్ (CHOLAN) తన కొడుకును ఉరికంబం ఎక్కించాడు. దీన్నేమనాలి ?
- ★ రాజుగారి తోట నుండి ఓ పండు రాలి నదిలో పడి ప్రవహిస్తూ రాగా ఆ పండును ఒక బాలిక ఎత్తుకుని తిన్నది. నన్నన్ (NUNNEN) అనే చక్రవర్తి ఈ నేరానికి ఆ బాలికకు మరణశిక్ష విధించాడు.
- ★ ప్రఖ్యాత కవి కన్నగి కాలి కడియాన్ని ఓ కంసాలి దొంగిలించగా ఆనాటి కంసాలులందరినీ అంతమొందించడం జరిగింది.
- ★ జ్ఞాన సముద్రుడనే పిష్యా ఒక ఆశ్రమంలో బస చేస్తే సమణ్ణర్ అనే జాతి ప్రజలు ఆ ఆశ్రమానికి నిప్పుపెట్ట ప్రయత్నించిన నేరానికి ఆ జాతికి చెందిన 8 వేల మంది ప్రజల్ని ఉరితీశారు.

★ ఉప్పర్ అనే వ్యక్తి మతం మార్చుకున్న నేరానికి అతన్ని రాతితో కట్టి సముద్రంలో పడవేశారు, అతడెలాగో బ్రతికి బయటపడగా తీసుకెళ్ళి సున్నపు భట్టీలో పడవేశారు.

★ తెనాలి రామలింగని కథలో ఒకటేమంటే, రాజాజ్ఞకు తలవంచని వారిని సజీవ దహనం చేసేవారు. మరికొందర్ని ఏనుగు పాదాల క్రింద నులిమేసేవారు.

★ తమిళనాడుకు చెందిన తిరుమలై రాజుకు మైసూరు రాజుకు మధ్య జరిగిన యుద్ధంలో ప్రజల ముక్కులు ఛేదించబడ్డాయి. మైసూరు రాజు తమిళనాడుపై పగ తీర్చుకోడానికి యుద్ధం చేసి ప్రత్యర్థి ప్రజల ముక్కులు, పెదాలు కోసివేశాడు. ప్రతీకారవాంఛతో తమిళ రాజు మైసూరుపై దండెత్తి శత్రువుల ముక్కులు, పెదాలు కోసిపారేశాడు. (నాయక చక్రవర్తుల చరిత్ర పుస్తకాల నుండి సేకరించబడింది.)

★ బాలలను బలిదానమివ్వడం, మానవ అవయవాలను దేవతలకు నజరానాలుగా సమర్పించే సంప్రదాయాలు నేటికీ మన దేశంలో అనేకచోట్ల కానవస్తాయి. ఇవి దయాదాక్షిణ్యాలతో కూడిన పనులేనా?

★ పాశ్చాత్య ప్రపంచంలో శిలువ వేసే శిక్ష సర్వసామాన్యం - ఏసుక్రీస్తుకు శిలువ వేసే ప్రయత్నం జరిగింది. సెంట్ పీటర్‌ను తలక్రిందులుగా వ్రేలాడదీసి శిలువ వేయడం జరిగింది.

★ జోన్ ఆఫ్ ఆర్క్‌ను సజీవంగా దహనం చేసిన ఉదంతం చరిత్ర మరువజాలదు.

★ ప్రొటెస్టెంట్‌లు (క్రైస్తవ మతంలోని ఒక శాఖ)గా మారినవారి తలలు బద్దలుకొట్టి మెదడులను నుగ్గు నుగ్గు చేశారు. ఇంకొందరిని సజీవంగా కాల్చిపారేశారు.

★ పశువుల వలె మానవులను ఆఫ్రికా నుండి ఈడ్చుకొచ్చి యూరప్, అమెరికా వీధుల్లో బానిసలుగా విక్రయించారు. ఇదీ పాశ్చాత్య నాగరికత!

★ హిట్లర్ గ్యాస్ ఛాంబర్స్‌లో అసంఖ్యాక మానవులను సంహరించాడు.

★ నేటికీ భారతదేశంలోని వివిధ మూలల, మత కలహాలలో మానవ సోదరుల్ని సజీవంగా దహనం చేస్తున్నట్లు వార్తలు వస్తుంటాయి. విశ్వపురం, జంషెడ్పూర్, బైల్లా సంఘటనలు దీనికి ప్రత్యక్ష సాక్ష్యాలు.

ఈ విధంగా ప్రపంచంలోని ప్రతి దేశ చరిత్ర హింసా దౌర్జన్యాల మచ్చలతో కానవస్తుంది. వివిధ తత్వాల ప్రాతిపదికపై మనిషి హింసాదౌర్జన్యాలను కొనసాగిస్తున్న చోట అతని ద్వారా దయాదాక్షిణ్యాలు విశాల హృదయతలు కూడా వ్యక్తమవుతున్నాయి. హింసాయుత భావాలను తుదముట్టించి వాటిస్థానే నిజమయిన దయాకరుణల శిక్షణ ఇచ్చిన సత్యధర్మం ఉందంటే అది ఇస్లామ్ మాత్రమే.

కొన్ని మతాల్లో దేవుని గుణగణాలను విభజించి ఒక్కో గుణానికి ఒక్కో దైవం నిర్ణయించటం జరిగింది. మరికొన్ని మతాల్లో దేవుడు నిర్గుణుడుగా ఎంచబడతాడు. కాని ఇస్లామ్‌లో దైవం పరిపూర్ణంగా కారుణ్యస్వరూపుడై కానవస్తాడు. స్వయంగా మహనీయ ముహమ్మద్(సఅసం) ఆవిర్భావానికి కారుణ్యంగా పేర్కొనడం జరిగింది. దివ్య ఖుర్ఆన్ దైవాన్ని అనేక చోట్ల దయామయుడు, కృపాశీలుడు అని సూచించింది. తనలోని కారుణ్యగుణం తన దాసులయిన మానవుల జీవితాల్లోనూ ఉండటాన్నే అల్లాహ్ ఇష్టపడతాడు.

ప్రతి పనిని కరుణించేవాడు, కనికరించేవాడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభించాలనేది ఇస్లామ్ ఉపదేశం. ఇస్లామ్ నేర్పిన సలామ్ చేసే పద్ధతి

ద్వారా కూడా కరుణావాత్సల్యాలే వ్యక్తమవుతాయి. నిజమైన ముస్లిమ్ ఇతరులకై దయామయుడు కరుణాకరునివంటివాడు. ఇదే ఖుర్‌ఆన్ బోధన. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) విధానం కూడా ఇదే. ఎవరయినా ఈ కారుణ్యమార్గం నుండి తప్పిపోతే ఇస్లామ్ వారిని తిరిగి ఈ సన్మార్గాన తాకీదు చేస్తుంది.

టర్కీకి చెందిన ఒక పాలకుడు సుల్తాన్ సలీమ్. అతడు తన క్రిందివారితో చాలా కఠినంగా వ్యవహరించేవాడు. తన దేశంలోని అన్ని మతాలను, భాషలను రూపుమాపి ఒకే మతం, ఒకే భాషను స్థాపించాలని సంకల్పించాడు. అయితే అప్పటి ముస్లిమ్ విద్వాంసులు, షేఖుల్ ఇస్లామ్ తీవ్రంగా ప్రతిఘటించడంతో సుల్తాన్ తన పథకాన్ని విరమించుకున్నాడు.

వినోదం కొరకు పశువులు, పక్షుల మధ్య (పందెం వేసి) పోరాటం పెట్టే సంప్రదాయం అనేక దేశాల్లో నేటికీ ఉంది. ఇస్లామ్ దీన్ని గట్టిగా వ్యతిరేకించింది.

అదీ బిన్ హాతిమ్ చీమలకు ఆహారం వేసేవారు. ఇదీ ఇస్లామ్ శిక్షణా ప్రభావం !

రహదారిపై నడిచే హక్కు జంతువులకు కూడా ఉంది. వాటిని తొలగించడానికి వీల్లేదు. షిరాజీ ఈ ప్రకటన చేశాడు. ఇలాంటి దృష్టాంతాలు ముస్లిమ్‌ల చరిత్రలో లభిస్తాయి.

ఒంటెపై ముగ్గురు వ్యక్తులు కూర్చున్నపుడు బరువుతో ఒంటె వంగినట్లు గ్రహిస్తే వెంటనే ఒకరిని దించేయాలి. ఇది కూడా ఇస్లామ్ ఉపదేశమే.

కారుణ్య శిక్షణలనిచ్చిన ఇస్లామ్ పెద్ద నేరాలు చేసిన నేరస్తుల్ని

కఠినంగా శిక్షించాలని కూడా నిర్దేశించింది. నిశ్చయంగా ఇస్లామ్ దొంగతనం చేసినవాని హస్తాన్ని ఖండించమని ఆజ్ఞాపించింది. అయితే దాని ఫలితాలను ప్రభావాలను కూడా చూడాలి. ఈ శిక్షాస్మృతి అమలులో ఉన్న ముస్లిమ్ దేశాలలో ఇలాంటి నేరాలు ఇతర దేశాలతో పోల్చినప్పుడు అసలు జరగవని చెప్పవచ్చు.

అరబ్బు దేశాలలో హంతకుని మెడ ఖడ్గంతో ఖండించబడుతుంది. కాగా, ఇతర దేశాల్లో ఉరి శిక్ష వేయడమో లేక విద్యుత్ కుర్చీపై కూర్చుండబెట్టి మరణ శిక్ష విధించడమో జరుగుతోంది. ఉరికంబం లేక విద్యుత్ ద్వారా చాలా కష్టంతో ప్రాణం పోతుంది. అందువల్ల ఖడ్గంతో మెడను ఛేదించి మరణ శిక్ష విధించే పద్ధతి స్వీకరించబడింది.

★ ★ ★

# ముస్లింలు దేవాలయాలను పడగొట్టారా ?

ముస్లిములు హిందూ దేవాలయాలను పడగొట్టారనే నిరాధారమయిన ఆరోపణ ఒకటుంది.

అలాంటి ఆరోపణలను అంటకట్టేటప్పుడు, స్వయంగా భారతావనిలోని ఇతరులు కూడా ఇటువంటి చేష్టలకు పాల్పడ్డారనే దాన్ని మనం మరచి పోతాము. మన దేశంలోని సుమణ్ణన్ అనే ఓ తెగవారి దేవాలయాలు కూల్చబడ్డాయి. నాగపట్నంలోని విగ్రహాలు దోచుకోబడ్డాయని, అక్కడి బంగారాన్ని తిరుమంగై కి చెందిన ఆళ్వారులు ఎత్తుకుపోయారని మనం మర్చిపోయాం.

ముస్లిములు దేవాలయాలను పడగొట్టారనయితే మనం అంటాం. అయితే, వారు హిందువుల దేవాలయాలకు జాగీరులను ప్రదానం చేసిన యదార్థాన్ని మనం విస్మరిస్తాం. ఒకవేళ ముస్లిములు మందిరాలను పడగొట్టి ఉంటే దానికి వేరే ఏమైనా కారణాలు కావచ్చుగాని ఇతరుల ఆరాధనాలయాలను విధ్వంసం చెయ్యమని మాత్రం ఇస్లామ్ ప్రబోధించలేదు.

ముస్లిములు దేవాలయాలను పడగొట్టి విగ్రహాలను విరగ్గొట్టినట్లు భారతదేశ చరిత్ర ద్వారా విదితమవుతోంది కదా ! దీన్ని గురించి మీరే మంటారు? అని ఈ సందర్భంగా ఒకాయన అడిగారు.

యదార్థమేమంటే మన చేతుల్లో ఉన్న భారతదేశ చరిత్ర నిజమయిన పరిశోధనాత్మకంగా క్రోడీకరించిన చరిత్ర కాదు. ముస్లిములు ఇతర మతాలవారి

మధ్య శత్రుత్వాన్ని జనింపజేసే ఉద్దేశ్యంతో పాశ్చాత్య ఉపద్రవ జనకులు ఈ చరిత్రను వ్రాశారు. ఒకవేళ ముస్లిములు దేవాలయాలను పడగొట్టి విగ్రహాలను కూల్చినట్లు ఎవరయినా వాదించినా వారికి నా జవాబు - ఇస్లామ్‌లో ఇతర మతస్థుల ఆరాధనాలయాలను విధ్వంసం చేసే అనుమతి ఎంతమాత్రం లేదన్నదే. ఈ విషయంలో ముహమ్మద్ గజనవీ అయినా, అతని సైనికాధికారులయినా, వారి ఈ చర్యకు ఇస్లామ్‌తో ఏలాంటి సంబంధం లేదు. పైపెచ్చు ఇస్లామీయ రాజ్యం ముస్లిమేతరుల ఆరాధనాలయాలను పరిరక్షించే బాధ్యతలు కలిగి ఉంటుంది.

విగ్రహారాధన చేయరాదు అనే చైతన్యాన్ని ఇస్లామ్ ప్రజల్లో తీసుకు వస్తుంది. దానికోసం అది బలమయిన ఆధారాలను ముందుంచుతుంది. ధర్మావలంబనలో ఎలాంటి బలాత్కారం లేదు. ఖండితంగా ఇస్లామ్ ఈ ప్రకటన చేసింది. ప్రజల హృదయ జగత్తు షిర్క్ (బహు దైవారాధన), కుఫ్ర్ (తిరస్కారం)లకు అతీతంగా - పవిత్రంగా ఉండాలని, అందులో సత్యధర్మ వెలుగు ప్రసరించాలని అది కాంక్షిస్తుంది. అందుకోసం అది పిలుపు, ప్రచారం పద్ధతుల్ని అనుసరిస్తుంది. బలాత్కార వైఖరి దాని స్వభావానికే విరుద్ధమయింది.

మహనీయ ముహమ్మద్ (సఅసం) కాబా గృహాన్ని విగ్రహాల నుండి ప్రక్షాళనం చేశారు. ఇదొక చారిత్రక సత్యం. 'కాబా' దైవగృహం అన్న యదార్థాన్ని ఇక్కడ మరువరాదు. ప్రజలు తమ అజ్ఞానం, మార్గభ్రష్టతల కారణంగా దాన్ని విగ్రహ నిలయంగా మార్చివేశారు. 'కాబా' కేవలం అల్లాహ్ దాస్యం కొరకే నిర్మించబడిందన్న విషయాన్ని అరబ్బు బహుదైవారాధకులు సయితం ఒప్పుకునేవారు. కాలక్రమేణా దైవగృహమయిన కాబాలో అనేక విగ్రహాలను తెచ్చి ప్రతిష్ఠించారు. ఇది పూర్తిగా తప్పయిన విషయం. ఆ విగ్రహాలను నాయక శిఖామణి (సఅసం) కాబాలో నుండి తొలగించి, దాన్ని

మునుపటిలా ఒకే దేవుని ఆరాధనా కేంద్రంగా పునరుద్ధరించారు.

దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) క్రైస్తవుల, యూదుల ఆరాధనా లయాలను ధ్వంసం చేసినట్లు ఏ ఒక్క దృష్టాంతమూ కానరాదు.

ఇస్లామ్ ఖడ్గబలంతోనే వ్యాపించిందిగాని, అది తనలోని ఉత్తమ గుణాల ద్వారా మాత్రం కాదు అని మరో ప్రశ్న వచ్చింది.

ఇది కేవలం నిరాధారమైన వాదన మాత్రమే. ధార్మిక విషయాల్లో ఒత్తిడిని దివ్య ఖుర్ఆన్ స్పష్టమయిన పదాల్లో ఖండించింది.

ఇస్లామ్‌పై ఆక్షేపణ చేసేవారు ప్రపంచ చరిత్రను విస్మరిస్తారు. నోరు తెరిస్తే చాలు, ఇస్లామ్‌కు వ్యతిరేకంగా ఆధారంలేని ఆరోపణల పరంపర మొదలవుతుంది. ప్రపంచ చరిత్రపై దృష్టిని సారిస్తే ఎన్నో ప్రభుత్వాలు తమ తమ మతాలను అధికార బలంతో వ్యాపింపజేసినట్టు తెలియగలదు. ఎక్కడో ఎందుకు, భారత దేశంలో బౌద్ధమత చరిత్రను తీసుకోండి. ఇక్కడ బౌద్ధమతం అశోకుడు, హర్షుని రాజ్యాధికార బలంతోనే విస్తరించిందనేది సుస్పష్టం. సమణ్ణర్ మతం కూడా ఇలాగే వ్యాపించింది. ఒక హయాములో నయితే భారతదేశ రాజులు, రారాజులు అందరూ సమణ్ణర్ మతస్థులే. ఇంకా భారతదేశమంతటా ఈ మతమే ఆవరించి ఉండింది. ఆ తర్వాత వైదిక ధర్మ (హిందూ మతం) యుగం వచ్చింది. ఇదీ రాజ్యాధికార అండదండలతో ఇతర మతావలంబీకుల్ని అంతమొందించింది. ఆ సమయంలో ప్రజల్ని ఉరితీయడం కూడా జరిగింది – ఇవీ ఈ దేశాన్ని హిందూ దేశంగా మార్చడానికి అనుస రించబడిన విధానాలు.

ఇంకా భారత రాజులు విదేశాలపై కూడా దాడి జరిపి తమ తమ ధర్మా లను విస్తరింపజేశారు. జావా, సుమిత్ర, కంబోడియా దీవులలో నేటికీ హిందూ మత అవశేషాలు కనిపిస్తాయి. క్రైస్తవ మతావలంబీకులయిన

రాజులు వివిధ దేశాలపై దండయాత్రలు చేసినపుడు వారు క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి కృషి చేశారు.

ఇప్పుడు ఒకవేళ కొందరు ముస్లిమ్ రాజులు, ఇస్లామ్ పరివ్యాప్తికై తమ పలుకుబడిని వినియోగించుకున్నట్లు వాదించినా అది వింతయిన విషయమేమీ కాదు - దాని ఆధారంగా ఇస్లామ్‌ను తూలనాడటానికి నేటి వైజ్ఞానిక యుగంలో కూడా ఇస్లామ్ తన సొంత శక్తిద్వారా కాదు కరవాలం శక్తి ద్వారా వ్యాపించిందన్న పసలేని ఆరోపణలు చేయడం జరుగుతోంది.

తుపాకి తూటా ద్వారా అధికార పీఠాన్ని అధిరోహించగోరే పెద్ద మనుషులు ఇలాంటి ఆరోపణలు చేయడం ఆశ్చర్యకరం. కాని వారు స్వయంగా తమ పరిస్థితిని గురించి అసలు పట్టించుకోరు.

నేటి యుగంలో ధర్మావలంబన విషయంలో బలవంతం లేక ప్రలోభం అనే ప్రశ్నే తలెత్తదు. అయితే తాము నమ్మిన భావాలు, అభిప్రాయాలపై నిలకడగా ఉండీ, వాటిని ప్రచారం చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. నేటి యుగంలోనూ ఇస్లామ్ స్వీకరించేవారి సంఖ్య తక్కువేమీ లేదు. మరి ఏ కరవాలం వారిని లొంగదీసింది? అదేదో ఇనుప కరవాలం కాదు. అదయితే సత్యంలోని అయస్కాంత శక్తి - అది నేటికీ ప్రజల్ని తన వైపుకు ఆకర్షిస్తోంది.

— : సమాప్తం : —